DD9 వార్త
తెలుగు దినపత్రిక
www.dd9vaartha.com
సంపుటి : 01 సంచిక : 91 సోమవారం, నవంబర్ 17, 2025, పేజీలు - 10 వెల : 3/-

**నువ్వు ఎదగాలంటే ఇలా ఉండాలి**


అన్నీ తెలుసుకో, అన్నీ నేర్చుకో కానీ..
ఏమీ తెలియని వానిలాగే కనిపించు
సమాజానికి.. ఎందుకంటే..
లోకానికి ఈర్ష అసూయలు పెరిగిపోయాయి..
ఎదిగేవాణ్ణి చూసినా, బాగుపడేవాడు బ్రతికినా
చూసి తట్టుకోలేకపోతోంది...!

## మళ్లీ ఎన్‌కౌంటర్ మావోయిస్టులు మృతి



వివరాలు 6లో


# నవీన్ యాదవ్‌కు కీలక పదవి



**హైదరాబాద్ :** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా భారీ మెజార్టీతో ఘన విజయం సాధించిన నవీన్ యాదవ్‌కు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రభుత్వం కీలకమైన పదవిని కట్టబెట్టేందుకు సన్నాహాలు చేస్తోంది. ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే ఆయనకు ప్రభుత్వ విప్ పదవిని ఇవ్వాలని సీఎం రేవంత్ రెడ్డి నిర్ణయించినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ప్రభుత్వ విప్ పదవి రాష్ట్ర మంత్రి హెూదాకు సమానమైన గౌరవాన్ని, అధికారాలను కలిగి ఉంటుంది. ప్రభుత్వ విప్ పదవికి నవీన్ యాదవ్‌ను ఎంపిక చేయడానికి ప్రధానంగా సామాజిక, ప్రాంతీయ సమీకరణాలే కారణమని కాంగ్రెస్ అధిష్టానం భావిస్తోంది. తెలంగాణ ప్రభుత్వంలో ప్రస్తుతం ముగ్గురు విప్‌లు ఉన్నారు. మరో నలుగురిని నియమించుకునే అవకాశం ప్రభుత్వానికి ఉంది. ఈ ఖాళీలలో ఒకదాన్ని నవీన్ యాదవ్‌కు కేటాయించడం ద్వారా పలు రాజకీయ లక్ష్యాలను చేరుకోవాలని కాంగ్రెస్ వ్యూహం రచిస్తోంది. ఇటీవల జరిగిన మంత్రివర్గ విస్తరణలో హైదరాబాద్ జిల్లా నుంచి అజారుద్దీన్‌ను మంత్రిగా కేబినెట్‌లోకి తీసుకున్నారు. ఒకే జిల్లా నుంచి మరో మంత్రి పదవి ఇవ్వడం సాధ్యం కాదని నిర్ణయానికి వచ్చిన కాంగ్రెస్ అధిష్టానం.. విప్ పదవి ద్వారా మంత్రి స్థాయి హెూదాను అందించేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు తెలుస్తోంది. నవీన్ యాదవ్ బలమైన బీసీ సామాజికవర్గానికి చెందినవారు కావడం ముఖ్యమైన అంశం. బీసీలకు పాలనలో తగిన ప్రాధాన్యం ఇస్తున్నామని సందేశం ఇవ్వడానికి ముఖ్యమంత్రి ఈ నిర్ణయానికి మొగ్గు చూపు తున్నట్టు సమాచారం. గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో యాదవ సామాజిక వర్గం పెద్ద సంఖ్యలో ఉండటం కూడా మరో కారణంగా తెలుస్తోంది. ఇంతకాలం గ్రేటర్ పరిధి నుంచి ఆ సామాజిక వర్గానికి చెందిన బలమైన ఎమ్మె ల్యేలు, ఎమ్మెల్సీలు కాంగ్రెస్ పార్టీలో లేరు. ఇప్పుడు నవీన్ యాదవ్ విజయం సాధించి, ఎమ్మెల్యేగా ఎన్నికవడం ద్వారా ఆయనకు విప్ పదవి ఇవ్వడం వల్ల యాదవ సామాజిక వర్గానికి కాంగ్రెస్ పార్టీలో అత్యధిక ప్రాధాన్యం దక్కినట్లు అవుతుంది. రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలు, భవిష్యత్తు సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో గ్రేటర్ హైదరాబాద్‌లోని యాదవ ఓటు బ్యాంకును పటిష్టం చేసుకోవడానికి ఈ నిర్ణయం వ్యూహాత్మకంగా ఉపయో గపడుతుందని అధిష్టానం అంచనా వేస్తోంది. ప్రభుత్వ విప్ హెూదా కేవలం శాసనసభ వ్యవహారాలకే పరిమితం కాదు. ఈ హెూదాతో నవీన్ యాదవ్‌కు నగరంలోని ప్రజలకు సంబంధిం చిన సమస్యలను పరిష్కరించేందుకు, అభివృద్ధి పనులపై జిల్లా కలెక్టర్, ఇతర ఉన్నతాధికారులతో నేరుగా సమావేశాలు నిర్వహించేందుకు, ప్రభుత్వ కార్యక్రమాలలో చురుకుగా పాల్గొనేందుకు అవకాశం ఉంటుంది. అంతేకాకుండా, విప్ హెూదాకు ఉండే అధికారం, అధికారిక వాహనం, కార్యాలయం, ఇతర ప్రోటోకాల్ సౌకర్యాలు నగరంలో ఆయన పలుకుబడిని పెంచుతాయి. ఈ పదవి ద్వారా నగరంలో కాంగ్రెస్ పార్టీని మరింతగా బలోపేతం చేసేందుకు, యాదవ సామాజిక వర్గంతో కాంగ్రెస్ బంధాన్ని పటిష్టం చేసేందుకు వీలుంటుందని పార్టీ వర్గాలు ధీమా వ్యక్తం చేస్తున్నాయి. ముఖ్యమంత్రి నిర్ణయంపై త్వరలోనే అధికారిక ఉత్తర్వులు వెలువడే అవకాశం ఉంది.

## రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్

### - ఒకే వేదికపై రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు




**హైదరాబాద్ :** ప్రతిష్టాత్మక రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డ్స్ కార్యక్రమం ఈ రోజు సాయంత్రం 5:30 గంటలకు రామోజీ ఫిలిం సిటీలో అత్యంత వైభవంగా జరగనుంది. ఈ కార్యక్రమంలో రెండు తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు నారా చంద్రబాబు నాయుడు, రేవంత్ రెడ్డి, గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు రాంమోహన్ నాయుడు, కిషన్ రెడ్డిలు పాల్గొననున్నారు. జర్నలిజం, గ్రామీణాభివృద్ధి, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా ఏడు రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు రామోజీ ఎక్స్‌లెన్స్ అవార్డులను ప్రధానం చేయనున్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా రామోజీ నిఘంటువులను కూడా విడుదల చేయనున్నారు. సీఎం చంద్రబాబు ఘన నివాళి. రామోజీ రావు జయంతి సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన ఎక్స్ ఖాతాలో ఓ పోస్టు పెట్టారు. ఆ పోస్టులో.. 'తెలుగు వెలుగు పద్మవిభూషణ్ రామోజీ రావు జయంతి సందర్భంగా ఘననివాళు లు. నిష్పక్షపాత జర్నలిజానికి నూతన ప్రమాణాలు ఏర్పరచి, ఈనాడు సంస్థల ద్వారా సమాజంపై అపూర్వమైన ప్రభావం చూపిన మహనీయుడు ఆయన. వ్యాపారాల్లోనూ ప్రజాహితం, విలువలు, నైతికతను ప్రతిష్టించిన అరుదైన దూరదృష్టి కలిగిన వ్యక్తి రామోజీ. ఆయన జయంతి సందర్భంగా రామోజీ చూపిన మార్గాన్ని శాశ్వత స్ఫూర్తిగా మలచుకుందాం' అని పేర్కొన్నారు.

# బండి సంజయ్, కిషన్ రెడ్డికి ఎంపీ చామల ప్రశ్నలు




**హైదరాబాద్, నవంబర్ 16:** కేంద్రమంత్రి అనే హెూదాను మర్చిపోయి మాట్లాడటం కేంద్ర హెూంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌కు అలవాటయిందని కాంగ్రెస్ పార్టీకి చెందిన భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి విమర్శించారు. హిందువులంతా ఏ పార్టీలో ఉన్నా బీజేపీలో చేరాల్సిన పరిస్థితి వచ్చిందని బండి సంజయ్ అంటున్నారని.. ఇది దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. కేంద్ర క్యాబినెట్ మంత్రి కిషన్ రెడ్డి ఎంపీగా ఉన్న సికింద్రాబాద్ లోక్‌సభ పరిధిలోని జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నికల్లో బీజేపీకి డిపాజిట్ గల్లంతయిందని.. అసెంబ్లీ ఎన్నికల కంటే, తాజా ఉప ఎన్నికలో బీజేపీకి ఓట్లు తగ్గాయని ఎంపీ ఎద్దేవా చేశారు. బీజేపీ లోపాయికారిగా బీఆర్ఎస్ పార్టీకి మద్దతు ఇచ్చిందా..? బండి సంజయ్ ప్రజలకు క్లారిటీ ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. 'బిఆర్ఎస్‌కు మద్దతు ఇచ్చారో లేదో బండి సంజయ్‌కు తెలియకపోతే, పార్టీలో ఇంటర్నల్‌గా చర్చ చేసుకోండి. బండి సంజయ్ కులాలు, మతాల మధ్య చిచ్చు పెడుతున్నారు. రాష్ట్రంలో ఎవరికి ఓటు వేయాలో ప్రజలకు తెలుసు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో నవీన్ యాదవ్ ఒక కులం, ఒక మతం ఓట్లతో గెలవలేదు. అన్ని వర్గాల వారు ఓట్లు వేశారు. రేవంత్ రెడ్డి ప్రజాపాలనలో బీసీ బిడ్డకు టిక్కెట్ ఇచ్చారు. ప్రజలు ఆదరించారు. తెలంగాణ రాష్ట్రానికి నిధుల కోసం కిషన్ రెడ్డి, బండి సంజయ్ కృషి చేయాలి. సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అభివృద్ధి కోసం పదే, పదే ఢిల్లీలో కేంద్ర మంత్రులను కలుస్తున్నారు. గత పాలకులు దౌర్జన్యంగా దోచుకున్న తెలంగాణను కాపాడాలి. మోదీ, అమిత్ షా పై కిషన్ రెడ్డి, బండి సంజయ్ ఒత్తిడి తెచ్చి రాష్ట్రానికి నిధులు తేవాలి. హైదరాబాద్ మెట్రో విస్తరణ, ట్రిపుల్ ఆర్, మూసీ పునరుజ్జీవానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలి. బండి సంజయ్ కులాలు, మతాల ప్రస్తావన పక్కన పెట్టి అభివృద్ధి గురించి మాట్లాడాలి. రాబోయే పార్లమెంట్ సమావేశాల్లో తెలంగాణకు రావాల్సిన నిధుల గురించి కిషన్ రెడ్డి, బండి సంజయ్ చొరవ చూపాలి' అని చామల డిమాండ్ చేశారు.

## అవినీతి ఊబిలో విద్యాశాఖ




**ములుగు :** ములుగు జిల్లాలోని విద్యాశాఖ అవినీతి ఊబిలో కూరుకుపోయింది. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక సొంత ఇలాకలో నిబంధనలు పాటించకుండా అక్రమంగా ఏఎంవోను నియమించడంపై ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నా యి. ఇక్కడి డీఈవో పాణి, కార్యాలయ ఉద్యోగి దిలీప్ కొన్ని నెలల క్రితం లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడిన విష యం తెలిసిందే. అయినా కలెక్టర్‌తో సహా ప్రజాప్ర తినిధులు పట్టించుకోలేదు. ఈ క్రమంలో సమగ్ర శిక్షలో ఏఎంవోగా ఉన్న మల్లారెడ్డిని తప్పించి నూతన నియామకానికి దరఖా స్తులు తీసుకున్నారు. నిబంధనల ప్రకారం రాష్ట్రస్థాయి పరీక్ష రాసినవారిని లేదా గెజిటెడ్ హెడ్మాస్టర్‌లను తీసుకోవాల్సి ఉంటు ంది. వారు లేకపోతే వేరే వారిని నియమి ంచాల్సి ఉంటుంది. కానీ విద్యాశాఖ తుంగలో తొక్కి సూల్ అసిస్టెంట్ శ్యామ్‌సు ందర్‌ను ఏఎంవోగా నియమించడంతో ఉపాధ్యాయ సంఘాలు మండిపడుతున్నాయి

## ప్రపంచంలోకెల్లా భారతీయ కుటుంబ వ్యవస్థ చాలా గొప్పది



**అమరావతి, నవంబరు16 :** భారత రాజ్యాంగం అందించే స్ఫూర్తి చాలా గొప్పదని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడువ్యాఖ్యానించారు. అద్భుతమైన రాజ్యాంగాన్ని బీఆర్ అంబేద్కర్ మనకు రూపొందించి ఇచ్చారని ఉద్ఘాటించారు. ఓ ఛాయ్ వాలాగా ఉన్న నరేంద్రమోదీ ... దేశానికి అత్యుత్తమ ప్రధాని కాగలిగారు అంటే అది మన రాజ్యాంగం గొప్పదనమని అభివర్ణించారు. (ఆదివారం) గుంటూరు జిల్లాలో జరిగిన భారత రాజ్యాంగ సదస్సులో సీఎం చంద్రబాబు పాల్గొని ప్రసంగించారు. రాబోయే2014లో 11వ స్థానంలో ఉన్న భారతదేశం క్రమంగా అభివృద్ధి చెందిందని పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రపంచంలోనే నాల్గోవ లార్జెస్ట్ ఎకానమీగా భారతదేశం ఎదిగిందని నొక్కిచెప్పారు. 2047 కల్లా ప్రపంచంలో ఆర్థికంగా అత్యంత ప్రభావవంతమైన దేశంగా భారతదేశం మారుతోందని వెల్లడించారు. వ్యవస్థలోని లోపాలను సరిదిద్ది ప్రజాస్వామ్యాన్ని అమలు చేయడంలో న్యాయవ్యవస్థ అత్యంత కీలక బాధ్యత వహిస్తోందని చెప్పుకొచ్చారు సీఎం చంద్రబాబు. తొలుత ప్రింట్ మీడియా ... ఆ తర్వాత ఎలక్ట్రానిక్ మీడియా.. ఇప్పుడు సోషల్ మీడియా వచ్చిందని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో ప్రతి ఒక్కరూ వారి అభిప్రాయాలు తెలియజేస్తున్నారని పేర్కొన్నారు. సోషల్ మీడియా ద్వారా కొంతమంది వ్యక్తి హననానికి పాల్పడటం దురదృష్టకరమని తెలిపారు. ప్రపంచంలోకెల్లా భారతీయ కుటుంబ వ్యవస్థ చాలా గొప్పదని ఉద్ఘాటించారు. హెల్తీ హ్యాపీ సొసైటీ స్థాపనే రాజ్యాంగం లక్ష్యమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు.

## రైతుల సమస్యలు పట్టించుకోరా



**సిద్దిపేట జిల్లా, నవంబరు16 :** తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కేంద్ర బీజేపీ ప్రభుత్వంపై మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల సమస్యలు పట్టించుకోవడ ంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. (ఆదివారం) చిన్న కోడూరు మండలం మల్లారంలోని వడ్ల కొనుగోలు కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రైతులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 85లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొంటామని కాంగ్రెస్ ప్రభుత్వమే చెప్పిందని.. అయితే, 6లక్షల మెట్రిక్ టన్నులని మాత్రమే కొనుగోలు చేసిందని ఫైర్ అయ్యారు మాజీ మంత్రి హరీశ్‌రావు. కోనుగోలు చేసిన ధాన్యానికి రూ. 1400 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఏ రోజుకు ఆ రోజు డబ్బులు వేస్తామని చెప్పి ఎందుకు వేయడం లేదని ప్రశ్నించారు. మాటల్లో మాత్రం 24 గంటల్లో డబ్బులు వేస్తామని చెప్పారని.. చేతల్లో మాత్రం రోజుల తరబడి ఎందుకు ఆలస్యం చేస్తున్నారని నిలదీశారు. గత యాసంగి పంట బోనస్ డబ్బులు రూ.1200 కోట్లు పెండింగ్‌లో ఉన్నాయని, అవి వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 8డిగ్రీల చలి ఉండటంతో రైతులు ఇబ్బంది పడుతున్నారని..

## 21న హైదరాబాద్‌లో పర్యటించనున్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము



**హైదరాబాద్ :** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఈ నెల 21న హైదరాబాద్ నగరంలో పర్యటించనున్నారు. ఈ క్రమంలో పోలీసులు భద్రతా చర్యలపై నిమగ్నమయ్యారు. ఇక 21న మధ్యాహ్నం 1.10 గంటలకు బేగంపేట్ ఎయిర్‌పోర్టుకు ద్రౌపది ముర్ము చేరుకుంటారు. మ. 1.30 గంటలకు రాజ్‌భవన్‌కు చేరుకుని, అక్కడే లంచ్ చేయనున్నారు. మధ్యాహ్నం 3.25 గంటల వరకు రాజ్‌భవన్‌లోనే రాష్ట్రపతి విశ్రాంతి తీసుకోనున్నారు. మ. 3.50 గంటలకు బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం చేరుకుంటారు. సాయంత్రం 4 గంటల నుంచి 6 గంటల వరకు భారతీయ కళా మహెూత్సవంలో పాల్గొంటారు. సాయంత్రం 6:15 గంటలకు తిరిగి రాజ్‌భవన్‌కు చేరుకుంటారు. ఆ రోజు రాత్రికి రాజ్‌భవన్‌లోనే ద్రౌపది ముర్ము బస చేయనున్నారు. 22వ తేదీ ఉదయం 9:30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి పుట్టపర్తికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము బయలుదేరనున్నారు.

## రాష్ట్రంలో పత్తి కొనుగోలు సంక్షోభంపై కేటీఆర్ తీవ్ర ఆగ్రహం



**హైదరాబాద్ :** రాష్ట్రంలో పత్తి కొనుగోలు సంక్షోభంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నిర్లక్ష్యంపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పత్తి రైతులు సంక్షోభంలో ఉంటే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మొద్దు నిద్రలో ఉన్నాయని కేటీఆర్ మండిపడ్డారు. పత్తి రైతుల సమస్యలను పట్టించు కోవాలని కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను కేటీఆర్ డిమాండ్ చేశారు. ఈ అంశంలో వెంటనే కేంద్రంపైన ఒత్తిడి తీసుకురావాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, కాంగ్రెస్ ప్రభుత్వానికి కేటీఆర్ డిమాండ్ చేశారు. రాష్ట్రానికి ప్రాతినిధ్యం వహిస్తున్న కేంద్ర మంత్రులు, కాంగ్రెస్ బిజెపి ఎంపీలు వెంటనే కేంద్రంపైన ఒత్తిడి తీసుకురావాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. తేమశాతం, కపాస్ మొబైల్ యాప్ రిజిస్ట్రేషన్, జిన్నింగ్ మిల్లుల అవినీతి, మిల్లుల గ్రేడింగ్ అంటూ కుంటి సాకులతో సీసీఐ కొనుగోలుకు నిరాకరిస్తుంది. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల వైఖరితో పత్తి రైతులకు భారీ నష్టం కలుగుతుంది. కనీస మద్దతు ధర కూడా పత్తి రైతుకు దక్కడం లేదని కేటీఆర్ పేర్కొన్నారు. నెల రోజుల్లో కేవలం 1.12 లక్షల టన్నుల పత్తి కొనుగోలు జరిగాయి. 28 లక్షల టన్నుల లక్ష్యం కంటే కొనుగోళ్లు అతి తక్కువగా ఉండటం రాష్ట్రంలో నెలకొన్న పత్తి కొనుగోళ్ళ సంక్షోభానికి నిదర్శనమని కేటీఆర్ పేర్కొన్నారు. ఈ అంశంలో వెంటనే కేంద్రంపై ఒత్తిడి తీసుకువచ్చేందుకు కార్యాచరణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# నిజామాబాద్ జిల్లాలో అంతర్రాష్ట్ర ట్రాన్స్‌ఫార్మర్ దొంగల ముఠా అరెస్ట్

- 5.5 లక్షల నగదు, 40 కేజీల కాపర్ కాయిల్స్ స్వాధీనం
- వివరాలు వెల్లడించిన సీపీ సాయి చైతన్య








**నిజామాబాద్, నవంబర్16(డీడీ9 వార్త) :** నిజామాబాద్ జిల్లాలో గత సంవత్సరం కాలంగా రైతుల, విద్యుత్ శాఖ అధికారుల సహనాన్ని పరీక్షిస్తూ ఇందల్వాయి, ధర్పల్లి, డిచ్‌పల్లి, జక్రాన్‌పల్లి, మెండోరా, ముప్కాల్, మోర్తాడ్, ముగ్పాల్, బోధన్ టౌన్, బోధన్ రూరల్, నవీపేట్, వర్ని మండలాల్లోని 101 ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి విలువైన కాపర్ కాయిల్స్‌ను దొంగలించిన అంతర్రాష్ట్ర దొంగల ముఠాపై నిజామాబాద్ పోలీసులు ఉక్కుపాదం మోపారు. నిజామాబాద్ పోలీస్ కమిషనర్ సాయి చైతన్య వెల్లడించిన వివరాల ప్రకారం.. ఏసీపీ రాజ వెంకట రెడ్డి ఆధ్వర్యంలోని స్పెషల్ టీమ్‌లు ఏర్పాటు చేయడం జరిగిందని, కేసు దర్యాప్తులో భాగంగా శనివారం సాయంత్రం 5 గంటలకు ఇందల్వాయి మండల పరిధిలోని గన్నారం వద్ద వాహన తనిఖీలలో అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తులను పట్టుకోవడం జరిగిందని తెలిపారు. అరెస్ట్ అయిన వారిలో మహారాష్ట్ర, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన తుంబారె సుధాకర్, హర్బీర్ శర్మ, అలీ మహమ్మద్, యడాల వెంకటేశ్వర్లు, శానపల్లి రవీందర్ ఏ మాదవ రెడ్డి ఐదుగురు ప్రధాన నిందితులు ఉన్నారని వీరిలో కొందరు గతంలో కూడా ఇదే తరహా కేసుల్లో అరెస్ట్ అయిన రికార్డు ఉందన్నారు. వీరితో పాటు దొంగలించిన కాపర్ కాయిల్స్‌ను కొనుగోలు చేసిన లింగప్ప, గాజుల శ్రీ శైలం, మహమ్మద్ హైదర్ అలీ మరో ముగ్గురు పాత సామాన్ల వ్యాపారులను కూడా అరెస్ట్ చేయడం జరిగిందని, వీరిపై జిల్లావ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో 44 కేసులు నమోదు అయ్యాయని వెల్లడించారు. నిందితుల నుంచి పోలీసులు 40 కేజీల కాపర్ కాయిల్స్, 5 లక్షల 50 వేల రూపాయల నగదు, రెండు స్కూటీలు, ఆరు సెల్ ఫోన్లను స్వాధీనం పర్చుకున్నట్లు తెలిపారు. కాగా ముఠాలో పరారీలో ఉన్న అనిల్, వలీ మరో ఇద్దరి కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసులు ప్రకటించారు. నిందితులను న్యాయ స్థానం ముందు హాజరుపరచనున్నామని తెలిపారు. ఈ కేసుని ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో ముఖ్య పాత్ర వహించిన ఏసీపీ రాజ వెంకట రెడ్డి, డిచ్‌పల్లి సీఐపై వినోద్, ఇందల్వాయి ఎస్సై సందీప్, డిచ్‌పల్లి ఎస్సై షరీఫ్, జక్రాన్‌పల్లి ఎస్సై మహేష్ సిబ్బంది: కిరణ్ గౌడ్, ప్రశాంత్, సందీప్, కిషోర్ కుమార్, సుజిత్, నవీన్, సర్దార్ లను సీపీ సాయి చైతన్య అభినందించారు.

# రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో పాత్రికేయులకు సన్మానం






**కామారెడ్డి,నవంబర్ 16(డిడి9 వార్త) :** కామారెడ్డి జిల్లా కేంద్రంలోని రోటరీ క్లబ్ ఆడిటోరియంలో జాతీయ పాత్రికేయ దినోత్సవం సందర్భంగా రోటరీ క్లబ్ కామారెడ్డి ఆధ్వర్యంలో స్థానిక పాత్రికేయులను సన్మానించడం జరిగింది.కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విచ్చేసిన పట్టణ ఎస్ హెచ్ఓ నరహరి, రోటరీ అసిస్టెంట్ గవర్నర్ డాక్టర్ జైపాల్ రెడ్డి, పాత్రికేయుల సేవలను గుర్తిస్తూ వారి కృషి ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వంతెనగా మారిందని చెప్పారు. సమాజంలో జరుగుతున్న ప్రతి విషయాన్ని ప్రజలకు చేరుస్తూ, అవగాహన కలిగిస్తూ, చైతన్యాన్ని పెంపొందించడంలో పాత్రికేయులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని వారు అన్నారు.కార్యక్రమంలో జిల్లా స్పోర్ట్స్ అధికారి రంగ వెంకటేశ్వర్లు గౌడ్, రోటరీ క్లబ్ అధ్యక్షులు యాదం శంకర్, ప్రధాన కార్యదర్శి సబ్బని కృష్ణహరి, కోశాధికారి పర్ష వెంకటరమణ, వ్యాఖ్యాత అంబీర్ మనోహర్ రావ్, రెడ్ క్రాస్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ బాలు, ప్రోగ్రాం చైర్మన్ పోల భోయిన సత్యం, రొటేరియన్స్ రాజ్ నరసింహం, నాగభూషణం, నవీన్, విజయ్, మరియు స్థానిక పాత్రికేయులు పాల్గొన్నారు.

# కామారెడ్డిలో సిపిఐ వందేళ్ల సభకు ప్రజల ఆదరణ





**కామారెడ్డి,నవంబర్ 16(డిడి9 వార్త) :** సిపిఐ వందేళ్ల సభలకు కామారెడ్డిలో విశేష స్పందన లభించింది. కొత్త బస్టాండ్ వద్ద భారీ ర్యాలీతో ప్రారంభమైన బహిరంగ సభకు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు పశ్య పద్మ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 100 ఏళ్ల పోరాట చరిత్ర కలిగిన సిపిఐ ఎల్లప్పుడూ ప్రజల సమస్యల కోసం నిలబడిందని ఆమె తెలిపారు.కేంద్ర%-%రాష్ట్ర ప్రభుత్వాలు హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయని విమర్శించిన పద్మ, కార్పొరేట్ కంపెనీలకు దేశాన్ని తాకట్టు పెడుతున్నారని ఆరోపించారు. భారీ వర్షాల కారణంగా నష్టపోయిన రైతులకు ఇప్పటివరకు సహాయం అందించలేదని ఆమె మండిపడ్డారు. ప్రజా సమస్యలపై పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.కార్యక్రమంలో అమరవీరులు పనిహారం రంగాచారి, చాకలి ఐలమ్మ విగ్రహాలకు నివాళులర్పించారు. ప్రజానాట్యమండలి సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకుంది. ఈకార్యక్రమంలో నాయకులు ఏఐవైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు వలి ఉల్లాఖాద్రి, రాష్ట్ర నాయకులు కే. భూమయ్య, జిల్లా కార్యదర్శి ఎల్. దశరథ్, జిల్లా సహాయ కార్యదర్శి దుబాస్ రాములు, నాయకులు శ్రీనివాస్, రాజు రెడ్డి, దేవయ్య, మల్లేష్, రాజమణి, రఫీక్, సురేష్, దేవరాజు, లక్ష్మణ్, రమేష్, నర్సింలు, సందీప్, నాగమణి, స్వప్న, రేఖ, ఈశ్వర్, రాములు తదితరులు పాల్గొన్నారు.

# సూర్యాపేటలో నవంబర్ 28న గీతన్నల రణభేరి: పోస్టర్ ఆవిష్కరణ



**కామారెడ్డి,నవంబర్ 16(డిడి9 వార్త) :** కల్లుగీత కార్మికుల సమస్యల పరిష్కారానికి చేపడుతున్న గీతన్నల రణభేరి కార్యక్రమాన్ని నవంబర్ 28న సూర్యాపేటలో విజయవంతం చేయాలని జిల్లా అధ్యక్షులు సైదగౌని వెంకట్ గౌడ్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా కమిటీ నాయకులతో కలిసి కామారెడ్డిలో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా వెంకట్ గౌడ్ మాట్లాడుతూ, తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర 4వ మహాసభల భాగంగా 28న భారీ ప్రదర్శన, బహిరంగ సభను సూర్యాపేటలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర నలుమూలల నుండి గీత కార్మికులు భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. బహిరంగ సభ అనంతరం 29, 30 తేదీల్లో ప్రతినిధుల మహాసభ జరుగుతుందని, ఇందులో గీత కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై లోతైన చర్చ జరిపి భవిష్యత్ కార్యాచరణను నిర్ణయించనున్నట్లు చెప్పారు.1957లో స్థాపించబడిన కల్లు గీత కార్మిక సంఘం 68 ఏళ్లుగా అనేక పోరాటాలు, ఉద్యమాలు జరిపి సొసైటీలు, %ఖీ%లు, పెన్షన్, ఎక్స్‌గ్రేషియా వంటి పలు హక్కులను సాధించిందని ఆయన గుర్తుచేశారు. అయితే ఇంకా పరిష్కరించాల్సిన సమస్యలు ఎన్నో ఉన్నాయని అన్నారు. రాష్ట్రంలో ఐదు లక్షల కుటుంబాలు ఆధారపడి ఉన్న గీత వృత్తిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని ఆయన విమర్శించారు. కేంద్ర బీజేపీ ప్రభుత్వం గీత కార్మికుల కోసం ఒక్క సంక్షేమ పథకం కూడా అమలు చేయలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీలను నెరవేర్చలేదని పేర్కొన్నారు.గీత కార్మికుల ప్రధాన డిమాండ్లలో పెన్షన్‌ను రూ.4 వేలకు, ఎక్స్‌గ్రేషియాను రూ.10 లక్షలకు పెంచడం, కాటమయ్య రక్షణ కవచాలను వెంటనే ఇవ్వడం, పెండింగ్ ఎక్స్‌గ్రేషియాను విడుదల చేయడం, నీరా%-%తాటి ఈత ఆధారిత పరిశ్రమలను ప్రారంభించడం, కల్తీ కల్లు పేరిట జరుగుతున్న దాడులను నిలిపివేయడం, దరఖాస్తు చేసిన వారికి సొసైటీలు, %ఖీ% లైసెన్సులు మంజూరు చేయడం, ప్రతి గ్రామానికి తాటి చెట్ల పెంపకానికి 5 ఎకరాల భూమి కేటాయించడం ఉన్నాయని తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి రాజా గౌడ్, సలహాదారులు నారాగౌడ్, ఉపాధ్యక్షులు శంకర్ గౌడ్, స్వామి గౌడ్, గంగారాజ్ గౌడ్, రమేష్ గౌడ్, అంజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.


# యూత్ కాంగ్రెస్ ఉపాధ్యక్షుల అంత్యక్రియల్లో ఎమ్మెల్యే మదన్ మోహన్






**కామారెడ్డి,నవంబర్ 16(డిడి9 వార్త) :** తాడ్వాయి మండల యువత కాంగ్రెస్ ఉపాధ్యక్షులు సతీష్ ఈ రోజు ఉదయం మరణించారు. ఈ సంఘటనపై ఎమ్మెల్యే మదన్ మోహన్ తాడ్వాయి మండలం దేవాయిపల్లి గ్రామంలో జరిగిన అంత్యక్రియ కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆయన కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి పాడె మోసి సతీష్ ఆత్మకు శ్రద్ధాంజలి అర్పించారు.ఎమ్మెల్యే మదన్ మోహన్ సతీష్ కుటుంబం సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. ఆయన, ఎల్లారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ విజయానికి సతీష్ కృషి మరువలేనిది అని, పార్టీ ఒక మంచి నాయకుడిని కోల్పోయిందని, అలాగే పార్టీ అన్ని విధాలుగా కుటుంబానికి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# ఏ బి వి పి యువ నాయకుని పెండ్లి కి హాజరై దీవించిన ఎంపీ నగేష్





**బజార్ హత్నూర్, నవంబర్ 16(%జజూ%9వార్త):-**ఏబీవీపీ యువ నాయకుడు అరుణ్ కుమార్ వివాహ వేడుకలు ఇచ్చోడలోని షార్ప్ గార్డెన్ లో జరిగిన నేపథ్యంలో ఆదివారం రోజు ఆదిలాబాద్ పార్లమెంట్ సభ్యులు జి నగేష్ ఆ పెండ్లి వేడుకల్లో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించి దీవించారు.ఎంపీ తో పాటుగా బిజెపి రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ తాటిపల్లి గంగాధర్ రావు, పిఏసిఎస్ అధ్యక్షులు కదం ప్రశాంత్, బిజెపి నాయకులు చంద్రకాంత్, జీవి రమణ,కదం బాబురావు, పాండురంగ్, శ్రీనివాస్, గంగాధర్,కేశవ్ తదితరులు పాల్గొన్నారు.

# నిజామాబాద్‌లో స్పెషల్ లోక్ అదాలత్ విజయవంతం : 4,898 కేసులకు రాజీ



**నిజామాబాద్, నవంబర్16(డీడీ9 వార్త) :** నిజామాబాద్ జిల్లాలో గత నెల రోజుల నుండి నవంబర్ 15, 2025 వరకు నిర్వహించిన స్పెషల్ లోక్ అదాలత్ విజయవంతమైందని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదై చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న రాజీ పడటానికి అవకాశం ఉన్న కేసులలో ఇరు వర్గాలకు రాజీ కుదరడం ద్వారా ఐ.పి.సి %ఖ% బీఎన్ఎస్ (372), సైబర్ క్రైమ్ (111), ఇ-పెట్టి (2064), డి.డి %ఖ% ఎంవీ యాక్ట్ (2351) లకు సంబంధించిన మొత్తం 4898 కేసులు పరిష్కారమయ్యాయని వెల్లడించారు. 111 సైబర్ క్రైమ్ కేసులలో సైబర్ నేరగాళ్ల చేతిలో కోల్పోయిన ? 20,96,406లు తిరిగి సైబర్ బాధితులకు ఇప్పించేందుకు ఆర్డర్ కాపీలను సంబంధిత బ్యాంక్ నోడల్ అధికారులకు పంపించామని తెలిపారు. క్షణికావేశంలో చేసే తప్పులను సరిదిద్దుకోవడానికి లోక్ అదాలత్ అనేది ఒక మంచి అవకాశమని, రాజీ మార్గమే రాజా మార్గం అనే సందేశాన్నిచ్చారు. సైబర్ మోసాలకు గురైన జిల్లా ప్రజలు వెంటనే 1930కి కాల్ చేసి లేదాపోర్టల్ నందు దరఖాస్తు చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ స్పెషల్ లోక్ అదాలత్ ను విజయవంతం చేసిన సైబర్ క్రైమ్ ఏసీపీ వై. వెంకటేశ్వర్ రావు, సీఐ ముఖీద్ పాషా, సీసీఆర్బీ సీఐ అంజయ్య, కోర్టు డ్యూటీ, సైబర్ సెల్ సిబ్బందిని పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు.

# ఎడపల్లిలో పాత్రికేయులకు ఘన సన్మానం



**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్16(డీడీ9 వార్త) :** తెలంగాణ లోకల్ ఫోర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు దల్లా సురేష్ మహజన్ ఆధ్వర్యంలో ఆదివారం జాతీయ పత్రికా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎడపల్లిలో పాత్రికేయులను శాలువ, పూలమాలలతో సన్మానించి, స్వీట్లు పంచుకున్నారు. దల్లా సురేశ్ మహజన్ మాట్లాడుతూ... 1956లో దేశ ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966 నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేయబడిందని ఆ రోజునే జాతీయ పత్రికా దినోత్సవంగా జరుపుకుంటున్నామని తెలిపారు. పాత్రికేయులకు శుభాకాంక్షలు తెలుపుతూ, వారి సేవలు మరువలేనివని, వారు ప్రజలకు, ప్రభుత్వానికి మధ్య వారధిగా నిలుస్తూ సామాజిక, ఆర్థిక, రాజకీయ సమాచారాన్ని నిరంతరం అందిస్తున్నారని కొనియాడారు. పాత్రికేయ వృత్తి సామాజిక బాధ్యతతో కూడుకున్నదని వారి అంకితభావం అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు మేకల గంగాధర్, మండల కిసాన్ కేత్ అధ్యక్షుడు శివ రామ్ ప్రసాద్, మాజీ వార్డ్ సభ్యులు పురం శేఖర్, యువ నాయకుడు మయూర్, కాంగ్రెస్ నాయకులు హబీబ్, కాశిగోళ్ళ గంగాధర్, అజయ్, బుడిది లచ్చారాం వంటి స్థానిక ప్రముఖులు పాల్గొన్నారు.

## జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా బోధన్‌లో సేవా కార్యక్రమం



**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్16(డీడీ9 వార్త) :** జాతీయ పత్రికా దినోత్సవం సందర్భంగా సామాజిక బాధ్యతను చాటుతూ బోధన్ పట్టణంలో ఆదివారం రోడ్ కరాటే వ్యవస్థాపకులు అశోక్ కుమార్ సేవా కార్యక్రమం నిర్వహించారు. పట్టణంలోని 1వ వార్డు అచన్‌పల్లి ప్రాంతంలో నివసించే పేద పిల్లల కోసం పండ్లు, బిస్కెట్లు, టిఫిన్‌తో కూడిన ఆహార పంపిణీ కార్యక్రమాన్ని స్థానిక సీఐ వెంకటనారాయణ చేతుల మీదుగా పిల్లలకు అందించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ... సామాజిక బాధ్యతతో ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టడం అభినందనీయమని, పేద పిల్లలకు పోషక విలువలున్న పండ్లు, అల్పాహారం అందించడం ద్వారా సమాజానికి ఎంతో మేలు జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో నూర్ సింగ్, పద్మావతి, తులసి పాల్గొన్నారు.

## బాన్సువాడలో మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ డివిజన్ అడ్‌హాక్ కమిటీ ఎన్నికలు విజయవంతం



**బాన్సువాడ,నవంబర్ 16(డిడి9 వార్త) :** బాన్సువాడ మాల ఎడ్యుకేషనల్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో ఆదివారం బాన్సువాడ ఆర్ బి అతిథి గృహంలో డివిజన్ అడ్‌హాక్ కమిటీ ఎన్నికలు నిర్వహించబడ్డాయి. జిల్లా అధ్యక్షులు సంగమేశ్వర్, జిల్లా నాయకులు బాలయ్య, సాయిమౌర్య, సత్యం పర్యవేక్షణలో ఈ ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఈ ఎన్నికల్లో మల్లూరి సాయిలు కమిటీ అధ్యక్షుడిగా, దొనకంటి బ్రహ్మానందం ఉపాధ్యక్షుడిగా, పాండురంగం కార్యదర్శిగా, క్యాకయ్యా సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అంతేకాక బాలసాయిలు, గైనీ రవి కార్యవర్గ సభ్యులుగా ఎంపికయ్యారు. నేతలు మాలల ఐక్యత, అభివృద్ధి కోసం రాష్ట్ర, జిల్లా కార్యవర్గం సూచనలను పాటిస్తూ పనిచేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో చింతల గంగాధర్, నక్క గోపాల్, జగన్, విశ్వనాథ్, మల్లూరి సాయిలు తదితరులు పాల్గొన్నారు.

## ఢిల్లీకి పయనమైన ఎమ్మార్పీఎస్ నిజామాబాద్ జిల్లా నాయకులు



**బోధన్, నిజామాబాద్ జిల్లా నవంబర్16(డీడీ9 వార్త) :** ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ నేతృత్వంలో చేపట్టిన జాతీయస్థాయి నిరసనలో భాగస్వామ్యం అవుతూ సోమవారం ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జరిగే మహాధర్నాకు నిజామాబాద్ జిల్లా ఎమ్మార్పీఎస్ నాయకులు శనివారం రాత్రి ఢిల్లీకి బయలుదేరారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి పోచిరాం మాట్లాడుతూ...తమ ప్రయాణం ప్రధానంగా రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడుకునే లక్ష్యంతో మొదలైందని, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) బి.ఆర్. గవాయి పై జరిగిన దాడిని మేము అత్యంత హేయమైన రాజ్యాంగ విరుద్ధమైన చర్యగా తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జాతీయస్థాయి మహాధర్నాను విజయవంతం చేయడానికి రాష్ట్ర, జిల్లా, మండల నాయకులు పాల్గొంటున్నారని, ప్రజాస్వామ్య విలువలను కాపాడే ఈ పోరాటానికి మీడియా మద్దతు ఇవ్వాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## పోలీస్ సిబ్బందికి రాత్రి వేడి టీ, నీళ్లు అందించిన జిల్లా ఎస్పీ





**కామారెడ్డి,నవంబర్ 16(డిడి9 వార్త) :** తీవ్ర చలి మధ్య కూడా ప్రజల భద్రత కోసం సేవలు అందిస్తున్న పోలీసు సిబ్బందిని జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదివారం రాత్రిప్రత్యక్షంగా సందర్శించారు. సిరిసిల్ల, ఎల్లారెడ్డి, రామారెడ్డి రోడ్ ప్రాంతాల్లో డ్యూటీలో ఉన్న సిబ్బందికి స్వయంగా వేడి టీ మరియు నీటిని అందజేసి, వారి అంకితభావాన్ని ప్రశంసించారు. ప్రజల కోసం కఠిన పరిస్థితుల్లోనూ బాధ్యతగా పనిచేస్తున్న పోలీసు సిబ్బంది ధైర్యం అభినందనీయం అని ఎస్పీ పేర్కొన్నారు.

## దోమకొండలో పద్మశాలి సంఘం-2 కొట్టాలగడ్డ కళ్యాణ మండపం రేకుల షెడ్ నిర్మాణానికి ఎమ్మెల్యే భూమిపూజ





**కామారెడ్డి,నవంబర్ 16(డిడి9 వార్త) :** దోమకొండ మండల కేంద్రంలోని పద్మశాలి సంఘం%-%2 కొట్టాలగడ్డ కళ్యాణ మండపం వద్ద రేకుల షెడ్డు నిర్మాణ పనులకు కామారెడ్డి శాసనసభ్యులు, కోటిపల్లి వెంకటరమ రెడ్డి ఆదివారం భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘ సభ్యులు, మహిళలు బస్టాండ్ నుండి సంఘం భవనం వరకు డప్పుల శబ్దాలు, బైక్ ర్యాలీలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు ఎమ్మెల్యేకు హారతి పట్టి ఆహ్వానించారు. అనంతరం ఆయన సంఘ భవనం వద్ద షెడ్డు నిర్మాణానికి పూజ కార్యక్రమాన్ని పూర్తి చేశారు. సంఘ సభ్యులు మరియు ఆలయ కమిటీ తరపున వచ్చిన వినతుల మేరకు బోరు మోటారు మంజూరు చేస్తామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. కార్యక్రమంలో బీజేపి జిల్లా కన్వీనర్ కుంట లక్ష్మారెడ్డి, బీజేపి కామారెడ్డి పట్టణ కార్యదర్శి నరేందర్ రెడ్డి, దోమకొండ మండల యూత్ అధ్యక్షుడు, పట్టణ అధ్యక్షుడు తిప్పాపురం రవి, నాయకులు నరేందర్ రెడ్డి, రవీందర్ రెడ్డి, స్థానిక భాజపా నాయకులు,పద్మశాలి సంఘం%-%2 కొట్టాలగడ్డ కమిటీ అధ్యక్షుడు సబ్బని జగదీష్, సదర్ పెద్దమనిషి కన్న దామోదర్, సాయిబాబా ఆలయ నిర్మాణదాత పాస్కంటి బాలయ్య, జిల్లా పద్మశాలి సంఘం కోశాధికారి సబ్బని ధర్మపురి, ఆలయ కమిటీ ప్రతినిధులు, పాండిదారులు మరియు పద్మశాలి సంఘ సభ్యులు పాల్గొన్నారు.

## జనశిక్షణసంస్థాన్(జె.ఎస్.ఎస్)సభ్యులకు ప్రథమ, ద్వితీయ బహుమతుల ప్రదానం










**బజార్ హత్నూర్, నవంబర్16(%ణణ%9వార్త):-** :సమగ్ర గిరిజన అభివృద్ధిలో భాగంగా జన శిక్షణ సంస్థాన్ ఆదిలాబాద్ గిరిజన ప్రాంతం లోని బజార్ హత్నూర్ మండలం లోని గాంధీనగర్, మైసమ్మ వీధిలోని మహిళకు మగ్గం పని శిక్షణను ఇస్తున్న వారికి స్వాతంత్ర్య సమరయోధుడు బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని ఇటీవల వ్యాస రచన %ఽ% జానపద పాటల పోటీలు నిర్వహించి, విజేతలకుఆదివారంబహుమతులు ఇచ్చారు. ఈ బహుమతులను ఒక కార్యక్రమం ఏర్పాటు చేసి, ముఖ్య అతిథిగా హాజరైనమాజీ జడ్పీటీసీ కొత్త శంకర్ చేతుల మీదుగా అందించారు. పురాణాలపై అవగాహన కల్పించడం కూడా ఇందులోభాగమే. ఈ సంస్టాన్ మండల స్థాయి అధికారులు, మాజీ జడ్పీటీసీ కొత్త శంకర్,ప్రోగ్రామ్ ఆఫీసర్ వాగ్మారె రాజు, శ్రీకాంత్, విజయమాల, రచన,మగ్గం పని శిక్షణ తీసుకుంటున్న మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## బీసీలకు 42% రిజర్వేషన్లు ఇవ్వాల్సిందే: 'రన్ ఫర్ సోషల్ జస్టిస్'లో నరాల సుధాకర్ డిమాండ్



**నిజామాబాద్, నవంబర్16(డీడీ9 వార్త) :** బీసీలకు విద్య, ఉద్యోగ, స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లను తక్షణమే కల్పించాలనే ప్రధాన డిమాండ్‌తో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నరాల సుధాకర్ ఆధ్వర్యంలో నిజామాబాద్ నగరంలోని పాలిటెక్నిక్ మైదానంలో 'రన్ ఫర్ సోషల్ జస్టిస్' కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నరాల సుధాకర్ మాట్లాడుతూ.. బీసీల ఉద్యమాన్ని ఆపడం ఎవరితరం కాదని, జనాభాలో 56 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాల్సిందేనని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. కేవలం 9 శాతం కూడా లేని అగ్రవర్ణాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10 శాతం రిజర్వేషన్లు అమలుపరిచిన కేంద్ర ప్రభుత్వం, బీసీల పట్ల వివక్ష చూపకుండా 42 శాతం రిజర్వేషన్లను అమలు చేయాలని కోరారు. ఈ డిమాండ్ సాధన కోసం తమ అష్టాంగ కార్యక్రమాలలో భాగంగా ఈ రన్ ఫర్ సోషల్ జస్టిస్ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆంజనేయులు, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగా కిషన్, నగర అధ్యక్షుడు దేవేందర్తో పాటు రవీందర్, శంకర్, అజయ్, చంద్రకాంత్, శ్రీలత, చంద్రమోహన్ తదితర ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


## భిక్నూర్‌లో ట్రావెల్స్ బస్సు ప్రమాదం




### - 30 మంది ప్రయాణికులు క్షేమం









**కామారెడ్డి, నవంబర్ 16 (డిడి9 వార్త):** ఆదిలాబాద్ నుండి బెంగళూరు వెళ్తున్న కామాక్షి ట్రావెల్స్ బస్సులో డ్రైవర్ మద్యం సేవించి వాహనం నడపడంతో పెద్ద ప్రమాదం తప్పింది. శనివారం సాయంత్రం %చీఎ-%44లో భిక్నూర్ మండలం సిద్ధిరామేశ్వర నగర్ సమీపంలో బస్సు రోడ్డుపై ఉన్న డ్రమ్‌ను ఢీకొట్టింది. అదృష్టవశాత్తూ బస్సులో ప్రయాణిస్తున్న 30 మందికి ఎటువంటి గాయాలు కాలేదు. ప్రమాద సమాచారంతో వెంటనే ఘటన స్థలానికి చేరుకున్న భిక్నూర్ పోలీసులు డ్రైవర్‌ను ఆల్కహాల్ పరీక్ష చేయగా మద్యం సేవించినట్టు నిర్ధారించారు. వెంటనే బస్సును సీజ్ చేసి, డ్రైవర్‌తో పాటు ట్రావెల్స్ సంస్థపై కేసు నమోదు చేశారు. ఈ నేపథ్యంలో జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర మాట్లాడుతూ, మద్యం సేవించి డ్రైవ్ చేయడం చట్టవిరుద్ధం, ప్రజల భద్రత మా ప్రధాన లక్ష్యం ఇలాంటి ఘటనలపై కఠిన చర్యలు తప్పవు అని హెచ్చరించారు. స్థానికంగా ఈ ఘటన పెద్దదిగా మారకుండా తప్పించుకోవడంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. పోలీసులు కేసును దర్యాప్తు చేస్తున్నారు.

# బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్ పేరుతో ర్యాలీ

**హైదరాబాద్, నవంబరు16 :** బీసీ జేఏసీ ఆధ్వర్యంలో రన్ ఫర్ సోషల్ జస్టిస్పేరుతో(ఆదివారం) భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ బషీర్బాగ్ నుంచి లోయర్ ట్యాంక్బండ్ వరకు జరిగింది. ఈ ర్యాలీలో బీసీ జేఏసీ వర్కింగ్ చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ వి. హనుమంతరావు, మాజీమంత్రి శ్రీనివాస్ గౌడ్, గుజ్జ కృష్ణ, తదితరులు పాల్గొని ప్రసంగించారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లు పెంచిన తర్వాతనే స్థానిక ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్లని పెంచకుండా తొందరపడి స్థానిక ఏన్నికలు నిర్వహిస్తే కాంగ్రెస్కు బీసీలు గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తక్షణమే అఖిలపక్షంతో సీఎం రేవంత్రెడ్డి ఢిల్లీకి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్రమోదీతో చర్చించాలని సూచించారు. బీసీలను కాంగ్రెస్ ప్రభుత్వం నమ్మించి మోసం చేస్తే రాష్ట్రం అగ్నిగుండమే అవుతోందని వార్నింగ్ ఇచ్చారు. డిసెంబర్ ఒకటో తేదీ నుంచి జరిగే పార్లమెంట్ సమావేశాల్లో బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ ప్రభుత్వం తన



రాజకీయ కార్యాచరణ ప్రకటించాలని కోరారు. కాంగ్రెస్ పరంగా స్థానిక ఏన్నికలు నిర్వహిస్తే తాము ఒప్పుకోమని.. చట్టబద్ధమైన రిజర్వేషన్లు బీసీలకు ఇవాల్సిందేనని స్పష్టం చేశారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలలో బీసీ వాదంతో కాంగ్రెస్ గెలిచిందనే విషయాన్ని సీఎం రేవంత్రెడ్డి మర్చిపోవద్దని పేర్కొన్నారు. (సోమవారం) 17వ తేదీన జరిగే తెలంగాణ రాష్ట్ర కేబినెట్ సమావేశంలో ఢిల్లీకి వెళ్లే అఖిలపక్షం తేదీని ప్రకటించాలని కోరారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో బీజేపీ ప్రభుత్వం వ్యతిరేకంగా ఉన్నందుకే జూబ్లీహిల్స్ ఎన్నికలలో డిపాజిట్ గల్లంతైందని విమర్శించారు. ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే బీసీ రిజర్వేషన్ల బిల్లుకు కేంద్రప్రభుత్వం ఆమోదం తెలపాలని. లేకపోతే డిసెంబరు మొదటి వారంలో పార్లమెంట్ను ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీ బిల్లుని కేంద్రం ఆమోదించకపోతే వచ్చే ఎన్నికల్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా బీజేపీకి జూబ్లీహిల్స్ ఎన్నికలలో పట్టిన గతే పడుతుందని బీసీ జేఏసీ నేతలు హెచ్చరించారు.

# కర్మ హిట్స్ బ్యాక్ ట్వీట్పై స్పందించిన కవిత

**హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఎన్నికల ఫలితాలు బీఆర్ఎస్, బీజేపీలకు గట్టి షాక్ ఇచ్చాయి. బీఆర్ఎస్ నేతలైనే గెలుపు తమదే అంటూ గట్టి నమ్మకంతో ఉన్నారు. కానీ, ఫలితం వచ్చిన తర్వాత ఆ పార్టీ నేతలంతా షాక్కు గురయ్యారు. సిట్టింగ్ స్థానం తమదే అనుకుని ఎంతో ధీమాతో ఉన్నవారికి ప్రజా తీర్పు మింగుడు పడడం లేదు. అయితే, ఫలితాల రోజు ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత చేసిన పోస్టు నెట్టింట వైరల్గా మారిన సంగతి తెలిసిందే. కర్మ హిట్స్ బ్యాక్ అంటూ ఆమె చేసిన ట్వీట్.. తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చకు దారితీసింది. ఆమె ఎవరిని ఉద్దేశించి ఆ పోస్టు పెట్టారనేది బహిరంగ రహస్యమే అయినా దానిపై తీవ్ర ఆసక్తి నెలకొంది. అయితే, తాజాగా కవిత ఆ పోస్టుపై స్పందించారు.కర్మ హిట్స్ బ్యాక్ అంటూ ఎవరిని ఉద్దేశించి ట్వీట్ చేశారంటూ మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా.. జై తెలంగాణ అంటూ కవిత సమాధానమిచ్చారు. జాగృతి జనం బాట కార్యక్రమంలో ప్రజలు చెప్పిన వాటి ఆధారంగానే తాను ఆరోపణలు చేసినట్లు



చెప్పుకొచ్చారు. తాను ఏసీ రూమ్లో కూర్చొని మాట్లాడడం లేదని.. తన ఆరోపణలకు బీఆర్ఎస్ ఎమ్మెల్సీ నవీన్ కుమార్ వివరణ ఇచ్చినందుకు సంతోషమని అన్నారు. మాజీ మంత్రులు హరీశ్ రావు, గంగుల కమలాకర్ సైతం వివరణ ఇవ్వాలని డిమాండ్ చేశారు. మిగతా వాళ్లూ ఈ ఒరవడిని కొనసాగించాలని ఆకాంక్షించారు. నక్కలగండి ప్రాజెక్టు వ్యవహారంపై జాగృతి చేసిన డిమాండ్కు ప్రభుత్వం తలొగ్గిందని చెప్పుకొచ్చారు. తనపై బీఆర్ఎస్ వాళ్లు చేసే కామెంట్లకు జాగృతి కార్యకర్తలు కౌంటర్ చేస్తారని హెచ్చరించారు.బాధ్యత గత ప్రజాప్రతినిధులను ప్రశ్నిస్తే వివరణ ఇవ్వాలే తప్ప ఎదురుదాడికి దిగడం ఏంటని ప్రశ్నించారు. బీఆర్ఎస్లో అంతర్గతంగా జరుగుతున్న పరిణామాలను సీఎం రేవంత్ రెడ్డి అనుకూలంగా వాడుకుంటున్నారని ధ్వజమెత్తారు. అసలు రేవంత్ రెడ్డికి మాట్లాడే అవకాశం ఇచ్చిందే బీఆర్ఎస్ వాళ్లని ఆగ్రహించారు. ఏ పార్టీ కూడా ఆడవాళ్లకు న్యాయం చేయడం లేదని.. కాంగ్రెస్ పార్టీలో పదవుల కోసం మహిళలే ధర్నాలు చేశారని కవిత ఎద్దేవా చేశారు. రాహుల్ గాంధీని పక్కనపెట్టి ప్రియాంక గాంధీకి న్యాయం చేయమని ముఖ్యమంత్రి రేవంత్ మాట్లాడగలరా? అని నిలదీశారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో తన పాత్ర ఏమీ లేదని.. తాను ప్రేక్షకపాత్ర మాత్రమే వహించినట్లు చెప్పుకొచ్చారు కవిత.

# ఛాలెంజ్ యాక్సెప్టెడ్ ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్సైట్లు క్లోజ్


**హైదరాబాద్:** పైరసీ సినిమాలకు వేదికగా మారిన ఐబొమ్మ, బప్పం టీవీ వెబ్సైట్లను సైబర్ క్రైమ్ పోలీసులు క్లోజ్ చేయించారు. శనివారం అరెస్టయిన ఐబొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవితోనే వాటిని క్లోజ్ చేయించి, వెబ్ లాగిన్స్, సర్వర్ వివరాలతో మూసివేశారు. 'నా వద్ద కోట్ల మంది డేటా ఉంది. ఈ వెబ్సైట్ మీద ఫోకస్ చేయ టం ఆపండి' అంటూ గతంలో అతడు పోలీసులకు సవాల్ విసిరి నట్లు సామాజిక మాధ్యమాల్లో ఓ లేఖ చక్కర్లు కొట్టింది. దీంతో ఆ సవాల్ను స్వీకరించిన పోలీసులు ముందుగా ఐబొమ్మలోని కొందరిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో విదేశాల నుంచి వచ్చిన ఇమ్మడి రవితోనే పోలీసులు ఆయా వైబ్సైట్లను క్లోజ్ చేయి ంచడం గమనార్హం.ఇమ్మడి రవి వద్ద స్వాధీనం చేసుకున్న వందల హార్డ్ డిస్క్లను పోలీసులు విశ్లేషణ చేస్తున్నారు. నింది తుడి బ్యాంక్ ఖాతాల వివరాలను పరిశీలిస్తున్నారు. అతడిని కస్టడీలోకి తీసుకుని మరికొన్ని వివరాలు సేకరించాలని పోలీసు లు భావిస్తున్నారు. సోమవారం నాంపల్లి కోర్టులో కస్టడీ పిటిష న్ను పోలీసులు దాఖలు చేయనున్నారు.అసలేం జరిగింది : కొత్త సినిమాలు, ఓటీటీ వేదికల్లోని కంటెంట్ను పైరసీ చేస్తూ సినీ పరిశ్రమకు పైరసీ తీవ్ర నష్టాన్ని కలిగిస్తోంది. ఈ క్రమంలో ఈ ఏడాది విడుదలైన పలు తెలుగు సినిమాలు పైరసీ బారిన పడటంతో తెలుగు ఫిల్మ్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ విభాగంలోని



యాంటీ వీడియో పైరసీ సెల్ ఆగస్టు 30వ తేదీన నగర సైబర్ క్రైవ్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఐబొమ్మ లాంటి 65 మిర్రర్ వెబ్సైట్లు వేదికగా పలు సినిమాలు పైరసీ జరుగుతున్నట్లు పేర్కొన్నారు. అప్పుడు ఐదుగురు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు.వీరిని సెప్టెంబరు 29న అరెస్ట్ చేసి రిమాండ్కు తరలించారు. అప్పటి నుంచి ఐబొమ్మ సూత్రధారి కోసం పోలీసులు వేట ప్రారంభించారు. సెప్టెంబరు 30వ తేదీ వరకు కూకట్పల్లిలోని తన నివాసంలోనే ఉన్న రవి, అక్టోబరు 1వ తేదీన ఇక్కడి నుంచి మాయమయ్యాడు. అతడి కదలికలపై నిఘా పెట్టిన పోలీసులు కీలక సమాచారాన్ని సేకరించారు. అక్టోబరు 3న నెదర్లాండ్స్లోని ఆమ్స్టర్డామ్లో రవి పాగా వేసినట్లు అంచనాకు వచ్చారు. పోలీసులకు పట్టుబడకుండా ఫ్రాన్స్, కరేబియన్ దీవులు, నెదర్లాండ్స్ తదితర ప్రాంతాల్లో ఉన్నట్లు ఐపీ అడ్రస్లతో ఏ మార్చుతూ ఇప్పటివరకూ వచ్చాడు. తనను పోలీసులు పసిగట్టలేరనే ధీమాతో ఆమ్స్టర్డామ్ నుంచి కూకట్పల్లికి చేరాడు. అతడి కదలికలను గమనిస్తూ వచ్చిన పోలీసులు ఎట్టకేలకు అతడిని అరెస్ట్చేశారుఅన్ని జాగ్రత్తలు తీసుకుంటూ ఇది అప్పుడు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొట్టింది. ఈ సవాల్ను స్వీకరించిన పోలీసులు అతడిని అరెస్టు చేశారు. నిందితుడిని బషీర్బాగ్ సీసీఎస్కు తరలించి కీలక సమాచారం సేకరించారు. అనంతరం నాంపల్లి న్యాయస్థానంలో హాజరుపర్చారు. న్యాయమూర్తి రిమాండ్ విధించడంతో చంచల్గూడ జైలుకు తరలించారు.ఇదిలా ఉండగా, ఈ వెబ్సైట్లను ప్రతి నెలా 37 లక్షల మంది చూస్తున్నట్లు పోలీసులు నిర్ధారించారు. ఐ బొమ్మ, బప్పం టీవీ, ఐ విన్ పేర్లతో వెబ్సైట్లు రూపొందించి ఏడెనిమిదేళ్లుగా పైరసీ సినిమాలు, వెబ్ సిరీస్లకు వేదికగా ఇమ్మడి రవి మార్చేశారు. దీంతో ఆయనను కూకట్పల్లిలో సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. అతడు నివసిస్తున్న అపార్ట్మెంట్లో రూ.3 కోట్ల నగదు, వందల కొద్దీ హార్డ్ డిస్క్లు, కంప్యూటర్లు, సెల్?ఫోన్లను గుర్తించినట్లు సమాచారం.

# తెలంగాణ మహిళలకు గుడ్న్యూస్ చెప్పిన మంత్రి సీతక్క

**హైదరాబాద్:** తెలంగాణ మహిళలకు రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల మంత్రి సీతక్క గుడ్న్యూస్ చెప్పారు. రాష్ట్ర అభివృద్ధిలో మహిళా శక్తి కీలక పాత్ర పోషిస్తోందని, కోటి మంది మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసి, వారిని కోటీశ్వ రులను చేసే లక్ష్యం దిశగా ప్రభుత్వం చిత్తశుద్ధితో అడుగులు వేస్తోందని ప్రకటిం చారు. గ్రామీణ మహిళలు తయారుచేస్తున్న ఉత్పత్తులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మెరుగైన మార్కెటింగ్ అవకా శాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. శనివారం హైదరాబాద్ లోని ప్రజాభవన్లో జరిగిన మండల సమాఖ్య నూతన అధ్యక్షురాళ్ల రాష్ట్రస్థాయి సదస్సులో మంత్రి సీతక్క ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె స్వయం సహాయక సంఘాల బలోపేతంపై కీలక వ్యాఖ్యలు చేశారు. గ్రామీణ ఉత్పత్తుల అమ్మకాలు, ప్రచారం కోసం ప్రస్తుతం మాదాపూర్ శిల్పారామం తరహాలో హైదరాబాద్ నగరంలో మరిన్ని మహిళాశక్తి బజార్లను ఏర్పాటు చేస్తామని మంత్రి ప్రకటించారు. ఈ బజార్లు మహిళలు తయారు చేసిన చేతిపనులు, ఆహార



ఉత్పత్తులు, ఇతర వస్తువులను నేరుగా వినియోగదారులకు విక్రయించేందుకు వేదికగా ఉపయోగపడతాయన్నారు. తద్వారా వారికి మధ్యవర్తుల సమస్యలు లేకుండా పూర్తి లాభాలు దక్కుతాయని చెప్పారు.రాష్ట్రంలో కోటి మంది మహిళలను స్వయం సహాయక సంఘాల్లో చేర్చడం ద్వారా వారిని ఆర్థికంగా నిలదొక్కుకునేలా చేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుం దన్నారు. ఇప్పటికే అనేక సమాఖ్యల్లో నిధులు రూ. కోట్లలో నిల్వ ఉండటం ఈ లక్ష్యం సాకారమవుతున్నదానికి నిదర్శనమని మంత్రి తెలిపారు. దివంగత ప్రధాని ఇందిరాగాంధీ జయంతి అయిన నవంబరు 19న రాష్ట్రవ్యాప్తంగా మహిళాశక్తి బలోపేతం కోసం విస్తృత కార్యక్రమాలు చేపడతామని మంత్రి వెల్లడించారు. ఈ కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థిక, సామాజిక సాధికారతపై అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.మహిళా సంఘాలు కేవలం ఆర్థిక కార్యకలాపాలకే పరిమితం కాకుండా, సామాజిక రంగంలో కూడా మరింత ముందుకెళ్లాలని మంత్రి సీతక్క సూచించారు. ఆర్థికంగా నిలదొక్కుకోని మహిళలను ప్రోత్సహించడం, వారికి రుణాల స్వీకరణ, వ్యాపారాల నిర్వహణలో సహాయం చేయాలని కోరారు. ప్రభుత్వం ఇచ్చే 'స్త్రీ నిధి' వంటి రుణాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అన్యాయాలకు గురైన తోటి మహిళలకు అండగా ఉండాలని, వారికి ధైర్యం చెప్పి చట్టపరంగా సాయం అందించాలని కోరారు. గ్రామం, బడి, అంగన్వాడీ కేంద్రాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నిర్వహణలోమహిళా సమాఖ్యలు క్రియాశీలకంగా వ్యవ హరించి, పర్యవేక్షించాలని అధికారులకు మంత్రి సీతక్క సూచించారు.

# ఆ ఇళ్లను హైడ్రా కూల్చదు వారికి భారీ ఊరటనిచ్చిన కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్ :** హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని ఇళ్ల కూల్చివేతలపై నెలకొన్న భయాందోళనలకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టతనిచ్చారు. బోడుప్పల్ ప్రాంతంలోని సుద్దకుంట చెరువు పరిసరాల్లో ఫుల్ ట్యాంక్ లెవల్ పరిధిలో ఉన్న ఇళ్ల మార్కింగ్పై స్థానికులు వ్యక్తం చేసిన ఆందోళనలను పరిశీలించిన కమిషనర్.. 30 ఏళ్లకు పైగా ఉన్న పాత భవనాల జోలికి హైడ్రా రాబోదని ప్రజలకు హామీ ఇచ్చారు.అధికారుల మార్కింగ్పై ఆగ్రహం.2025 నవంబర్ 15న బోడుప్పల్లోని సుద్దకుంట చెరువు ప్రాంతాలను కమిషనర్ రంగనాథ్ స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికులు తమ గోడును వెల్లబోసుకున్నారు. హెచ్ఎండీఏ , మున్సిపల్ అధికారులు తమ ఇళ్లపై పేరుతో నెంబర్లు, ఇనుప కడ్డీలను పెట్టి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని.. తాము 30 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని ఫిర్యాదు చేశారు. ప్రజల ఫిర్యాదులు విన్న తర్వాత, ఇళ్లపై అక్రమంగా చేసిన ఈ మార్కింగ్ను చూసి



కమిషనర్ రంగనాథ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని సిఫార్సు చేశారు.స్పష్టమైన హామీ, ప్రజలకు ఊరట.ఈ సందర్భంగా కమిషనర్ రంగనాథ్ పాత డ్రాఫ్ట్ నోటిఫికేషన్ల ఆధారంగానే చెరువు హద్దులు ఉంటాయని స్పష్టం చేశారు. స్థానికులు హైడ్రా గురించి భయపడాల్సిన అవసరం లేదని.. ఎవరైనా హైడ్రా పేరు చెప్పి డబ్బులు వసూలు చేయడానికి ప్రయత్నిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అంతేకాకుండా.. ఇళ్లపై వేసిన మార్కింగులను వెంటనే తొలగించాలని అధికారులను ఆదేశించారు.కమిషనర్ ఆదేశాల మేరకు హెచ్ఎండీఏ అధికారులు వెంటనే రంగంలోకి దిగి మార్కింగులను తొలగించారు. ఈ చర్యతో సుద్దకుంట ప్రాంత ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ తమ సమస్యను అర్థం చేసుకుని, తక్షణమే పరిష్కారం చూపినందుకు స్థానికులు ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలకు కష్టం కలిగించకుండా.. మానవతా దృక్పథంతో పనిచేస్తున్న కమిషనర్ సేవలను స్థానిక ప్రజలు ప్రశంసించారు.మౌలిక సదుపాయాల అభివృద్ధికి చర్యలు.ఇదే పర్యటనలో కమిషనర్ రంగనాథ్ సుద్దకుంట చెరువు అభివృద్ధికి , ఆ ప్రాంతంలో బాక్స్ డ్రెయిన్ పనులకు కూడా సిఫార్సు చేశారు. ఈ నిర్ణయాలు స్థానికులకు మరింత ఊరటనిచ్చాయి. ప్రభుత్వ యంత్రాంగం ప్రజల పక్షాన నిలబడి సమస్యలను పరిష్కరిస్తుందని ఈ సంఘటన నిరూపించింది.

# తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను కలిసిన ఆడ్ హాక్ కమిటీ



**నిజామాబాద్, నవంబర్16(డీడీ9 వార్త) :** తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవితను నిజామాబాద్ అర్బన్ ఆడ్ హాక్ కమిటీ సభ్యులు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా అడ్ హాక్ కమిటీ సభ్యులు తెలంగాణ జాగృతి బలోపేతానికి తమ వంతు కృషి చేస్తామని, ఎల్లప్పుడూ కవిత వెంట ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అంబటి శ్రీనివాస్ గౌడ్, కరిపె రాజు, ఇరుమల శంకర్, పంచరెడ్డి మురళి, యెండల ప్రసాద్, సాయికృష్ణ నేత తదితరులు పాల్గొన్నారు.

# లయన్స్ క్లబ్ సేవ : బీసీ హాస్టల్ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ



**నిజామాబాద్, నవంబర్16(డీడీ9 వార్త) :** భీమ్గల్ పట్టణంలోని బడుగు బలహీన వర్గాల వసతి గృహంలో నివసిస్తున్న 30 మంది విద్యార్థులకు భీమ్గల్-వేముగల్లు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం దుప్పట్లు పంపిణీ చేశారు. చలికాలం తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో ఒక వార్త పత్రికలో దుప్పట్ల కొరతపై వచ్చిన వార్తను చూసి స్పందించినట్లు క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ పడల పురందర్ తెలిపారు. విద్యార్థులు చలి బాధ మరచి, కేవలం చదువుపై దృష్టి సారించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామని ఆయన పేర్కొన్నారు. ఈ సామాజిక సేవను హాస్టల్ ఇంచార్జి వార్డెన్ కొనియాడి, విద్యార్థుల తరఫున కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి గజ్జెల చైతన్య, క్లబ్ కోశాధికారి ఎడ్ల శేఖర్, ఉపాధ్యక్షులు హన్మాండ్లు, ప్రసాద్, పీఆర్వో పురస్తు లింబాద్రి, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్ డా. శ్రీకాంత్ రామావత్ తదితరలు పాల్గొన్నారు.

# హరినామ సంకీర్తనలతో సిద్దుల గుట్ట చుట్టూ గిరిప్రదక్షిణం



**నిజామాబాద్, నవంబర్16(డీడీ9 వార్త) :** ఇస్కాన్ ఆధ్వర్యంలో ఆర్మూర్ పట్టణంలోని సిద్దుల గుట్ట చుట్టూ గిరిప్రదక్షిణ కార్యక్రమాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా భక్తులు భక్తి శ్రద్ధలతో హరినామ సంకీర్తనలు చేస్తూ సిద్దుల గుట్ట చుట్టూ ప్రదక్షిణ చేశారు. కార్తీకమాసంలో ఈ పవిత్రమైన సిద్దుల గుట్ట చుట్టూ గిరి ప్రదక్షిణం చేయడం ద్వారా ఎంతో పుణ్యం లభిస్తుందని ఇస్కాన్ ప్రతినిధులు భక్తులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్మూర్ ఇస్కాన్ అధ్యక్షుడు ఆది పురుష ప్రభుజీ, నిజామాబాద్ కంఠేశ్వర్ ఇస్కాన్ అధ్యక్షుడు రామానంద రాయ గౌరదాస్ ప్రభుజీ, భక్తులు పాల్గొన్నారు.

# కామారెడ్డి పోలీస్ కానిస్టేబుల్ అనైతిక చర్యకు సస్పెన్షన్

**కామారెడ్డి,నవంబర్ 16(డిడి9 వార్త):** కామారెడ్డి పోలీస్ స్టేషన్లో విధులు నిర్వహిస్తున్న ఏ. విశ్వనాథం, కానిస్టేబుల్-2078, స్టేషన్లో ఉన్న బజాజ్ పల్సర్ ను ఎలాంటి అనుమతి లేకుండా బయటకు తీసుకొని, తన వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించి ప్రషాంత్ మెకానిక్ షాప్ వద్ద ఉంచినట్లు తెలిసింది.ఈ ఘటనపై జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, చర్య తీసుకున్నారు.పోలీస్ వాహనాలను అనుమతి లేకుండా వ్యక్తిగత అవసరాలకు ఉపయోగించడం పూర్తిగా అనైతికం నిజాయితీ, నైతికత, నియమాలను పాటించకపోవడం పోలీసు ప్రతిష్టకు ముప్పు కలిగిస్తుంది. ఇలాంటి చర్యలపై ఎలాంటి సడలింపు ఉండదు శాఖ పరమైన కఠిన చర్యలు తప్పవు అని ఆయన తెలిపారు.ఈ ఘటనను స్వల్ప కాలంలో పరిశీలించిన తర్వాత, ఏ. విశ్వనాథం, కానిస్టేబుల్ 2078 పై సస్పెండేషన్ ఉత్తర్వులు జారీ చేయడం జరిగిందన్నారు.

# ఇన్‌స్పెక్టర్ సతీశ్ కుమార్ పోస్టుమార్టం నివేదికపై ఉత్కంఠ




**అనంతపురం, నవంబరు16 :** టీటీడీ మాజీ ఏవీఎస్‌వో, ఇన్‌స్పెక్టర్ సతీశ్ కుమార్ పోస్టుమార్టమ్ నివేదికపై తీవ్ర ఉత్కంఠ నెలకొంది. ప్రత్యేక టీమ్‌లను ఏర్పాటు చేసి పలుకోణాల్లో దర్యాప్తు చేస్తున్నారు అనంతపురం పోలీసులు. (శనివారం) గుంతకల్లు - తాడిపత్రి రూట్‌లోని రైళ్ల నుంచి ఓ బొమ్మను కిందికి తోసివేసి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు పోలీసులు. సతీశ్ కుమార్‌కు సమానమైన బరువు ఉన్న ఓ బొమ్మను రైలు నుంచి తోసి పరిశీలించారు. ఒక బొమ్మ రెండు అడుగులు పడగా, మరో బొమ్మ ఐదు నుంచి పది అడుగుల దూరంలోనే పడటంతో ఈ ఘటనపై పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. సీన్ రీ రీకన్‌స్ట్రక్షన్‌ను స్వయంగా పర్యవేక్షించారు అనంతపురం జిల్లా ఎస్పీ జగదీశ్.మరో వైపు.. సతీశ్‌కుమార్ ఫోన్ డేటాను విజయవాడ ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపి నిశితంగా పరిశీలిస్తున్నారు పోలీసులు. ఈనేపథ్యంలోనే గుంతకల్లు, గుత్తి, తాడిపత్రి టవర్ లొకేషన్లు, సీసీ కెమెరాలని పరిశీలిస్తున్నారు. అయితే, సతీశ్ కుమార్ హత్య కేసు దర్యాప్తును ముమ్మరం చేశారు అనంతపురం జిల్లా పోలీసులు.13వ తేదీ రాత్రి రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ఏసీ కోచ్‌లో ప్రయాణించిన 1140 మంది ప్రయాణికుల లిస్ట్‌ను సేకరించారు పోలీసులు. ప్రయాణికుల్లో పాత నేరస్తులు, నేరపూరిత స్వభావం కలిగిన వారు ఎవరైనా ఉన్నారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. నిన్న జరిగిన సీన్ రిక్రియేషన్‌లో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ ప్రయాణించినంత వేగంతో ఇతర రైళ్లు ఏవి వెళ్లకపోవడంతో మరొకసారి సీన్ క్రియేట్ చేసేందుకు సిద్ధమయ్యారు అనంతపురం పోలీసులు.

# ఏపీ రాజకీయాల్లో ఆసక్తికరం మరోతరం అరంగ్రేటం




**విజయవాడ, నవంబరు16 :** ఏపీ రాజకీయాల్లో మరో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. రాజకీయాల్లో వంగవీటి రంగా కుమార్తె ఆశా కిరణ్ ) రాజకీయాల్లో అరంగ్రేటం చేయనున్నారు. ఈ మేరకు ప్రజలతో తాను మమేకం అవుతానని.. ఇక నుంచి పాలిటిక్స్‌లో యాక్టివ్ అవుతానని వ్యాఖ్యానించారు.ఆదివారం) వంగవీటి రంగా విగ్రహానికి నివాళులు అర్పించి త్వరలోనే రాజకీయాల్లోకి వస్తున్నట్లు ప్రకటించారు ఆశ కిరణ్. ఈ సందర్భంగా ఆశా కిరణ్ మీడియాతో మాట్లాడారు. రాధా, రంగా మిత్రమండలి ఆహ్వానం మేరకు పలు కార్యక్రమాల్లో పాల్గొంటానని పేర్కొన్నారు.రంగా ఆశయ సాధన కోసం తాను కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ప్రజల జీవితానికి కొంతకాలంగా తాను దూరంగా ఉన్నానని.. ఇకపై పూర్తిగా తన జర్నీ ప్రజలతోనే ఉంటుందని స్పష్టం చేశారు. ప్రజలకు ఏ కష్టం వచ్చినా తాను అండగా ఉంటానని భరోసా కల్పించారు. రాధా, రంగా మిత్రా మండలి మధ్య కొంత గ్యాప్ ఉందని పేర్కొన్నారు. ఆ గ్యాప్ ఫుల్ ఫిల్ చేయడానికి తాను రాజకీయాల్లోకి వస్తున్నానని వివరించారు. కులం, మతం బేధం లేకుండా సహాయం చేశారని వంగవీటి రాధా, రంగాలని కీర్తించారు ఆశా కిరణ్.

# పశువుల ఆస్పత్రిని ప్రారంభించిన నందమూరి బాలకృష్ణ



**హిందూపురం :** ప్రాంతంలో కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతీయువకులను ఆదుకుంటానని స్థానిక ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ తెలిపారు. నియోజకవర్గంలోని మలుగురు గ్రామంలో రూ. 26. 5లక్షలతో నిర్మించిన పశువుల ఆస్పత్రిని బాలకృష్ణ ప్రారంభించారు. దీనితో పాటు హిందూపురం మున్సిపాలిటీ పరిధిలో పలు అభివృద్ధి పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం బాలకృష్ణ మాట్లాడుతూ.. హిందూపురం అభివృద్ధికి శక్తివంచన లేకుండా పనిచేస్తానని తెలిపారు. తనను మూడుసార్లు గెలిపించిన నియోజకవర్గ ప్రజలకు రుణపడి ఉంటానని పేర్కొన్నారు. హిందూరం నియోజకవర్గానికి కొత్త పరిశ్రమలు తీసుకొచ్చి నిరుద్యోగ యువతీయువకులను ఆదుకుంటానని చెప్పారు. ఏపీ మంత్రులంతా హిందూపురం అభివృద్ధిపైనే దృష్టి పెట్టారని తెలపారు.ఇదిలా ఉంటే.. నందమూరి బాలకృష్ణ హీరోగా వస్తున్న అఖండ 2 సినిమా నుంచి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్ వచ్చింది. అఖండ సినిమాకు సీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమాను 2డీ వెర్షన్‌తో పాటు 3డీ ఫార్మాట్‌లో కూడా విడుదల చేయబోతున్నట్లు ప్రకటించారు.

# అయ్యప్ప భక్తులకు ముఖ్య సూచన



**అమరావతి:** ప్రతీ ఏడాది నవంబర్, డిసెంబర్, జనవరి నెలలలో అయ్యప్ప భక్తులు మాలధారణ చేస్తారు. ముఖ్యంగా తెలుగు రాష్ట్రాల్లో అయ్యప్ప దీక్ష చేపట్టి శబరిమల యాత్ర చేసి అయ్యప్ప స్వామిని దర్శించేందుకు తరలివెళు ్తంటారు.ఇక, అయ్యప్ప మాల ధరించి శబరిమలకు వెళ్లే భక్తుల సంఖ్య లక్షల్లో ఉంటుంది. ఈ సందర్భంగా అయ్యప్పభక్తులకు కేరళ వైద్య శాఖ పలు హెచ్చరికలు జారీచేసింది. 'బ్రెయిన్ ఫీవర్' పట్ల భక్తులు అప్రమత్తంగా ఉండాలని కోరింది. కేరళలో ఇటీవల ప్రమాదకరమైన ప్రైమరీ అమీబిక్ మెనింజోఎన్సెఫలైటిస్ (వ్యాధి - దీనిని 'బ్రెయిన్ ఈటింగ్ అమీబా' ఫీవర్ అని.. మెదడు వాపు వ్యాధి అని పిలుస్తుంటారు. దీనికి సంబంధించి కేరళ డైరెక్టర్ ఆఫ్ హెల్త్ సర్వీసెస్ డాక్టర్. విజయ్‌కుమార్ పురుషోత్తం పలు సూచనలు చేశారు. భక్తులు స్నానం చేసేప్పుడు నదులు, సెలయేర్ల నీరు ముక్కు ద్వారా లోనికి పోకుండా చూసుకోవాలన్నారు. తలనొప్పి, జ్వరం, వాంతులు, మూర్ఛలు వంటి సూచనలు కనిపించినప్పుడు వెంటనే వైద్యుల సాయం తీసుకోవాలని కోరారు. డయాగ్నసిస్ లేకపోతే ప్రాణాపాయం సంభవించే అవకాశం కూడా ఉందని హెచ్చరించారు.

# ఏపీ ప్రభుత్వ ప్రజాహిత చర్యలు అభినందనీయం



**అమరావతి, నవంబరు16 :** భారత రాజ్యాంగానిది 75 ఏళ్ల విజయవంతమైన ప్రస్థానమని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు. రాజ్యాంగం గొప్పదనం గురించి మాట్లాడే అవకాశం తనకు రావడం చాలా గొప్ప విషయమని పేర్కొన్నారు. తన స్వస్థలం మహారాష్ట్రలోని అమరావతి అని తెలిపారు. తన న్యాయవాద ప్రస్థానం అమరావతిలో ప్రారంభమైందని ఉద్ఘాటించారు.భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చి 75 ఏళ్ల పూర్తయిన సందర్భంగా (ఆదివారం) ఏపీ హైకోర్టు న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో సీకే కన్వెన్షన్‌లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్ , ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పాల్గొన్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకుర్, హైకోర్టు న్యాయమూర్తులు, అడ్వొకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, పలువురు న్యాయవాదులు హాజరయ్యారు. 'ఇండియా అండ్ ది లివింగ్ ఇండియన్ ఇన్‌స్టిట్యూషన్ ఎట్ 75 ఇయర్స్' అనే అంశంపై ప్రసంగించారు జస్టిస్ గవాయ్.అమరావతికి రావడం నాకు సంతోషంగా ఉంది.సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా తనను నియమించిన తర్వాత తొలిసారిగా ఏపీ రాజధాని అమరావతికి వచ్చానని చెప్పుకొచ్చారు. అమరావతికి రావడం తనకు చాలా సంతోషంగా ఉందని పేర్కొన్నారు. అమరావతికి గొప్ప చారిత్రాత్మక గుర్తింపు ఉందని నొక్కిచెప్పారు. మహారాష్ట్రలోని అమరావతిని ఇంద్రపురిగా పిలుస్తారని.. ఏపీలోని ఇక్కడి అమరావతి సైతం ఇంద్రుడు తిరిగిన నేలగా ప్రసిద్ధి చెందిందని అభివర్ణించారు. సీజేఐగా తన చివరి కార్యక్రమం కూడా అమరావతిలో జరుగుతోందని వివరించారు. భారత పౌరుల ప్రాథమిక హక్కులకు భంగం కలగకుండా రాజ్యాంగం రక్షణ కల్పించిందని ఉద్ఘాటించారు. ప్రాథమిక హక్కులకు భంగం కలిగితే రాజ్యాంగం రక్షణ కల్పిస్తుందని వివరించారు జస్టిస్ బీఆర్ గవాయ్.పౌరుల హక్కులు కాపాడేలా రక్షణ కల్పించాలి.పౌరుల ప్రాథమిక హక్కులు కాపాడేలా కోర్టులు రక్షణ కల్పించాలని సూచించారు. రాజ్యాంగాన్ని రాజ్యాంగ సభకు అప్పగిస్తూ అంబేద్కర్ చేసిన ప్రసంగం ప్రతిఒక్కరూ గుర్తుంచుకోవాలని కోరారు. సామాజిక, ఆర్థిక సమానత్వం సాధనే లక్ష్యంగా రాజ్యాంగంలో ఆదేశిక సూత్రాలను పొందుప రిచారని వివరించారు. పౌరులందరూ సమానంగా ఎదిగేలా అవకాశాలను రాజ్యాంగం కల్పించిందని నొక్కిచెప్పారు. మహిళా సాధికారత సాధనే లక్ష్యంగా మహిళలకు సమాన అవకాశాలు రాజ్యాంగంలో కల్పించారని పేర్కొన్నారు జస్టిస్ బీఆర్ గవాయ్. ఎస్సీ వర్గీకర ణకు అనుగుణంగా సుప్రీం తీర్పు.'రాజ్యాంగం గత 75 ఏళ్లలో అనేక రంగాల్లో రిజర్వేషన్లను వర్తింపజేసింది. మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ పార్లమెంట్‌లోనూ చట్టం చేశారు. సామాజిక, ఆర్థిక అసమానతలు తొలగించే ందుకు విద్య ఎంతో ముఖ్యమని అంబేడ్కర్ చెప్పారు. ఎస్సీ వర్గీకరణకు అనుగుణంగా సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమిలేయర్ ఉండాలనేది నా అభిప్రాయం. జ్యోతి రావ్ పూలేను అంబేడ్కర్ గురువుగా భావించేవారు. మహిళలపై అసమానత రూపుమాపేందుకు జ్యోతి రావ్ పూలే ఎంతో కృషి చేశారు. పని ప్రదేశాల్లో మహిళలపై వివక్ష ఉండకూడదని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చింది. మహిళలకు సమానత్వం ఉండాలనేది సుప్రీంకోర్టు విధానం. న్యాయ రంగంలో మహిళలు చాలా బాగా రాణిస్తున్నారు' అని జస్టిస్ బీఆర్ గవాయ్ వ్యాఖ్యానించారు.

# సీఐఐ సదస్సు సూపర్ హిట్ కూటమి ప్రభుత్వంపై మన్నవ మోహనకృష్ణ ప్రశంసలు





**విశాఖపట్నం:** విశాఖపట్నంలో నిర్వహించిన రెండు రోజుల ప్రతిష్టాత్మక సీఐఐ భాగస్వామ్య సదస్సులో ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మన్నవ మోహనకృష్ణ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు ప్రమాణ స్వీకారం చేసిన వెంటనే అభివృద్ధికి నాంది పలుకుతూ పెట్టుబడిదారులను ఆహ్వానించారని అన్నారు. విద్య, ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషి అత్యంత ప్రశంసనీయమని పేర్కొన్నారు.అనేక దిగ్గజ కంపెనీలు పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంతో ఆంధ్రప్రదేశ్ భవిష్యత్తు మరో దశలోకి అడుగుపెడుతోందని మన్నవ మోహనకృష్ణ సంతోషం వ్యక్తం చేశారు. విశాఖ వేదికగా రెండురోజులు పాటు సాగిన 30వ సీఐఐ భాగస్వామ్య సదస్సు సూపర్ హిట్ అయిందని, రెండు రోజుల్లో రూ.13 లక్షల కోట్ల పెట్టుబడులు సాధించడం గొప్ప రికార్డని అన్నారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్రంలో యువతకి 20లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పించే విధంగా ముందుకు వెళుతోందని చెప్పారు.విశాఖపట్నంలో ఈ సీఐఐ సమిట్ నిర్వహణతో ఆంధ్రప్రదేశ్ దేశంలోనే అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి గమ్యస్థానంగా మారిందని పేర్కొన్నారు. పరిశ్రమలకు భూములు, మౌలిక సదుపాయాలు కల్పిస్తూ ఏపీ అభివృద్ధి దిశగా ముందుకు సాగుతుంటే.. గత వైసీపీ ప్రభుత్వ కాలంలో ఒక్క నూతన కంపెనీ రాకపోగా, ఉన్న పరిశ్రమలనే వెళ్లగొట్టి రాష్ట్రాన్ని దెబ్బతీశారని మండిపడ్డారు. ఈ సీఐఐ సదస్సు ద్వారా ఆంధ్రప్రదేశ్‌ను దేశవ్యాప్తంగా అత్యంత ఆకర్షణీయ పెట్టుబడి రాష్ట్రంగా మార్చడమే ముఖ్య లక్ష్యమని ఏపీ టెక్నాలజీ సర్వీసెస్ ఛైర్మన్ మన్నవ మోహనకృష్ణ స్పష్టం చేశారు.

# ఏపీలో ప్రమాదకరంగా ఆర్థిక పరిస్థితి



అమరావతి : కూటమి ప్రభుత్వ హయాంలో ఆంధ్రప్రదేశ్ ఆర్థిక పరిస్థితి ప్రమాదకర పరిస్థితిలో ఉందని వైసీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆరోపించారు. 2025-26లో అర్ధ సంవత్సర ఆర్థిక పరిస్థితిపై కాగ్ విడుదల చేసిన గణాంకాలు ఉటంకిస్తూ కాగ్ నివేదికను ట్విట్టర్‌లో పోస్టు చేశారు.సంపద సృష్టిస్తామంటూ కూటమి నాయకులు చెప్పిన దానికి భిన్నంగా పరిస్థితి ఉందని విమర్శించారు. సొంత ఆదాయాలు ఏమాత్రం పెరగకపోగా, మూల ధన పెట్టుబడులు గణనీయంగా తగ్గిపోతుందని ఆరోపించారు. 2025-26లో ఆర్థిక సంవత్సర వృద్ధి 17.1శాతం లక్ష్యంగా పెట్టుకోగా నేడు కేవలం 7.03 శాతం మాత్రమే పెరిగిందన్నారు.టీడీపీ కూటమి ప్రభుత్వ పనితీరును గమనిస్తే వైఫల్యాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో అభివృద్ధిలో రాష్ట్రం దూసుకుపోతుందని ఎలా ప్రచారం చేస్తారని మండిపడ్డారు. గడిచిన రెండేళ్లలో కేవలం 2.75 శాతం మాత్రమే పెరిగిందని వివరించారు.2019-24 సంవత్సరంలో వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో 9.87శాతం రాష్ట్ర రెవెన్యూ పెరిగిందని అన్నారు. రూ. 58,031 కోట్లు ఉన్న బడ్జెట్ రూ. 91,922 కోట్లకు పెరిగిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అప్పుల విషయంలో మాత్రం దూసుకుపోతుందని ఆరోపించారు.

# మళ్లీ భారీ వర్షాలు



**అమరావతి, నవంబర్ 16:** నైరుతి బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కొనసాగుతోందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఆదివారం వెల్లడించింది. దీని ప్రభావంతో సోమవారం.. నెల్లూరు,తిరుపతి జిల్లాల్లో అక్కడక్కడ మోస్తరు నుంచి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. అలాగే ప్రకాశం, అన్నమయ్య, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని వివరించింది. ఈ నేపథ్యంలో అప్రమత్తంగా ఉండాలని ఏపీ ప్రజలకు రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచించింది.మరోవైపు అక్టోబర్ చివరిలో మొంథా తుపాన్ కారణంగా ఆంధ్రప్రదేశ్ చిగురుటాకులా వణికింది. ఈ తుఫాన్ కారణంగా.. భారీగా ఆస్తి నష్టం సంభవించింది. లక్షలాది హెక్టార్లలోని పంట నీట మునిగింది. దాంతో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన బృందం.. ఇప్పటికే మొంథా తుఫాన్ ప్రభావిత జిల్లాల్లో పర్యటించింది. పంట నష్టంపై నివేదికను రూపొందించి కేంద్రానికి అందజేసింది.శ్రీలంక సమీపంలో నైరుతి బంగాళాఖాతంలో శనివారం అల్పపీడనం ఏర్పడింది. ఇది పశ్చిమ వాయవ్యంగా పయనించి తమిళనాడు వైపు కదలనుంది. దీని ప్రభావంతో బంగాళాఖాతం నుంచి తూర్పుగాలులు తమిళనాడుతోపాటు దానికి ఆనుకుని దక్షిణ కోస్తా, రాయలసీమ వైపు వీస్తున్నాయి. ఆదివారం దక్షిణ కోస్తా, రాయలసీమల్లో పలుచోట్ల తేలికపాటి నుంచి ఒక మోస్తరు వర్షాలు కురుస్తాయి. సోమవారం నెల్లూరు, తిరుపతి జిల్లాల్లో అతిభారీ, ప్రకాశం, చిత్తూరు, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీవర్షాలు కురుస్తాయి. ఇక 18వ తేదీన నెల్లూరు, తిరుపతి, చిత్తూరు జిల్లాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ వెల్లడించింది.అలాగే ఉత్తర కోస్తాలో పొడి వాతావరణం ఉంటుంది. మరోవైపు వాయవ్య భారతం నుంచి గాలులు కోస్తా, రాయలసీమ వరకు వీస్తుండడంతో చలి పెరిగింది. రాత్రి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే మూడు నుంచి ఆరు డిగ్రీలు తక్కువగా నమోదయ్యాయి. అరకులోయలో 7, డుంబ్రిగుడలో 7.6 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో చలిగాలులు కొనసాగుతాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, అల్పపీడనం రాగల 24గంటల్లో పశ్చిమ వాయవ్య దిశగా నెమ్మదిగా కదులుతుందని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. అలాగే, ఈనెల 21న ఆగ్నేయ బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది. దీని ప్రభావంతో ఈనెల 24-27 తేదీల మధ్య కోస్తా, రాయలసీమ జిల్లాల్లో అక్కడక్కడా మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది.

# సీఐఐ సమ్మిట్-2025 చరిత్ర సృష్టించింది




**అమరావతి:** ఆంధ్రప్రదేశ్ పెట్టుబడుల దిశను మార్చిన చారిత్రాత్మక వేదిక విశాఖ సీఐఐ సమ్మిట్-2025 అని మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు సీఎం చంద్రబాబు నాయుడు మంత్రి నారా లోకేశ్ పెద్దఎత్తున శ్రమిస్తున్నారని ప్రశంసించారు. విశాఖ వేదికగా ఈనెల 14, 15వ తేదీల్లో సీసీఐ భాగస్వామ్య సదస్సు-2025 జరిగిన సంగతి తెలిసిందే. ఈ సదస్సు ద్వారా రాష్ట్రానికి లక్షల కోట్ల పెట్టుబడులు, ఉద్యోగ, ఉపాధి అవకాశాలు రానున్నట్లు కూటమి ప్రభుత్వం ప్రకటించింది. ఇందుకు కష్టపడిన సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్‌పై ప్రశంసలు కురుస్తున్నాయి. కాగా, సమ్మిట్ విజయవంతం కావడంపై తాజాగా మంత్రి అనగాని స్పందించారు.ఈ సందర్భంగా మంత్రి అనగాని మాట్లాడుతూ.. 'ఏపీని పెట్టుబడుల హబ్‌గా మార్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి లోకేశ్ శ్రమిస్తున్నారు. పెట్టుబడులను ఏపీకి తేవడంలో చంద్రబాబు మరోసారి తన సత్తా చాటారు. మూడు ప్రాంతాలకూ సమానంగా పెట్టుబడులు వచ్చేలా మంత్రి లోకేశ్ ప్రత్యేకంగా కంపెనీలను గైడ్ చేశారు. మిగిలిన రాష్ట్రాలకు భిన్నంగా స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌ను అనుసరిస్తుండడంతో ఏపీకి పరిశ్రమలు క్యూ కట్టాయి.మొత్తం రూ.13లక్షల కోట్ల పెట్టుబడులు, 16 లక్షల ఉద్యోగాలు రావడం ఏపీపై పెట్టుబడిదారుల నమ్మకానికి ప్రత్యక్ష సాక్ష్యం. అన్ని కీలక శాఖలతో ఒప్పందాలు కుదరడమనేది పెట్టుబడులను సమగ్రంగా ఆకర్షిస్తున్న ప్రభుత్వ నైపుణ్యాన్ని చూపింది. మూడు ప్రాంతాలకు సమానంగా పెట్టుబడులు వెళ్లడం.. ప్రభుత్వ వికేంద్రీకరణ నిబద్ధతకు నిదర్శనం. సీఐఐ సదస్సులో ప్రతి జిల్లాకి ప్రాధాన్యత లభించింది. ప్రతి జిల్లాకూ పరిశ్రమలను తీసుకొచ్చారు. విశాఖలో సదస్సు జరిగినా పెట్టుబడులు మాత్రం యావత్ రాష్ట్రానికి విస్తరించేలా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ కృషి చేశారని' కొనియాడారు.

# రోహిణి ఆచార్యపై దాడి చేసిన రమీజ్ నేమత్ ఎవరంటే



**పాట్నా:** బిహార్ ఎన్నికల్లో ఆర్జేడీఘోరంగా దెబ్బతినడం లాలూ ప్రసాద్ యాదవ్ కుటుంబంపై తీవ్ర ప్రభావం చూపింది. లాలూ కుమార్తె రోహిణి ఆచార్య రాజకీయాలకు గుడ్‌బై చెప్పడంతో పాటు కుటుంబాన్ని వదులుకుంటున్నట్టు కూడా ప్రకటించడం ప్రకంపనలు సృష్టించింది. పార్టీ దయనీయ ఫలితాలపై ప్రశ్నించినందుకు తన సోదరుడు తేజస్వి యదవ్, ఆయన సన్నిహితులైన ఆర్జేడీ ఎంపీ సంజయ్ యాదవ్ రమీజ్ నేమత్ తనపై దాడి చేసి కొట్టారని ఆమె తీవ్రారోపణలు చేశారుఎవరీ రమీజ్ నేమత్ తేజస్వి యాదవ్‌కు కీలక సన్నిహితుడైన రమీజ్ నేమత్ ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని భంగ్‌కలా గ్రామానికి చెందినవాడు. రాజకీయ సంబంధాలున్న కుటుంబం నుంచి వచ్చాడు. ఆయన తండ్రి ఎన్‌యూ ఖాన్ ఢిల్లీలోని జామియా మిలియా ఇస్లామియాలో ప్రొఫెసర్. బల్రామ్‌పూర్ మాజీ ఎంపీ రిజ్వాన్ జహీన్ అల్లుడు. క్రికెట్ ఆడుకునే రోజుల నుంచి తేజస్వికి రమీజ్ సన్నిహితుడు. కీలకమైన పార్టీ బాధ్యతలను నిర్వహిస్తున్నాడు. పార్టీ సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నాడు. ప్రచార నిర్వహణ బాధ్యతలతో పాటు ఆర్జేడీ సోషల్ మీడియా మానిటరింగ్ బాధ్యతలు చూస్తున్నాడు. తేజస్వి ఆంతరంగికుల్లో సంజయ్ యాదవ్‌తో పాటు రమీజ్ కూడా ఉన్నాడు.వివాదాల్లోనూ.రమీజ్ నేమత్‌పై పలు క్రిమినల్ ఆరోపణలు ఉన్నాయి. 2021లో తులసీపూర్ నగర్ పంచాయత్ చైర్మన్ ఫిరోజ్ అహ్మద్ పప్పు హత్య కేసు, 2023లో కౌషాంబిలో కాంట్రాక్టర్ మహమ్మద్ షకీల్ అహ్మద్ హత్య కేసులో అతను నిందితుడు. ఆయన, ఆయన సహచరులు పలు కేసుల్లో బెయిలుపై ఉన్నారు. 2023లో అతనికి సంబంధించిన రూ.4.75 కోట్ల ఆస్తులను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. స్థానిక బాధితుల బంధువులు సైతం రమీజ్‌కు ఆశ్రయం ఇవ్వడంపై తేజస్విని విమర్శించిన సందర్భాలున్నాయి. రాజకీయ పరపతితో రక్షణ పొందుతున్న నేరస్థుడిగా రమీజ్‌ను వీరు చెబుతుంటారు.కాగా, పార్టీలోనూ, కుటుంబంలోనూ తీవ్ర సంక్షోభం నెలకొన్న తరుణంలో రోహిణి ఆచార్య తన కుటుంబం నుంచి తాజాగా బయటకు వచ్చేశారు. దీనికి ముందు ఆమె సోదరుడు తేజ్ ప్రతాప్ యాదవ్‌ను కూడా పార్టీ నుంచి, కుటుంబం నుంచి ఆర్జేడీ బహిష్కరించింది. ఆర్జేడీ అంతర్గత, కుటుంబ కలహాల ప్రభావం, పనితీరు తాజా అసెంబ్లీ ఎన్నికల ఫలితాలపై తీవ్ర ప్రభావం చూపిందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. 143 స్థానాల్లో పోటీ చేసిన ఆర్జేడీ కేవలం 25 సీట్లలో గెలుపునకే పరిమితమైంది. ఎన్డీయే రికార్డు స్థాయి గెలుపు సాధించింది.రోహిణి భావోద్వేగ సందేశం రాజకీయాల నుంచి, కుటుంబం నుంచి తప్పుకుంటున్నానంటూ రోహిణి ఆచార్య వరుస పోస్టుల్లో తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు. 'వాళ్లు నా కుటుంబాన్ని, హక్కులను, గౌరవాన్ని ఊడలాక్కున్నారు. నన్ను అనాథను చేశారు. ఏ ఇంట్లో నూ రోహిణిలాంటి కూతురు కానీ, సోదరి కానీ ఉండకూడదు' అని ఆవేదన వ్యక్తం చేసారు. తన తండ్రి లాలూ ప్రసాద్ యాదవ్‌కు తన కిడ్నీని రోహిణి ఆచార్య ఇటీవల ఇచ్చారు.

# బీహార్ ఎన్నికలు ఆ ఘనత సాధించిన తొలి వ్యక్తి మైథిలీ ఠాకూర్



**పాట్నా, నవంబర్ 16:** జానపద గాయని మైథిలీ ఠాకూర్ బీహార్ ఎన్నికల్లో సంచలనం సృష్టించారు. అలీనగర్ నియోజకవర్గం నుంచి బీజేపీ తరఫున బరిలోకి దిగిన మైథిలీ ఆర్జేడీ దిగ్గజ నేత వినోద్ మిశ్రాను 11 వేల ఓట్ల తేడాతో ఓడించి చరిత్ర సృష్టించారు. అలీనగర్ నియోజకవర్గంలో బీజేపీ గెలవడం ఇదే తొలిసారి. బీహార్ ఎన్నికల్లో గెలిచిన అతి పిన్న వయస్కురాలిగా మైథిలి రికార్డ్ సృష్టించారు మైథిలీ వయసు 25 సంవత్సరాలు. మైథిలీ ఖాతాలో మరో రికార్డు కూడా ఉంది. భారత్‌లో 21వ శతాబ్దంలో జన్మించి ఎమ్మెల్యే అయిన తొలి వ్యక్తిగా మైథిలీ నిలిచారు. మైథిలీ జులై 25, 2000న జన్మించారు. ఇప్పటివరకు మన దేశంలో జన్మించిన వారందరూ 19, 20వ శతాబ్దాలలో జన్మించిన వారే. అంటే 2000 సంవత్సరానికి ముందు జన్మించినవారే. 2000 సంవత్సరంలో జన్మించి ఎమ్మెల్యే అయిన తొలి వ్యక్తిగా మైథిలీ రికార్డు సృష్టించారు ఎటువంటి రాజకీయ నేపథ్యం లేకుండా పోటీన చేసిన మొదటి సారే ఎమ్మెల్యేగా గెలుపొందిన తక్కువ మందిలో మైథిలీ కూడా ఒకరిగా నిలిచారు. మైథిలీ తండ్రి రమేష్ ఠాకూర్ శాస్త్రీయ సంగీతకారుడు, గాయకుడు. తల్లి భారతి గృహిణి. చిన్నప్పటి నుంచే శాస్త్రీయ సంగీతం నేర్చుకున్న మైథిలీ తన జానపద పాటలతో సోషల్ మీడియాలో భారీ ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. 2024లో ఆమె శబరి మీద పాడిన పాట ప్రధాని మోదీని ఎంతగానో ఆకట్టుకుంది. ఆమెపై ప్రధాని ప్రశంసల జల్లు కురిపించారు.

# మళ్లీ సీఎం నీతీశ్ కుమారేనా ప్రమాణస్వీకారం డేట్ ఫిక్స్ అయిందా



**బిహార్ :** బిహార్‌లో అఖండ విజయం సాధించిన ఎన్‌డీఏ ప్రభుత్వ ఏర్పాటుకు సిద్ధమయింది. నవంబర్ 19, 20 తేదీల్లో పట్నాలోని గాంధీ మైదాన్‌లో ప్రమాణ స్వీకార కార్యక్రమం ఉంటుందని ఎన్?డీఏ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమానికి ప్రధాని నరేంద్ర మోదీ సహా బీజేపీ పాలిత ముఖ్యమంత్రులు హాజరుకానున్నారు. సీఎం నీతీశ్‌కుమార్ అధ్యక్షతన జరిగే మంత్రివర్గ సమావేశం 17వ అసెంబ్లీ రద్దును ఆమోదించనుంది. తర్వాత నీతీశ్ గవర్నర్‌ను కలిసి రాజీనామా సమర్పిస్తారు.ఈ దఫా కూడా నీతీశ్ కుమార్ ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేస్తారని బిహార్ రాజకీయాల్లో చర్చ నడుస్తోంది. సీఎం పీఠం తమకే కావాలని ముందు బీజేపీ పట్టుబట్టినట్లు కనిపించినప్పటికీ నీతీశ్‌కే మరోసారి పగ్గాలు అప్పగించనున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. జేడీయూ నుంచి 14, బీజేపీ నుంచి 15, ఎల్?జేపీ నుంచి ముగ్గురు మంత్రులు ఉండొచ్చని ప్రచారం జరుగుతోంది. బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కీలకపార్టీలైన బీజేపీ 89, జేడీయూ 85, ఎల్జేపీ 19 స్థానాల్లో గెలుపొందాయి. మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ రద్దుకు ఆమోదం!బిహార్ అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఎన్నికల సంఘం ఆదివారం గవర్నర్ రాజేంద్ర అర్లేకర్‌కు సమర్పించనుందని సంబంధిత వర్గాలు పేర్కొన్నాయి. ఆ తర్వాత కొత్త అసెంబ్లీ ఏర్పాటుకు నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు పేర్కొన్నాయి. అయితే ప్రమాణస్వీకారానికి 19 లేదా 20 తేదీల్లో ఏది నిర్ణయిస్తారనే విషయం ప్రధాని నరేంద్ర మోదీ షెడ్యూల్‌పై ఆధారపడి ఉంటుందని తెలిపాయి. మరోవైపు సోమవారం జరగనున్న మంత్రివర్గ సమావేశంలో అసెంబ్లీ రద్దుకు ఆమోదం తెలిపే అవకాశమున్నట్లు తెలస్తోంది. గవర్నర్‌కు సమర్పిస్తారు. తద్వారా కొత్త ప్రభుత్వ స్థానంలో జేడీయూ ఇతర పార్టీలు ఉన్నాయి. కేంద్ర మంత్రి చిరాగ్ పాసవాన్ నేతృత్వంలోని లోక్ జనశక్తి పార్టీ (రాం విలాస్)కి మూడు మంత్రి పదవులు ఇవ్వనున్నట్లు సమాచారం.విజయం సాధించడంతో పెద్దఎత్తున వేడుకలు ఇదిలా ఉండగా బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి కనీవినీ ఎరుగని రీతిలో భారీ విజయం సాధించింది. ఏకంగా 200కుపైగా స్థానాలను కైవసం చేసుకుని డబుల్ సెంచరీ సాధించింది. మొత్తం 243 స్థానాలకు గానూ 202 స్థానాల్లో గెలిచింది. గెలుపు ప్రభంజనంతో డబుల్ ఇంజిన్ సర్కారు ఏర్పాటుకు మరోసారి సిద్ధమైంది. ఎన్?డీఏ కూటమి లోని బీజేపీ (89), జేడీయూ (85), ఎల్‌జేపీ (ఆర్‌వీ) (19), హెచ్‌ఏఎం(5), ఆర్‌ఎల్‌ఎం (4) సీట్లలో విజయం సాధించాయి. ఉపముఖ్యమంత్రులు సామ్రాట్ చౌధరీ, విజయ్ కుమార్ సిన్హాతో పాటు జానపద గాయనీ మైథిలీ ఠాకూర్, శ్రేయసి సింగ్, ప్రేమ్ కుమార్, బిజేంద్ర ప్రసాద్ యాదవ్ తదితర కీలక నేతలు గెలుపొందారు.మరోవైపు ఎన్?డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం వెల్లివిరిసింది. ఈ సందర్భంగా పెద్దఎత్తున వేడుకలు నిర్వహించారు. మిఠాయిలు పంచుతూ, బాణసంచా కాల్చుతూ సంబరాలు చేసుకున్నారు. దిల్లీలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విజయోత్సవ సభలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. బిహార్ ప్రజలు ఎన్‌డీఏకు అఖండ విజయం కట్టబెట్టారని తెలిపారు.

# ఢిల్లీ పేలుళ్ల తర్వాత ఆ 12 మంది వైద్యుల ఫోన్లు స్విచ్ఛాఫ్



**ఢిల్లీ :** ఎర్రకోట కారు బాంబు పేలుడులో మరో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. బాంబు పేలుడులో పాల్గొన్న వైట్‌కాలర్ టెర్రర్ మాడ్యూల్‌పై దర్యాప్తును ముమ్మరం చేశాయి. నుహ్ సహా ఫరీదాబాద్‌లో పలువురు వైద్యులను అరెస్టు చేశారు. ఢిల్లీ పేలుడు జరిగినప్పటి నుంచి 12 మందికిపైగా వైద్యుల ఫోన్లు స్విచ్ఛాఫ్ అయ్యాయని.. వారి ఆచూకీని తెలుసుకునేందుకు దర్యాప్తు సంస్థలు ప్రయత్నిస్తున్నాయని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఇందులో ఎక్కువ మంది అల్ ఫలాహ్ యూనివర్సిటీకి చెందిన వారేనని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. బాంబు పేలుడు కేసులో దర్యాప్తు సంస్థలు కీలక ఆధారాలను కనుగొన్నారు. అరెస్టయిన అనుమానిత డాక్టర్ ముజమ్మిల్ ఫోన్ కాల్ డిటైల్ రికార్డ్ భారీ వైట్‌కాలర్ టెర్రర్ మాడ్యూల్ నెట్‌వర్క్‌కు సంబంధించిన సమాచారం బయటపెట్టింది.దర్యాప్తును ప్రారంభించిన ఏజెన్సీలు.సంబంధిత వర్గాల సమాచారం ప్రకారం.. దర్యాప్తు సంస్థలు వైట్‌కాలర్ టెర్రర్ మాడ్యూల్కు సంబంధించి సుదీర్ఘ జాబితాను సిద్ధం చేశాయి. ఇందులో అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో చదివి అక్కడ పనిచేసిన పెద్ద సంఖ్యలో వైద్యులు ఉన్నారు. బాంబు పేలుడు జరిగినప్పటి నుంచి ఈ వైద్యులలో చాలా మంది ఫోన్లు స్విచ్ ఆఫ్ అయ్యాయి. జైష్‌తో సంబంధం ఉన్న డజనుకు మందికిపైగా వైద్యుల కోసం సెర్చ్ ఆపరేషన్ కొనసాగుతోందని సంబంధిత వర్గాలు చెబుతున్నాయి. డాక్టర్ షాహీన్ ఫోన్ నుంచి దర్యాప్తు సంస్థలు అనేక ఆధారాలను గుర్తించారు. అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం యాజమాన్యంలోని భూమిపై అధికారులు సమగ్ర దర్యాప్తు ప్రారంభించారు. ఈ కేసులో ఫరీదాబాద్ పోలీస్ సీఐఏ పత్రాలను పరిశీలించడానికి విశ్వవిద్యాలయ యజమానిని, ట్రస్ట్ కార్యాలయానికి వెళ్లింది.పాకిస్తాన్ హ్యాండ్లర్లతో.అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయ యజమాని జావేద్ అహ్మద్ సిద్ధిఖీ నివాసం ఉండగా.. చారిటబుల్ ట్రస్ట్ సైతం అక్కడే ఉంది. ఫిరోజ్‌పూర్ ఝిర్కాకు చెందిన డాక్టర్ మొహమ్మద్, నుహ్‌కు చెందిన డాక్టర్ రిహాన్, పున్హానాలోని సున్హేదా గ్రామానికి చెందిన డాక్టర్ ముస్తాకీమ్‌లను పోలీసులు ప్రశ్నించేందుకు అదుపులోకి తీసుకొని శనివారం రాత్రి ఆలస్యంగా అరెస్టు చేశారు. నివేదికల ప్రకారం, నవంబర్ 15న అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయంలో మహ్మద్ విధుల్లో చేరాల్సి ఉంది. కానీ, ఆ సమయానికి ముందే ఢిల్లీలో పేలుడు జరిగింది. అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయ వైద్యులు, సిబ్బంది విద్యార్థులను కశ్మీర్ బనేగా దారుల్ ఇస్లాం, షరియత్-బలిదానం నినాదాలతో బ్రెయిన్ వాష్ చేస్తున్నారు. ఈ నినాదాలు ఉగ్రవాద సంస్థ అన్సార్ ఘజ్వత్-ఉల్-హింద్‌కు చెందినవి. పాకిస్తాన్‌లో ఉంటున్న హ్యాండ్లర్లు ఢిల్లీకి సమీపంలో ఉన్న అల్ ఫలాహ్ విశ్వవిద్యాలయం నుంచి వచ్చిన ఈ దేశ రాజధానిని, చుట్టు పక్కల ప్రాంతాలను భయభ్రాంతులకు గురి చేయడానికి కుట్రపన్నారు.

# బిహార్‌లో కాంగ్రెస్ 'హస్త'వ్యస్తం- ఇండియా కూటమి ఉనికికి గండం




**బిహార్ :** బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో జాతీయ పార్టీ కాంగ్రెస్ ఘోర పరాభవాన్ని ఎదుర్కొంది. మిత్రపక్షం ఆర్‌జేడీతో గట్టి బేరసారాల తర్వాత 61 స్థానాల్లో అభ్యర్థులను నిలిపిన హస్తం పార్టీ 10 శాతంలోపే స్ట్రైక్ రేట్‌ను నమోదు చేసింది. ఈసారి 6 సీట్లకే కాంగ్రెస్ పరిమితమైంది. ఈ ఫలితం బిహార్‌తో పాటు జాతీయ స్థాయిలో విపక్ష 'ఇండియా' కూటమి ఉనికికి సవాల్ విసిరేలా ఉందని రాజకీయ పండితులు అంటున్నారు. కాంగ్రెస్ వరుస ఓటములను చూసి, ఇండియా కూటమిలోని మిత్రపక్షాలు పునరాలోచనలో పడుతున్నాయని చెబుతున్నారు. డీఎంకే, ఆర్‌జేడీ, వామపక్షాలు సహా పలు పార్టీలు ఒంటరిగా ముందుకుసాగే ఆలోచనలు మొదలుపెట్టాయని విశ్లేషిస్తున్నారు. ఒకవేళ ఈ దిశగా రాజకీయ సమీకరణాలు మారితే ఇండియా కూటమి ఉనికి ప్రశ్నార్థకంగా మారుతుందని పరిశీలకులు హెచ్చరిస్తున్నారు.ఆర్‌జేడీ ఇక మారిపోతుందాగత పదేళ్లలో బిహార్‌లో కాంగ్రెస్ పార్టీ బాగా బలహీనపడింది. 2015 ఎన్నికల్లో 27 సీట్లను సాధించిన కాంగ్రెస్, 2020 ఎన్నికల్లో 19 సీట్లకు పరిమితమైంది. ఈసారి మరీ దారుణంగా 6 సీట్లతో సరిపెట్టుకుంది. రాష్ట్రంలోని విపక్ష మహాగఠ్?బంధన్? (ఇండియా) కూటమిలో ఒక్క ఆర్‌జేడీ మాత్రమే అత్యధికంగా 25 సీట్లు గెలిచింది. దీంతో ఈసారి బిహార్ అసెంబ్లీలో విపక్ష కూటమి బలమైన వాణిని వినిపించే ఛాన్స్ లేకుండాపోయింది. రాష్ట్రంలో క్రమంగా బలహీనపడుతున్న కాంగ్రెస్‌కు, ఈసారి అయిష్టంగానే 61 సీట్లను ఆర్‌జేడీ ఇచ్చింది. వాటిలో కనీసం 25 శాతం సీట్లను కూడా హస్తం పార్టీ గెలవలేకపోయింది. ఇకపై రాజకీయ వ్యూహరచనలో ఈ అంశాన్ని ఆర్‌జేడీ తప్పకుండా పరిగణనలోకి తీసుకునే అవకాశాలు ఉంటాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. కాంగ్రెస్‌కు మరీ ఎక్కువ సీట్లను ఇచ్చేందుకు లాలూ పార్టీ ఇకపై సాహసించకపోవచ్చని అభిప్రాయపడుతున్నారు.తమిళనాడు సీఎం స్టాలిన్ ప్రధాని మోదీఈసారి బిహార్ ఎన్నికల తొలి విడత పోలింగ్ తేదీ(నవంబరు 6)కి వారం ముందు రాష్ట్రంలో ఛట్ పూజలు జరిగాయి. ఈ పూజల్లో పాల్గొనేందుకు దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి బిహారీ వలస కార్మికులు స్వరాష్ట్రానికి చేరుకున్నారు. సరిగ్గా ఇదే సమయంలో ఎన్నికల ప్రచారంలో ఇండియా కూటమి లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ కీలక విమర్శలు చేశారు. తమిళనాడులోని బిహారీ వలస కార్మికులను డీఎంకే పార్టీ నాయకులు వేధిస్తున్నారని విమర్శించారు. డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం స్టాలిన్‌తో కలిసి ఆర్‌జేడీ అగ్ర నేతలు ఎన్నికల ప్రచారం చేయడాన్ని ప్రధాని మోదీ తప్పుపట్టారు. అయితే ఈ వ్యాఖ్యలకు తమిళనాడు సీఎం స్టాలిన్ బలంగా కౌంటర్ ఇచ్చారు. తమిళనాడు పర్యటనకు వచ్చినప్పుడు ఇలాంటి ద్వేషపూరిత వ్యాఖ్యనే మోదీ చేయగలరా అని ఆయన ప్రశ్నను సంధించారు. బిహారీలకు వ్యతిరేకంగా ఒక్కమాటను కూడా స్టాలిన్ మాట్లాడలేదు. తమిళంలో బోర్డు టాపర్‌గా నిలిచిన బిహారీ వలస కార్మికుడి కుమార్తె ఇంటర్వ్యూను డీఎంకే అనుకూల మీడియా సంస్థ ఒకటి ఆ వెంటనే ప్రచురించింది. బిహారీలను స్వాగతించే రాష్ట్రంగా తమిళనాడును ఆ కథనంలో కొనియాడారు.

# మళ్లీ ఎన్‌కౌంటర్ మావోయిస్టులు మృతి



**రాయ్‌పూర్, నవంబర్ 16:** ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లాలో ఆదివారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందారు. వారిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు ఉన్నారని బస్తర్ రేంజ్ ఐజీ సుందర్ రాజ్ వెల్లడించారు. తుమ్మలపాడ ప్రాంతంలో మావోయిస్టులు ఉన్నారంటూ నిఘా వర్గాల నుంచి సమాచారం అందిందన్నారు. దాంతో స్థానిక పోలీసులతోపాటు భద్రతా బలగాలు.. ఆ ప్రాంతానికి చేరుకుని కూంబింగ్ చేపట్టాయని వివరించారు. ఈ విషయాన్ని మావోయిస్టులు గమనించి.. కూంబింగ్ నిర్వహిస్తున్న వీరిపై కాల్పులకు తెగబడ్డారన్నారు. దాంతో భద్రతా బలగాలతోపాటు పోలీసులు ఎదురు కాల్పులకు దిగారని.. దీంతో ఇరు వైపులా హోరాహోరీగా కాల్పులు జరిగాయని వివరించారు.అనంతరం మావోయిస్టుల వైపు నుంచి కాల్పులు ఆగిపోయాని తెలిపారు. దాంతో ఆ ప్రాంతంలో ముగ్గురు మావోయిస్టుల మృతదేహాలను స్వాధీనం చేసుకున్నామని వివరించారు. అలాగే భారీగా ఆయుధాలను సైతం అక్కడి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. మరోవైపు ఈ ఎన్‌కౌంటర్ నేపథ్యంలో పలువురు మావోయిస్టులు అక్కడి నుంచి పారిపోయి ఉండ వచ్చని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో భద్రతా బలగాలు ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయని పేర్కొన్నారు. ఇక మృతి చెందిన మావోయిస్టులపై రూ. 15 లక్షల రివార్డు ఉందని తెలిపారు.2026, మార్చి 30వ తేదీ నాటికి దేశంలో మావోయిస్టులను నిర్మూలించాలని కేంద్రం లక్ష్యంగా పెట్టుకుంది. అందులో భాగంగా కేంద్రం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఆ క్రమంలో ఛత్తీస్‌గఢ్‌లో వరుసగా ఎన్‌కౌంటర్లు చోటు చేసుకుంటున్నాయి. దీంతో భారీగా మావోయిస్టులు మృతి చెందారు. అలాగే పలువురు మావోయిస్టులు ఇప్పటికే ప్రభుత్వం ఎదుట లొంగిపోయారు. ఆ జాబితాలో అగ్రనేతలు మల్లోజుల వేణుగోపాలు, కిషన్ జీ భార్య తదితరులు మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవీస్ ఎదుట లొంగిపోయి.. ప్రభుత్వానికి ఆయుధాలు అందజేశారు.

# ఢిల్లీ బాంబ్ బ్లాస్ట్ సంఘటనా స్థలంలో దొరికిన 3 కాట్రిడ్జ్‌లు



**ఢిల్లీ :** ఎర్రకోట దగ్గర కారు బాంబ్ బ్లాస్ట్ చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. సంఘటనా స్థలం దగ్గర తాజాగా మూడు 9 ఎమ్ఎమ్ కాట్రిడ్జ్‌లు దొరికాయి. వాటిలో రెండు లైవ్ కాట్రిడ్జ్‌లు కాగా.. మరొకటి ఖాళీ షెల్. బాంబు పేలిన చోటులోకి ఈ మూడు కాట్రిడ్జ్‌లు ఎలా వచ్చాయనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దేశ రాజధాని ఢిల్లీలోని ఎర్రకోట దగ్గర చోటుచేసుకున్న బాంబ్ బ్లాస్ట్ కేసు దర్యాప్తును అధికారులు వేగవంతం చేశారు. ఈ మేరకు కారు పేలుడు కేసులో రెండు ఎఫ్ఐఆర్‌లను నమోదు చేశారు. యూనివర్శిటీ, ఉగ్రవాదులకు నిధులపై ఆరా తీస్తున్నారు. పేలుడు సంభవించిన ప్రదేశంలో అధికారులకు మూడు 9 ఎమ్ఎమ్ కాట్రిడ్జ్‌లు దొరికాయి. వాటిలో రెండు లైవ్ కాట్రిడ్జ్‌లు కాగా.. మరొకటి ఖాళీ షెల్. బాంబు పేలిన చోటులోకి ఈ మూడు కాట్రిడ్జ్‌లు ఎలా వచ్చాయనే దానిపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.కేసును తప్పుదోవ పట్టించాలన్న ఉద్దేశ్యంతో ఆ మూడు కాట్రిడ్జ్‌లను అక్కడ పడేసి పోయారా? అన్న కోణంలో కూడా దర్యాప్తు చేస్తున్నారు. జైషే మహ్మద్ మాడ్యూల్‌పై కూడా ఆరా తీస్తున్నారు. ఎర్రకోట దగ్గర ఐ20 కారుతో ఆత్మాహుతి దాడికి పాల్పడ్డ ఉమర్ అక్రమ మార్గాల ద్వారా 20 లక్షల రూపాయలు అందుకున్నట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. హవాలా డీలర్లను అధికారులు అదుపులోకి తీసుకున్నారు. హవాలా మార్గాలపై కూడా అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఆత్మాహుతి దాడికి పాల్పడ్డ ఉమర్ గ్రూపు సభ్యులు 32 కార్లతో బాంబ్ బ్లాస్ట్‌లకు ప్లాన్ చేసినట్లు తెలుస్తోంది.ఇందుకోసం నాలుగు కార్లను సేకరించారు. ఐ20తో ఉమర్ ఎర్రకోట దగ్గర బాంబ్ బ్లాస్ట్ చేశాడు. ఆరుగుని అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వారిని విచారిస్తున్నారు. వీరిలో ఫరీదాబాద్‌కు చెందిన కారు డీలర్ కూడా ఉన్నాడు. బాంబ్ బ్లాస్ట్ జరిగిన ఐ20 వైట్ కారును అమ్మింది అతడే. బాంబు దాడి జరగడానికి 13 రోజుల ముందే అతడు నిందితుడికి కారు అమ్మాడు. ఇక ఇదే కేసులో ఉమర్ బంధువైన డాక్టర్ మహమ్మద్ ఆరిఫ్ అనే వ్యక్తిని దర్యాప్తు బృందాలు కాన్పూర్‌లో అదుపులోకి తీసుకున్నాయి. డాక్టర్ మహమ్మద్ ఆరిఫ్ డాక్టర్ షాహినాతో నిత్యం టచ్‌లో ఉన్నట్లు దర్యాప్తులో తేలింది.

# బీహార్ ఎన్నికల్లో రూ.14,000 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులు వినియోగించారు




**పాట్నా:** బీహార్ అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపు కోసం రూ.14,000 కోట్ల ప్రపంచ బ్యాంకు నిధులను సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వం వినియోగించిందని ప్రశాంత్ కిషోర్‌కు చెందిన జన్ సురాజ్ పార్టీ ఆరోపించింది. ఎన్నికలకు ముందు ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన కింద 1.25 కోట్ల మహిళలకు రూ.10,000 చొప్పున నగదు బదిలీ చేయడానికి ఈ నిధులు దారి మళ్లించినట్లు విమర్శించింది. తద్వారా ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికలను ప్రభావితం చేసినట్లు ఆరోపించింది.కాగా, జన్ సూరాజ్ పార్టీ జాతీయ అధ్యక్షుడు ఉదయ్ సింగ్ శనివారం మీడియా సమావేశంలో మాట్లాడారు. అభివృద్ధి ప్రాజెక్టుల కోసం ప్రపంచ బ్యాంకు కేటాయించిన నిధుల్లో రూ.14,000 కోట్లను బీహార్ అసెంబ్లీ ఎన్నికల కోసం ప్రభుత్వం వాడేసిందని ఆరోపించారు. 'ఈ ఎన్నికల ఫలితం సమర్థవంతంగా కొనుగోలు ద్వారా లభించింది. జూన్ 21 నుంచి పోలింగ్ రోజు వరకు గెలుపు కోసం సుమారు రూ. 40,000 కోట్లు ఖర్చు చేశారు. ప్రజాధనంతో ప్రజల ఓట్లను కొనుగోలు చేశారు. ప్రపంచ బ్యాంకు నుంచి వచ్చిన నిధులను మహిళలకు నగదు బదిలీల కోసం ఉపయోగించినట్లు నాకు తెలిసింది' అని ఆయన అన్నారు.అయితే ఇంత పెద్ద మొత్తంలో డబ్బును తిరిగి పొందే సామర్థ్యం బీహార్ ఆర్థిక వ్యవస్థకు లేదని ఉదయ్ సింగ్ ఆరోపించారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజా సంక్షేమం కోసం ఖర్చు చేయడానికి ఇప్పుడు చాలా తక్కువ నిధులు మిగిలి ఉన్నాయని విమర్శించారు.

## గ్రామ ప్రజలను అన్ని విధాలుగా ఆదుకుంటా

**- భూక్య రామ్ కుమార్**



**గార్ల: నవంబర్ 16,** గార్ల మండలం అంజనాపురం గ్రామంలో శ్రీ ఆంజనేయ స్వామి భక్తులు ఆంజనేయ స్వామి మలధారణ చేసిన స్వాములకు బిక్ష (అన్నదాన)నిమిత్తము వారికి సరిపడా బియ్యము, కూరగాయలు, సరుకులు స్వామివారికి తనవంతు సహాయంగా భూక్య రాంకుమార్ ఇవ్వనన్నారు. దానితో పాటుగా గుడి గుట్ట మీద రాత్రిపూట భక్తులకు ఇబ్బంది కలగకుండా స్తంభాలపై విద్యుత్ దీపాలను సహకరించమని కోరగా స్వామి వారి కోరికల మేరకు విద్యుత్ దీపాలు అందజేయనున్నట్లు ఒక ప్రకటన లో తెలిపారు.

## ఆకర్షణీయమైన ప్రకటనలతో సైబర్ మోసాలు: పోలీస్ కమిషనర్

**ఖమ్మం నవంబర్ 16,**

సైబర్ మోసగాళ్లు నకిలీ ఆన్లైన్ ట్రేడింగ్ యాప్లు, వెబ్ సైట్లు రూపొందించి, తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు వస్తాయని చెబుతూ పెట్టుబడిదారులను ఆకర్షించి మోసం చేస్తున్న నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ తెలిపారు. కొత్త కంపెనీ లేదా ప్రసిద్ధ సంస్థ పేరు మీద ఐపీఓ వస్తుందంటూ తక్కువ ధరలో షేర్లు అందుబాటులో ఉన్నాయని, త్వరగా షేర్లు తీసుకుంటే ఎక్కువ లాభం వస్తుంది. అంటూ వాట్సాప్. టెలిగ్రామ్, ఫేస్బుక్, ఇమెయిల్ ద్వారా లింక్ పంపుతూ.. మోసపూరిత వాగ్దానాలతో చేసి డబ్బు బదిలీ చేయించుకుని మోసం చేశారని పలు ఫిర్యాదులు వస్తున్నాయని పోలీస్ కమిషనర్ పేర్కొన్నారు.మోసం జరిగే విధానంమోసగాళు

- పెద్ద కంపెనీ ఐపీ ఓ వచ్చిందని నమ్మదగిన ప్రకటనలు, నకిలీ వెబ్ సైట్ లు సృష్టిస్తారు. ఆ లింక్ లేదా ఫారమ్ ద్వారా బ్యాంక్ అకౌంట్ వివరాలు, ఆధార్, పాన్ లేదా యూపీఐ ద్వారా చెల్లింపు లు చేయమని చెబుతారు. డబ్బు బదిలీ చేసిన తర్వాత మోసగాళు
- వెబ్ సైట్ మూసేసి మాయం అవుతారు.కొన్నిసార్లు నకిలీ షేర్ సర్టిఫికేట్లు లేదా రసీదులు కూడా పంపి మోసం చేస్తారు.జాగ్రత్త



సూచనలుఐపీఓ పెట్టుబడి పెట్టే ముందు సెబీ లేదా ఎన్ఎస్ఈ/ బిఎస్ఇ అధికారిక వెబ్ సైట్లో లో ఆ కంపెనీ నిజంగా ఐపీఓ నమోదు అయిందో లేదో ధృవీకరించుకో వాలి.సోషల్ మీడియా లేదా వ్యక్తిగత మెసేజ్ ల ద్వారా వచ్చిన ఐపీ ఓ ఆఫర్లను నమ్మవద్దు.ఎవరైనా ముందుగా "అడ్వాన్స్ పేమెంట్" లేదా "రిజిస్ట్రేషన్ ఫీజు" అడిగితే డబ్బు పంపవద్దు. నకిలీ ట్రేడింగ్ ప్లాట్ ఫామ్ మోసంతక్కువ పెట్టుబడితో లాభాలు వస్తాయని సోషల్ మీడియా, యూట్యూబ్ వీడియోలు, వాట్సాప్ గ్రూపులు లేదా టెలిగ్రామ్ ఛానెల్ ల ద్వారా "రోజుకు వేలల్లో లాభం, 100% రిటర్న్ అంటూ ప్రకట నలు చేస్తారు.మొదట యాప్ లేదా వెబ్ సైట్లో రిజిస్టర్ చేయమని చెబుతారు.చిన్న మొత్తంలో పెట్టుబడి పెట్టగానే కొంత లాభం చూపించి నమ్మకం కలిగిస్తారు. ఆ తరువాత పెద్ద పెట్టుబడి పెట్టమని ప్రోత్సహిస్తారు.విత్ డ్రా చేయాలంటే ట్యాక్స్ సర్వీస్ చార్జ్ పేరుతో డబ్బు అడుగుతారు.చివరికి వెబ్ సైట్ లేదా యాప్ యాక్సెస్ నిలిపివేసి, డబ్బుతో మాయమవుతారు.ట్రేడింగ్ యాప్ లేదా వెబ్ సైట్ సెబీ లేదా ఆర్బిఐ వద్ద రిజిస్టర్ అయిందా అని తప్పనిసరిగా చెక్ చేయండి."గ్యారంటీడ్ రిటర్న్స్", "డబుల్ మనీ" అని చెప్పేవారిని నమ్మకండి.సోషల్ మీడియా ద్వారా వచ్చే నకిలీ యాప్ లు లేదా వెబ్ సైట్ లను ఉపయోగించకం డి.ఎవరైనా వీడియో కాల్, వాట్సాప్ లేదా మెసేజ్ ద్వారా పెట్టుబడి పెట్టమని ఒత్తిడి చేస్తే వెంటనే కాల్ కట్ చేసి ఫిర్యాదు చేయండి.

## తల్లితండ్రుల షష్టిపూర్తి సందర్భంగా దేవాలయం కోసం ఐదు లక్షల విరాళం అందించిన కుమారులు కౌశిక్, కుశాల్



**కోటపల్లి : నవంబర్ 16**

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండల కేంద్రానికి చెందిన ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మాజీ ఎమ్మెల్సీ శ్రీ పురాణం సతీష్ కుమార్ కుమారులు తల్లితండ్రుల షష్టిపూర్తి కార్యక్రమం చేయాలని తమ నిర్ణయాన్ని తల్లితండ్రులకు తెలపగా కార్యక్రమం బదులుగా కార్యక్రమం కోసం అయ్యే ఖర్చు డబ్బులను దేవాలయం కోసం అందజేయాలని సూచించడంతో ఈరోజు వారి ఇంట్లో హెూమం నిర్వహించి గ్రామ పెద్దల సమక్షంలో, ఆలయ కమిటీ సభ్యులకు ఐదు లక్షల రూపాయలు చెక్ (5,00,000/-) అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పురాణం సునంద- సతీష్ కుమార్ దంపతులతో పాటు వారి కుమారులు కౌశిక్, కుశాల్లి కుటుంబ సభ్యులు దేవాలయ కమిటీ సభ్యులు మంత్రి రామయ్య, కొట్టే నారాయణ, రాగం స్వామి, బైసా ప్రభాకర్, పురాణం సునీల్ కుమార్, నేరాళ్ల రామన్న, కాశెట్టి తిరుపతి, చిన్న రామయ్య, రాళ్లబండి శ్రీనివాస్, కొమరెల్లి విజయ్, ముత్యాల రాజేశ్వర్ గౌడ్, సుందిల్ల వెంకటి గ్రామ పెద్దలు, ప్రజలు, యువకులు పాల్గొన్నారు.

## తెలంగాణ రాజ్యాధికార పార్టీ తీర్థం పుచ్చుకున్న

**- తాండూరు మండల యువత**

**- యువతతోనే సేవాభావంతో కూడిన నిజమైన ప్రజా రాజకీయాలు నిర్వహించబడతాయి**

**- తెలంగాణ రాజ్యాధికార పార్టీ జిల్లా అధ్యక్షుడు మహేష్ వర్మ**

**బెల్లంపల్లి : నవంబర్ 16,**

బెల్లంపల్లి నియోజకవర్గం, తాండూరు మండలం యువకులు పెద్ద ఎత్తున తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరారు. మండల నాయకులు వాసాల అనిల్ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా అధ్యక్షులు మహేష్ వర్మ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ సిద్ధాంతాలు, తీన్మార్ మల్లన్న పోరాట స్ఫూర్తికి ఆకర్షితులై, బీసీ రాజ్యాధికారమే లక్ష్యంగా ముందుకు సాగాలని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఆత్మాభిమానం కొరకై ఏర్పడిన పార్టీలో కలిసి పనిచేయాలని నిర్ణయించుకుని పెద్దఎత్తున యువత తెలంగాణ రాజ్యాధికార పార్టీ లో చేరారని మహేష్ వర్మ అన్నారు. ఈ సందర్భంగా



మహేష్ వర్మ మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలని ఆశించిన మొదటి వ్యక్తి తీన్మార్ మల్లన్న అని అన్నారు. యువతరంతోనే నూతన రాజకీయాలకు, ప్రజా రాజకీయాలు, న్యాయమైన, చట్టబద్ధమైన రాజకీయాలు సేవా భావంతో నిర్వహించబడతాయని అన్నారు. మేధావులు, విద్యావంతులు మిమ్మల్ని స్ఫూర్తిగా తీసుకుని స్వచ్ఛందంగా పార్టీలో చేరాలని పిలుపునిచ్చారు. కలిసికట్టుగా ఉంటేనే మన రాజ్యాధికారం మనకు దక్కుతుందని, ఎవరెంతో వారికంత ప్రాధాన్యత ఉంటుందని అన్నారు. వచ్చేది బీసీల రాజ్యమే అని, పరాయి పార్టీ జెండాలను పక్కనబెట్టి, తెలంగాణ రాజ్యాధికార పార్టీలో చేరి కలిసికట్టుగా ముందుకు సాగాలని కోరారు. ప్రజల పక్షాన కొట్లాడే, పోరాడే నాయకులకు, యువతకు తెలంగాణ రాజ్యాధికార పార్టీ స్వాగతం పలుకుతుంది స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా సోషల్ మీడియా కన్వీనర్ లతీఫ్, జిల్లా నాయకులు పడాల శివతేజ, ఇప్ప కిషోర్, మండల నాయకులు చంద్రశేఖర్, స్వామి, ప్రశాంత్ పాల్గొన్నారు.

## అయ్యప్ప స్వాములకు అన్న ప్రసాదం వితరణ

**- అన్న ప్రసాదం వితరణ దాత చెవ్వగోని వెంకటేష్**

**- మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి చేతుల మీదుగా అన్న ప్రసాదం వితరణ**







**చౌటుప్పల్: నవంబర్ 16,**

చౌటుప్పల్ పట్టణ కేంద్రంలోని శ్రీ సత్యదేవ సహిత అయ్యప్ప స్వామి దేవాలయంలో తేదీ2025 నవంబర్ 16 నుండి 12026 జనవరి 11 వరకు అయ్యప్ప దీక్షపరులకు నిత్య అన్న ప్రసాద వితరణ కార్యక్రమం దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో దాతలు సహకారంతో నిర్వహిస్తునా సందర్భంగా శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయంలో అయ్యప్ప భక్తులకు అన్న ప్రసాద వితరణ దాత చెవ్వగోని వెంకటేష్ కుమార్తె భవ్య పుట్టినరోజు సందర్భంగా అన్న ప్రసాదం వితరణ దాతగా ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి విచ్చేసి అయ్యప్ప స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి అన్న ప్రసాద నైవేద్యాన్ని దేవుడికి సమర్పించి అయ్యప్ప దీక్షపరులకు వారి చేతుల మీదుగా అన్న ప్రసాదం వితరణ కార్యక్రమం ప్రారంభించారు.ఈ కార్యక్రమ ంలో మాజీ మున్సిపల్ చైర్మన్ వెన్ రెడ్డి రాజు, మునుగోడు కాంగ్రెస్ పార్టీ ఎన్నికలు ఇంచార్జ్ పబ్బు రాజు గౌడ్, బొబ్బిళ్ళ మురళి గురుస్వామి వ్యవస్థాపక అధ్యక్షులు, దేవాలయ కమిటీ అధ్యక్షులు కామిశెట్టి భాస్కర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆకుల ఇంద్రసేనారెడ్డి, బోయ దేవేందర్, సుర్వి నరసింహ గౌడ్, బత్తుల విప్లవ్ కుమార్ గౌడ్ , మోగుదాల రమేష్ గౌడ్, కంచరకుంట్ల వెంకటరెడ్డి , చింతల సాయిలు, తిరుపతి రవీందర్, సత్యనారాయణ చెనగోని అంజయ్య, బత్తుల శ్రీశైలం, సోమవరపు సత్తయ్య, కామిశెట్టి చంద్రశేఖర్, గుజ్జుల రవీందర్ ,బోడిగే బాలకృష్ణ , వెంకటేశం, శంకర్, సుదర్శన్, సుధీర్, వెంకటరమణ, దేవాలయ అర్చకులు ఓంకార్ శాస్త్రి , అయ్యప్ప దీక్షాపరులు పాల్గొన్నారు.

## సాలూరు లో ఘనంగా సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతములు

**సాలూరు ప్రతినిధి** సాలూరు టౌన్ శ్రీనివాస్ నగర్ లో కొలువైన శ్రీ భూ నీళా సమేత కళ్యాణ వెంకటేశ్వర స్వామి దివ్య క్షేత్రంలో నవంబర్ 15వ తేదీ శనివారం బహుళ ఏకాదశి పుణ్య కాలంలో శ్రీవారి దివ్య క్షేత్రంలో శ్రీ నిలయం కళ్యాణ మండపము లో సామూహిక శ్రీ రమా సమేత సత్యనారాయణ స్వామి వ్రతములు జరిగాయి.140 మంది దంపతులు పాల్గొన్నట్లు వ్యవస్థాపక ధర్మకర్త వంగపండు రాజేంద్ర ప్రసాద్,టెక్కలి ధర్మారావు తెలిపారు.

## సాలూరు లో కనుల వైభవం గా కోటి దీపోత్సవం

**పార్వతీపురం మన్యం జిల్లా.**



కార్తీక బహుళ ఏకాదశి సందర్భంగా నవంబర్ 15 న 108 మంది దంపతులతో నగరేశ్వర స్వామికి ప్రత్యేక కైంకర్యములు నిర్వహించారు. కోటి దీపోత్సవం కార్యక్రమం సాలూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో వేడుకగా నిర్వహించారు. కార్తీక మాసం మహా పుణ్యకాలంలో కోటి దీపోత్సవం తదుపరి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాలూరు వాసవి మహిళా సమాజం సభ్యులు ఆర్యవైశ్య సంఘ సభ్యులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రభుత్వ వసతి గృహాల్లో వాటర్ హీటర్లు ఏర్పాటు చేసి దుప్పట్లు పంపిణీ చేయాలి

**- ప్రభుత్వ జూనియర్ కళాశాల జనరల్ సెక్రెటరీ కీర్తన్**

**సిర్పూర్(టి) నవంబర్ 17,**

ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కొమురం భీమ్ స్టడీ సెంటర్ హాల్ లో ప్రోగ్రెసివ్ స్టూడెంట్స్ యూని యన్ (పి.ఎస్.యూ) ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై చర్చ కార్యక్రమం నిర్వహించారు.ప్రభుత్వ జూనియర్ కళాశాల కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కోట ఆనంద్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ.. చలికాలం దృష్ట్యా అధికారులు తక్షణమే విద్యార్థులకు దుప్పట్లు పంపిణీ చేసి,సోలార్ వాటర్ హీటర్ల ఏర్పాటు చేయాల ని,పాడైన కిటికీలు తలుపుల మరమ్మతులు చేయాలని డిమాండ్ చేశారు.జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాల సమస్యలకు నిలయాలు గా మారాయని అన్నారు. తక్షణమే ప్రభుత్వ అధికారులు స్పందించి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు.అనంతరం విద్యార్థు ల సమస్యలపై పోరాడడం కోసం ఆసిఫాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాల నూతన కమిటీని ఎన్ను కున్నారు.కళాశాల అధ్యక్షులు మడె మహేష్, ప్రధాన కార్యదర్శిగాయల్. కీర్తన్ ఉపాధ్యక్షులుగా తొడసం రవి, బి.సాయి చరణ్ సహాయ కార్యదర్శులు: పి.దీపక్, నితిన్ కోశాధికారులుగా అంజి, రత్నాకర్, సభ్యులుగా కర్పెత శివకుమార్,శేఖర్, పవన్ లను ఎన్నుకున్నారు.



# సిపిఐ బస్సు జాతా ను జయప్రదం చేయాలి

**-సిపిఐ పార్టీ నాయకులు చెక్క వెంకటేష్.**

**యాదాద్రి భువనగిరి, నవంబర్, 16** :భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ)సమావేశం యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు మండలం కొలనుపాక గ్రామంలో శుక్రవారం శాఖ సమావేశం కార్యదర్శి పొన్నబోయిన రవి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి సిపిఐపార్టీ యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు చెక్క వెంకటేష్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ 22-11-2025 న భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుంటున్న సందర్భంగా డిసెంబర్ 26 నాడు చలో ఖమ్మంలో జరిగే బహిరంగ సభకు జయప్రదం చేయాలని తెలంగాణ రాష్ట్రంలో బస్సు జాతలు, మూడు జాతలు తిరుగుతున్నాయని, డిసెంబర్ 20వ తారీకు నాడు యాదాద్రి భువనగిరి జిల్లా కు హైదరాబాదు నుండి జాత రావడం జరుగుతుంది (20, 21,22, మావూరి తెలంగాణ యాదాద్రి భువనగిరి జిల్లాలో తిరుగుతూ మధ్యాహ్నం ఒంటిగంటకు ఆలేరు, కొలనుపాకకు రావడం జరుగుతుందని అన్నారు. ఈ జాతకు స్వాగతం పలకాలని ఆలేరు మండల కమిటీ గ్రామాలు పెద్ద ఎత్తున జాతకు స్వాగతం పలకాలని సమావేశంలో తీర్మానించడం జరిగింది. ఈ



సమావేశానికి హాజరైన సభ్యులు సిపిఐ పార్టీ ఆలేరు మండల కార్యదర్శి చౌడబోయిన కనకయ్య, తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యుడు చౌడబోయిన పరశురాములు, తెలంగాణ ప్రజానాట్యమండలి జిల్లా ఉపాధ్యక్షులు పోతు ప్రవీణ్, ఏఐటిసి మండల నాయకులు గిరబోయిన స్వామి అఖిలభారత యువజన సమాఖ్య మండల నాయకులు బర్ల ప్రశాంత్ కాటబోయిన కళ్యాణ్ గ్యార భుక్షపతి చిరంజీవి మహేందర్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ధర్మపురిలో.. జాతీయ పత్రికా దినోత్సవ “వేడుకలు”

**- ప్రజాస్వామ్య విలువలను కాపాడే వే పత్రికలు**
**- టీయూడబ్ల్యూజె(ఐజేయు) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.సురేందర్**



**ధర్మపురి, నవంబర్ 16, :** ప్రజాస్వామ్య విలువలను కాపాడే వే పత్రికలని టియు డబ్ల్యూజె(ఐజెయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.సురేం దర్ అన్నారు. ఆదివారం పట్టణంలో స్థానిక ఫంక్షన్ హాల్ లో ధర్మపురి ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు మధు.మహాదేవ్ శర్మ ఆధ్వ ర్యంలో జాతీయ పత్రికా దినోత్సవ వేడు కలు నిర్వహించగా ముఖ్యఅతిధు లుగా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు జె.సురేందర్, రాష్ట్ర కౌన్సిలర్ మెంబర్ నక్క.లక్ష్మణ్ యాదవ్, జిల్లా మహిళా కార్యవర్గ సభ్యురాలు బత్తిని.పవిత్ర, సీనియర్ పాత్రికేయులు పాత శ్రీనివాస్, చిలువే రి.రాజేందర్,సాగర్ లు ముఖ్యఅతిధు లుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా జె.సురేందర్ మాట్లాడుతూ ప్రెస్ క్లబ్ సభ్యులందరికీ జాతీయ పత్రిక దినోత్స వ శుభాకాంక్షలు తెలిపారు. జర్నలిజం లో ప్రత్యేక వార్తలు, పాత్రల గురించి రాసేటప్పుడు వివరంగా ఖచ్చితంగా, నిష్పక్షపాతంగా రాయాలని తెలిపారు. ఈ జాతీయ పత్రిక దినోత్సవాన్ని 1956 లో తొలి ప్రెస్ కమిషన్ సిఫార్స్ మేరకు 1966లో నవంబర్ 16న ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాను ఏర్పాటు చేయడం జరిగిందని, అప్పటినుండి నవంబర్16 న జాతీయ పత్రికా దినోత్సవం జరుపు కోవడం జరుగుతుం దని తెలిపారు. ఈ జాతీయ కౌన్సిల్ లో ఒక చైర్మన్,28 మంది సభ్యులు ఉంటారన్నా రు.చైర్మన్ గా సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి,20మంది మీడియా సభ్యులు ఉంటార ని,5గురు లోక్ సభ,రాజ్యసభ సభ్యు లు,మరో ముగ్గరు సాహిత్య అకాడమీ, యూనివ ర్సిటీ గ్రాంట్ అకాడమీ, బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నామినీలుగా ఉంటారని తెలిపారు.ప్రెస్



నుండి వచ్చి న వ్యతిరేక ఫిర్యాదులను ప్రెస్ కౌన్సిల్ పరిగణలోకి తీసుకుం టుందని, కౌన్సిల్ నిర్ణయాన్ని ఏ కోర్టు సవాల్ చేయలేదని, ఈ కౌన్సిల్ కు తన విధుల్లో పూర్తి స్వేచ్ఛ ఉంటుందని తెలిపారు. ప్రస్తుతం ప్రెస్ కౌన్సిల్ ఛైర్మన్ గా ఎవరు కొనసాగడం లేదని తెలిపారు. అనంతరం ముఖ్య అతిధులకు శాల్వతో సన్మానించి మొ మెంటో అందజేశారు. ఈ కార్యక్రమంలో కస్తూరి.ప్రవీణ్, ముప్పట్ల. రాజేందర్, కర్నె.సంతోష్, క్యాడాస్. స్వామి, గడిపెల్లి. వెంకన్న, కొండ. వినయ్, బాకీ. చందు, ముత్తినేని. శ్రీనివాస్, మైదం. తిరుపతి,సతీష్,నరేష్,బత్తిని.సంపత్ పాల్గొన్నారు.

# రాముని గుండాల కొండపై సామూహిక సత్యనారాయణ వ్రతాలు



**(గోదావరిఖని) నవంబర్ 16** లోక కళ్యాణార్థం రాముని గుండాల కొండపై ఈనెల 19న ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న సామూహిక సత్యనారాయణ వ్రతాల్లో ప్రజలంతా పాల్గొని దేవుడి కృపను పొందండనీ బ్రాహ్మణ సంఘం అధ్యక్షులు ఒజ్జల వెంకటేశ్వర్లు కోరారు ఈ మేరకు ఆయన ఏ బి సి రెడ్డి, లారీ అసోసియేషన్ అద్యక్షులు శ్రీనివాస్ రెడ్డి తో కలిసి పవర్ హౌజ్ కాలనీ లోని కాశీ విశ్వేశ్వర ఆలయ ప్రాంగణంలో వారు మాట్లాడుతూ... పవిత్ర కార్తీక మాసం. సందర్భంగా రామగుండం కొండపై నిర్మాణం అవుతున్న ధనుర్బాన రామాంజనేయ స్వామి ఆలయ ట్రస్ట్ చైర్మన్ మనాలి ఠాకూర్, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్ ఆధ్వర్యంలో బుదవారం ఉదయం 10 గంటలకు ఆ కొండపై సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలను నిర్వహించడానికి నిచ్చయించడం జరిగిందని తెలిపారు. వ్రతం అనంతరం కొండపైనే కార్తిక భోజనాలను కూడా ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతంలో కూర్చోదలచిన జంటలు ఈనెల 18వ తేదీ సాయంత్రంలోపు సమాచారం ఇవ్వాలని కోరారు. వ్రతానికి అవసరమైన పూజా సామాగ్రినీ కూడా ట్రస్ట్ వారే అందించడం జరుగుతుందని వెల్లడించారు. వ్రతంలో కూర్చులో వారు సాంప్రదాయ దుస్తులను దరించి రావాలని సూచించారు.

# నూతన గృహప్రవేశానికి హాజరైన..


**- టీయూడబ్ల్యూజే(ఐజేయు)రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధుగౌడ్**



**పెబ్బేరు, నవంబర్ 16, :**పెబ్బేరు పట్టణానికి చెందిన గోపాలకృష్ణ జర్నలిస్టు ఆది వారం నూతన గృహప్రవేశం చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టియూ డబ్ల్యుజే (ఐజేయు) రాష్ట్ర కార్యదర్శి గుండ్రాతి మధు గౌడ్ హాజరయ్యారు. అలాగే శ్రీరంగాపురం మండల రిపోర్టర్ వెంకటేష్ గౌడ్ కు కాలికి గాయమై ఆపరేషన్ చేయించు కున్నారు. ఆయనకు కూడా పరామర్శించి ధైర్యం కల్పించారు. ఆయనతో పాటు సీనియర్ జర్నలిస్టు మలాల, బాలస్వామి, రవికాంత్ పెబ్బేరు శ్రీరంగాపురం మండలాల జర్నలిస్టులు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు, ఇందిరమ్మ ఇళ్ల పట్టాలను పంపిణీ చేసిన ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య


**-కార్యక్రమానికి హాజరైన లబ్ధిదారులు.**



**యాదాద్రి భువనగిరి, నవంబర్, 16** యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు నియోజకవర్గంలోని యాదగిరిగుట్టలో లబ్ధిదారులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. శనివారం యాదగిరిగుట్ట పట్టణంలోని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే కార్యాలయంలో 113 ఇందిరమ్మ ఇళ్ల పట్టాలు, 216 సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలేరు నియోజకవర్గంలోని ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, సి ఎం రిలీఫ్ ఫండ్, ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులు, తదితరులు పాల్గొన్నారు.

# నెల రోజుల పాటు మీ జుట్టుకు నూనె రాయకపోతే ఏమవుతుందో తెలుసా? అసలు సంగతి తెలిస్తే ఆశ్చర్యపోతారు

జుట్టుకు నూనె రాయాలా వద్దా అన్న డౌట్ చాలా మందిలో ఉంటుంది. కొందరు జుట్టుకు నూనె రాస్తే మంచిదనుకుంటారు. మరికొందరు జుట్టుకు నూనె రాయకపోతే మేలు అని భావిస్తారు. ఒక నెల పాటు జుట్టుకు నూనె రాయకపోతే ఏమవుతుందో ఇక్కడ తెలుసుకుందాం. జుట్టు ప్రతి ఒక్కరి అందంలో కీలకపాత్ర పోషిస్తుంది. ఈ రోజుల్లో జుట్టు బలంగా, పొడుగ్గా, అందంగా ఉండాలని ప్రతి ఒక్కరు కోరుకుంటారు. అయితే మారిన జీవనశైలి, పొల్యూష్యన్ కారణంగా అనేక జుట్టు సమస్యల్ని ఎదుర్కొంటారు. జుట్టు రాలడం, చుండ్రు, తెల్ల జుట్టు, పొడిబారడం వంటి సమస్యలు ఎదుర్కొంటున్నారు. అందమైన జుట్టు కావాలంటే దానిని సరిగ్గా చూసుకోవడం చాలా ముఖ్యం. ఇక, ఈ రోజుల్లో జుట్టుకు నూనె రాయడం గురించి చాలా మందికి వేర్వేరు అభిప్రాయాలు ఉన్నాయి. కొంతమంది జుట్టుకు నూనె రాయడం మంచిదని భావిస్తారు. మరికొందరు జుట్టుకు నూనె రాయకూడదంటారు. ఒకవేళ నెల రోజుల పాటు జుట్టుకు నూనె రాయకపోతే ఏమవుతుందో తెలుసా? జుట్టుకు ఆయిల్



అప్లై చేయకపోతే అనేక మార్పులు జరుగుతాయని నిపుణులు అంటున్నారు. ఆ పూర్తి వివరాలు ఇక్కడ తెలుసుకుందాం. మీరు జుట్టుకు నూనె రాయడం నెల రోజులు మానేస్తే దాని సహజ తేమ క్రమంగా తగ్గడం ప్రారంభమవుతుంది. నూనె జుట్టుకు బాహ్య రక్షణ పొరను అందిస్తుంది. తేమను లాక్ చేస్తుంది. నూనె రాయడం మానేసిన ఒక వారం తర్వాత, మీ జుట్టు పొడిగా, నిస్తేజంగా కనిపిస్తుంది. దాని సహజ మెరుపు మాయమవుతుంది. జుట్టు చిట్లడం, సులభంగా చిక్కులు పడటం ప్రారంభమవుతుంది. నూనె జట్టుకు మాత్రమే కాదు.. తల అంటే తల చర్మానికి కూడా చాలా అవసరం. నూనె రాయకపోవడం వల్ల తలపై ఉండే సహజ రక్షణ పొర తొలగిపోతుంది. దీని వల్ల చర్మం పొడిబారుతుంది. పొడిబారడం వల్ల దురద, చుండ్రు పెరుగుతాయి. ఒక నెల పాటు తలపై పోషకాలు అందకపోతే.. అది బలహీనంగా మారుతుంది. చర్మ ఇన్ఫెక్షన్ ప్రమాదం పెరుగుతుందని నిపుణులు అంటున్నారు. హెయిర్ ఆయిల్ అవసరమైన పోషకాలు, విటమిన్లు, కొవ్వు ఆమ్లాలను అందిస్తుంది. ఈ పోషకాలు అందకపోతే జుట్టు లోపలి నుంచే బలహీనపడటం ప్రారంభమవుతుంది. ఒక నెల తర్వాత జుట్టును దువ్వినప్పుడు మునుపటి కంటే ఎక్కువ విరిగిపోవడాన్ని మీరు గమనించవచ్చు. జుట్టు పెరుగుదల నెమ్మదిస్తుంది. జుట్టు సన్నగా మారుతుంది. చివర్లు కూడా చిట్లిపోతుంటాయి.

# హెయిర్ కలర్ తప్పదంటే ఈ విషయాలు తెలుసుకోవటం కూడా తప్పదు!

హెయిర్ కలర్ ప్రతి ఒక్కరు తప్పనిసరిగా వాడాల్సిన పరిస్థితి వస్తోంది. చిన్నవయసులోనే జుట్టు నెరిసిపోవడంతో చాలామంది హెయిర్ కలర్స్ వినియోగిస్తున్నారు. హెయిర్ కలర్స్ వేసుకోవడం అనివార్యం అవుతున్న నేపథ్యంలో, హెయిర్ కలర్ వేసుకుంటే జరిగే ఆరోగ్య నష్టాలపైన ఆందోళన కూడా వ్యక్తమవుతుంది. ఇటువంటి పరిస్థితుల్లో హెయిర్ కలర్ వినియోగం గురించి ప్రతి ఒక్కరు కచ్చితంగా తెలుసుకోవలసిన అంశాలు ఉన్నాయి..వాటిని ఒకసారి చూద్దాం. హెయిర్ డై వేస్తున్నారా? హెయిర్ కలర్ వేసుకునేటప్పుడు సేఫ్టీ చాలా ముఖ్యం. సరైన జాగ్రత్తలు తీసుకోకపోతే మీ జుట్టు పాడైపోతుంది. జుట్టు మాత్రమే కాదు మీకు స్కిన్ సమస్యలు వచ్చే అవకాశం ఉంది. హెయిర్ డై లలో ఉండే రసాయనాలు కొంతమందికి అలర్జీలను లేదా స్కిన్ ప్రాబ్లమ్స్ ను క్రియేట్ చేస్తాయి. అందుకే హెయిర్ డై వాడేటప్పుడు, వాడడానికి 48 గంటలకు ముందు చెవి వెనుక భాగంలో చేతిపై చిన్న మోతాదులో కలర్ రాయాలి. హెయిర్ కలర్ చేసుకునేటప్పుడు ఈ జాగ్రత్తలు తప్పనిసరి అక్కడ ఎటువంటి ఇరిటేషన్ , ర్యాష్ రాకపోతే హెయిర్ డై వినియోగించవచ్చు. ఎర్రగా మారడం,దద్దుర్లు రావడం,చర్మం మంటగా ఉండడం,వాపు కనిపించడం వంటి లక్షణాలు ఉంటే ఆ హెయిర్ కలర్ ను వాడకుండా ఉంటేనే మంచిది. హెయిర్ కలర్ చేసుకునేటప్పుడు ఎప్పుడు రబ్బర్ లేదా ప్లాస్టిక్ గ్లోవ్స్ ను ఉపయోగించాలి. ఇది మన చేతులపైన రంగు పడకుండా చూడడం మాత్రమే కాకుండా రసాయనాల ప్రభావాన్ని కూడా తగ్గిస్తుంది. హెయిర్ డై తో ఆరోగ్యంపై ప్రభావం ఎప్పుడైనా హెయిర్ కలర్ చేసుకునేటప్పుడు గాలి, వెలుతురు ధారాళంగా వచ్చే ప్రదేశంలో కూర్చొని వేసుకోండి. ఎందుకంటే హెయిర్ డైలో ఉండే అమోనియా పెరాక్సైడ్ వంటి పదార్థాలు మూసి ఉన్న గదిలో వేసుకుంటే మన ఆరోగ్యం పైన ప్రభావాన్ని చూపిస్తాయి. ఇక హెయిర్ డై వేసుకున్నప్పుడు సూచించిన సమయం కంటే ఎక్కువసేపు దాన్ని ఉంచుకోకండి. డై వేసుకున్నాక ఇలా చెయ్యండి డై వేసుకున్న తర్వాత ప్యాక్ పైన ఇచ్చినటువంటి సమయాన్ని గుర్తుపెట్టుకొని ఆ సమయానికి జుట్టును కడుక్కోండి. లేదంటే జుట్టు పొడిబారి బలహీనంగా మారుతుంది. ఇక డై వేసుకున్న తర్వాత జుట్టును, తల చర్మాన్ని,

# పసుపు ఎండుద్రాక్ష, నల్లని ఎండుద్రాక్ష రెండింటిలో ఏవి మంచివి, ఏ ద్రాక్ష తింటే త్వరగా బరువు తగ్గుతారు

ఎండుద్రాక్ష.. వీటిని ద్రాక్షపండ్లని ఎండబెట్టి చేస్తారు. డ్రై ఫ్రూట్స్‌లో ఒకటైన ఇవి ఆరోగ్యానికి ఎంతగానో మేలు చేస్తాయి. అయితే, ఇందులో రెండు రకాల ఎండుద్రాక్సలు ఉంటాయి. అవి పసుపు రంగులోని ఎండుద్రాక్ష. నల్లని ఎండుద్రాక్ష. ఈ రెండింటిలో ఏవి ఆరోగ్యానికి మంచివి. ఎందులో పోషకాలు ఎక్కువగా ఉంటాయి. ఏ ద్రాక్షని తింటే త్వరగా బరువు తగ్గుతారు. ఏవి శరీరానికి ఎక్కువ లాభాలనిస్తాయి. ఇలాంటి పూర్తి వివరాలు తెలుసుకోండి. ఎండుద్రాక్షలు.. డ్రైఫ్రూట్స్‌లో భాగంగా మనం తీసుకుంటాం. వీటిని తీసుకోవడం వల్ల శరీరానికి ఎన్నో విధాలుగా మేలు జరుగుతాయి. ఎండుద్రాక్షని నానబెట్టి తీసుకుంటారు. దీని వల్ల మలబద్ధకం దగ్గర్నుంచీ జీర్ణ సమస్యలు దూరమవ్వడం వరకూ ఎన్నో లాభాలు ఉన్నాయి. అయితే, ఈ ఎండుద్రాక్షల్లోనే సాధారణంగా రెండు రకాలు ఉంటాయి. పసుపు రంగు ఎండుద్రాక్ష. నల్లని ఎండద్రాక్ష. ఈ రెండింటిలో ఏవి తింటే ఎక్కువగా లాభాలు ఉంటాయి. ఈ రెండింటి మధ్య తేడా ఏంటి? ఏవి తింటే బరువు తగ్గడానికి హెల్ప్ అవుతాయి ఇలాంటి వివరాలన్నీ పోషకాహార నిపుణురాలు దీప్షికా జైన్ తన ఇన్‌స్టాగ్రామ్ వీడియోలో షేర్ చేసుకున్నారు. దాని గురించి తెలుసుకుందాం. సాధారణంగా వీటిని ఎలాంటి ప్రిజర్వేటివ్స్ లేకుండా ఎండబెడతారు. ఈ నల్లద్రాక్షలో ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్స్ ఉంటాయి. ఇవి మన శరీరంలో



ఇన్‌ఫ్లమేషన్‌ని తగ్గించి గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి. అంతేకాకుండా పసుపు పచ్చని ద్రాక్షతో పోలిస్తే నల్లని ఎండుద్రాక్షలు ఎక్కువగా ఐరన్, ఫైబర్‌ని అందిస్తాయి. పసుపు పచ్చ ఎండుద్రాక్షల్ని అప్పుడప్పుడు సల్ఫర్ డయాక్సైడ్‌తో ఎండబెడతారు. వీటి కారణంగా ఇందులోని యాంటీ ఆక్సిడెంట్స్ తగ్గుతాయి. ఎవరైతే సల్ఫైట్స్ పడవో అలాంటి వారు ఈ ఎండుద్రాక్షలకి దూరంగా ఉండండి. అయితే, వీటిని మనం మంచి ఫ్లేవర్, కలర్ కోసం బేకింగ్, మఫిన్స్‌ని వాడొచ్చు. వీటిని ఆకుపచ్చ ద్రాక్షల్ని ఎండబెట్టి తయారుచేస్తారు. న్యూట్రిషనిస్ట్ దీప్షికా జైన్ ప్రకారం, ఇవి థైరాయిడ్ ఉన్నవారికి చాలా మంచివి. రాత్రి వీటిని నానబెట్టి ఉదయాన్నే ఖాళీ కడుపుతో వీటిని తింటే థైరాయిడ్ లెవల్స్ బ్యాలెన్స్ అవుతాయి. కాబట్టి, హ్యాపీగా వీటిని తినొచ్చు. అయితే, తక్కువ మొత్తంలోనే తినాలి. నల్ల ద్రాక్షలో ఐరన్ ఎక్కువగా ఉంటుంది. ఎవరైనా రక్తహీనతతో బాధపడుతుంటే అలాంటి వారు నల్ల ద్రాక్షని ప్రతిరోజూ రాత్రి నానబెట్టి ఉదయాన్నే తింటే చాలా మంచిది. బాడీలో హిమోగ్లోబిన్ లెవల్స్ పెరుగుతాయి. బలహీనత తగ్గుతుంది. పసుపు, నల్లని ఎండు ద్రాక్షలు దాదాపు సమాన మొత్తంలో పోషకాలు ఉంటాయి. రెండింటిలోనూ ఫైబర్, యాంటీ ఆక్సిడెంట్స్ ఉన్నప్పటికీ నల్ల ఎండుద్రాక్షలో వీటి శాతం కాస్తా ఎక్కువగా ఉంటాయి. బరువు తగ్గాలని ప్రయత్నించేవారికి ఈ ఎండుద్రాక్ష చక్కని పరిష్కారమని చెప్పొచ్చు. వీటిని తీసుకోవడం వల్ల షుగర్ క్రేవింగ్స్ తగ్గుతాయి. అవి చర్మానికి అద్భుతమైన యాంటీ ఏజింగ్ ఫుడ్ కదా. వీటిలోని యాంటీ ఆక్సిడెంట్స్ ముడతల్ని తగ్గించి చర్మానికి మంచి మెరుపుని ఇస్తాయి. నల్లద్రాక్షలోని అధికశాతం యాంటీ ఆక్సిడెంట్స్ బాడీలోని ట్యాక్సిన్స్ తొలగిస్తాయి. దీని వల్ల షైనీ స్కిన్ మీ సొంతమవుతుంది. అయితే, ఎంత మంచివి అయినప్పటికీ వీటిని తక్కువగానే తినాలి. రోజూ 6 నుంచి 8 ఎండుద్రాక్షలు సరిపోతాయి. వీటిలోని ఫైబర్ కారణంగా కడుపు నిండినట్లుగా అనిపిస్తుంది. దీంతో పాటు త్వరగా జీర్ణమవ్వవు. ఈ కారణంగా అవి బరువు తగ్గడానికి హెల్ప్ చేస్తాయి.

# కోల్‌కతా టెస్ట్‌లో భారత్ ఓటమి



కోల్‌కతా వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టెస్టులో టీమిండియా ఓటమిపాలైంది. 30 పరుగుల తేడాతో ఓడిపోయింది. దక్షిణాఫ్రికా నిర్దేశించిన 124 పరుగుల లక్ష్యాన్ని చేధించే క్రమంలో టీమిండియా 93 పరుగులకు కుప్పకూలింది. ఈ విజయంతో రెండు టెస్టుల సిరీస్‌లో దక్షిణాఫ్రికా 1-0 తేడాతో ఆధిక్యంలో నిలిచింది. హార్మర్, మార్కో జాన్సెన్ అద్భుతంగా బౌలింగ్ చేయడంతో దక్షిణాఫ్రికా మ్యాచ్‌లో గెలుపొందింది. దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్‌లో 153 పరుగులకు ఆలౌట్ అయింది. 123 పరుగుల ఆధిక్యంలో నిలిచి, భారత్‌కు 124 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. రెండో ఇన్నింగ్స్‌లో భారత బ్యాట్స్‌మెన్ ఏమాత్రం ఆకట్టుకోలేకపోయారు. వాషింగ్టన్ సుందర్, అక్షర్ పటేల్ మినహా ఎవరూ దక్షిణాఫ్రికా బౌలర్ల ఎదుట నిలువలేకపోయారు. దాదాపు 15 సంవత్సరాల తర్వాత స్వదేశంలో దక్షిణాఫ్రికా చేతులో భారత జట్టు ఓటమిపాలైంది. ఆదివారంతో పాటు మరో రెండురోజుల ఆట మిగిలి ఉన్నా టీమిండియా బ్యాట్స్‌మెన్ క్రీజులో నిలిచి పరుగులు సాధించడంలో విఫలమయ్యారు. ఈడెన్ గార్డెన్స్ వేదికగా శుక్రవారం టెస్ట్ మొదలైంది. టాస్ గెలిచిన దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఎంచుకుంది. తొలి ఇన్నింగ్స్‌లో 159 పరుగులకు ఆలౌట్ అయ్యింది. టీమిండియా బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి ప్రోటీస్ జట్టును కట్టడి చేశారు. జస్‌ప్రీత్ బుమ్రా ఐదు వికెట్ల పడగొట్టి దక్షిణాఫ్రికా బ్యాటింగ్ ఆర్డర్‌ను కుప్పకూల్చాడు. సిరాజ్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్ల పడగొట్టగా.. అక్షర్ పటేల్‌కు ఒక వికెట్ దక్కింది. ఆ తర్వాత తొలి ఇన్నింగ్స్‌లో భారత జట్టు 189 పరుగులకు ఆలౌట్ అయ్యింది. దక్షిణాఫ్రికా బౌలర్లు హార్మర్ (వికెట్లు), మార్కో జాన్సన్ (3వికెట్లు) రాణించడంతో టీమిండియా తక్కువ స్కోర్‌కే పరిమితమైంది. దక్షిణాఫ్రికాపై భారత్‌కు 30 పరుగుల లీడ్ లభించింది. ఆ తర్వాత రెండో టెస్టులో దక్షిణాఫ్రికా 153 పరుగులకు మాత్రమే చేసింది. భారత జట్టుకు 124 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. స్వల్ప లక్ష్యంతో బరిలోకి దిగిన టీమిండియాకు 93 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లు జైస్వాల్ డకౌట్ కాగా.. కేఎల్ రాహుల్ ఒక అవుట్ అయ్యాడు.

# అబుధాబీలో మినీ వేలం ఆ 77 మందిపై ఫ్రాంఛైజీల కన్ను




ఐపీఎల్ రిటెన్షన్ గడువు ముగియడంతో ఇప్పుడు అందరి దృష్టి వేలంపై నిలిచింది. డిసెంబర్ 16న అబుధాబీలో మినీ వేలం కోసం ఫ్రాంచైజీలు సిద్ధమవుతున్నాయి. పంతొమ్మిదో సీజన్ కోసం పది జట్లు 173 మందిని అట్టిపెట్టుకున్నాయి. వీరిలో 49 మంది విదేశీ ఆటగాళ్లున్నారు. ఈసారి ముంబై ఇండియన్స్, గుజరాత్ టైటాన్స్ భారీ సంఖ్యలో రీటైన్ చేసుకున్నాయి. కాబట్టి.. వేలంలో 77 మంది మాత్రమే అమ్ముడుపోయే అవకాశముంది. అబుధాబీలో జరుగబోయే మినీ వేలంలో అన్ని ఫ్రాంచైజీలు రూ.237.55 కోట్లు ఖర్చు చేయనున్నాయి. వీటిలో కోల్‌కతా నైట్ రైడర్స్ వద్ద అత్యధికంగా రూ. 64.3కోట్లు ఉన్నాయి. వేలంలో పదమూడు మందిని కొనేందుకు కోల్‌కతా కసరత్తు చేస్తోంది. ఇందులో ఆరుగురు విదేశీ ఆటగాళ్లు ఉండే అవకాశముంది. రెండో అత్యధిక బడ్జెట్ చెన్నై సూపర్ కింగ్స్ వద్ద ఉంది. సీఎస్కే రూ.43.4 కోట్లతో వేలంలో పాల్గొననుంది. ముంబై ఇండియన్స్ దగ్గర రూ.2.75 కోట్లు ఉన్నాయంతే. పంజాబ్ కింగ్స్ ఫ్రాంచైజీ పర్స్‌లో రూ.11.5 కోట్లు ఉన్నాయి.

కోల్‌కతా నైట్ రైడర్స్ : అట్టిపెట్టుకున్న ప్లేయర్లు %-% అజింక్యా రహానే, అంగ్‌క్రిష్ రఘువంశీ, అనుకుల్ రాయ్, మనీశ్ పాండే, రమన్‌దీప్ సింగ్, రింకూ సింగ్, రొవ్‌మన్ పావెల్, సునీల్ నరైన్, ఉమ్రాన్ మాలిక్, వైభవ్ అరోరా, వరుణ్ చక్రవర్తి. వదిలేసిన ఆటగాళ్లు %-% వెంకటేశ్ అయ్యర్, అండ్రూ రస్సెల్, క్వింటన్ డికాక్, అన్రిజ్ నోర్జే, రహ్మానుల్లా గుర్బాజ్, స్పెన్సర్ జాన్సన్.

చెన్నై సూపర్ కింగ్స్ : రీటైన్డ్ ప్లేయర్లు %-% ఎంఎస్ ధోనీ, జేమీ ఓవర్టన్, నూర్ అహ్మద్, నాథ్ ఎల్లిస్, అన్షుల్ కంబోజ్, ముకేశ్ చౌదరీ, రామక్రిష్ణ, ఘోష్, సంజూ శాంసన్(ట్రేడ్ డీల్), రుతురాజ్ గైక్వాడ్, శివం దూబే, శ్రేయాస్ గోపాల్, ఖలీల్ అహ్మద్, ఆయుష్ మాత్రే, డెవాల్డ్ బ్రెవిస్, ఉర్విల్ పటేల్.

సీఎస్కే వద్దనుకున్న ప్లేయర్లు %-% డెవాన్ కాన్వే, రాహుల్ త్రిపాఠి, రచిన్ రవీంద్ర, దీపక్ హుడా, షేక్ రషీద్, విజయ్ శంకర్, కమలేశ్ నగర్‌కోటి, వన్ష్ బేడీ, ఆండ్రూ సిద్ధార్థ్.

లక్నో సూపర్ జెయింట్స్ : రీటైన్డ్ ప్లేయర్లు %-% రిషభ్ పంత్, మర్క్‌రమ్, హిమ్మత్, అర్జున్ టెండూల్కర్, షమీ (ట్రేడ్ డీల్), ఆయుశ్ బదొని,మిచెల్ మార్ష్, అబ్దుల్ సమద్, షాబాద్, అర్షిన్, అవేశ్, సిద్ధార్థ్, దిగ్వేజ్, ప్రిన్స్, మయాంక్ , మొహ్సిన్.

విడుదల చేసిన ప్లేయర్లు %-% రవి బిష్ణోయ్, డేవిడ్ మిల్లర్, ఆకాశ్ దీప్, షమర్ జోసెఫ్, ఆర్యన్ జుయల్, హంగర్కేకర్, యువరాజ్ చౌదరీ.

ఢిల్లీ క్యాపిటల్స్: రీటైన్డ్ ప్లేయర్లు %-% కేఎల్ రాహుల్, కరుణ్ నాయర్, దుష్మంత్ చమీర, అభిషేక్ పొరెల్, అజయ్ మండల్, అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్, అశుతోష్ శర్మ, మద్వా తివారీ, మిచెల్ స్టార్క్, ముకేశ్ కుమార్, నితీశ్ రానా(ట్రేడ్ డీల్), సమీర్ రిజ్వీ, త్రిపురన విజయ్, ట్రిస్టన్ స్టబ్స్, విప్రజ్ నిగమ్, టి.నటరాజన్.

వదిలేసిన ప్లేయర్లు %-% ఫాఫ్ డూప్లెసిస్, జేక్ ఫ్రేజర్ మెక్‌గుర్క్, సెడీకుల్లా అటల్.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: రీటైన్డ్ ప్లేయర్లు %-% రజత్ పాటిదార్, విరాట్ కోహ్లీ, దేవ్‌దత్ పడిక్కల్, ఫిల్ సాల్ట్, జితేశ్ శర్మ, కృనాల్ పాండ్యా, స్వప్నిల్ సింగ్, టిమ్ డేవిడ్, రొమారియో షెపర్డ్, జాకబ్ బెథెల్, హేజిల్‌వుడ్, యశ్ దయాల్, భువనేశ్వర్, నువాన్ తుషార, రసిక్ దార్ సలాం, సుయాశ్ శర్మ, అభినందన్ సింగ్.

ఆర్సీబీ వదిలేసిన ప్లేయర్లు %-% మయాంక్ అగర్వాల్, లుంగి ఎంగిడి, లివింగ్‌స్టోన్, స్వస్తిక్ చికర, మోహిత్ రథీ, బ్లెస్సింగ్ ముజరబని, టిమ్ సీఫర్ట్.

సన్‌రైజర్స్ హైదరాబాద్ : రీటైన్డ్ ప్లేయర్లు %-% ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ, అనికేత్ వర్మ, స్మరణ్, ఇషాన్ కిషన్, నితీశ్ రెడ్డి, క్లాసెన్, హర్ష్ దుబే, కమిందు మెండిస్, హర్షల్ పటేల్, బ్రైడన్ కార్సే, ప్యాట్ కమిన్స్, ఉనాద్కాట్, ఇషాన్ మలింగ, జీషన్ అన్సారీ.

వద్దనుకున్న ప్లేయర్లు %-% ఆడం జంపా, రాహుల్ చాహర్, అభినవ్ మనోహర్, వియాన్ మల్దర్, సిమర్జిత్ సింగ్, సచిన్ బేబీ, అధర్వ తైడే.

పంజాబ్ కింగ్స్ : అట్టిపెట్టుకున్నది వీళ్లనే %-% శ్రేయాస్ అయ్యర్, చాహల్, అర్ష్‌దీప్ సింగ్, స్టోయినిస్, శశాంక్ సింగ్, నేహల్ వధేర, ప్రియాన్ష్ ఆర్య, పైలా అవినాశ్, హర్నూర్ పన్ను, హర్‌ప్రీత్ బ్రార్, ముషీర్ ఖాన్, ప్రభ్‌సిమ్రాన్ సింగ్, విష్ణు వినోద్, మార్కో యాన్సెన్, అజ్మతుల్లా ఒమర్‌జాయ్, సూర్యాన్ష్ శెడ్గే, మిచెల్ ఓవెన్, వైషాక్ విజయ్ కుమార్, యశ్ ఠాకూర్, గ్జావియర్ బార్ట్‌లెట్, లాకీ ఫెర్గూసన్.

పంజాబ్ వద్దనుకున్న ప్లేయర్లు %-% గ్లెన్ మ్యాక్స్‌వెల్, అరోన్ హర్డీ, జోష్ ఇంగ్లిస్, కుల్దీప్ సేన్, ప్రవీణ్ దూబే.

ముంబై ఇండియన్స్ : రీటైన్డ్ ప్లేయర్లు %-% రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్, తిలక్ వర్మ, రాబిన్ మింజ్, రియాన్ రికెల్టన్, హార్దిక్ పాండ్యా, నమన్ ధిర్, మిచెల్ శాంట్నర్, విల్ జాక్స్, కార్బిన్ బాస్చ్, రాజ్ బవ, ట్రెంట్ బౌల్ట్, బుమ్రా, దీపక్ చాహర్, అశ్వినీ కుమార్, రఘు శర్మ, గజన్‌ఫర్.ముంబై వదిలేసిన ప్లేయర్లు.. లిజాడ్ విలియమ్స్, ముజీబ్ ఉర్ రెహ్మాన్, బెవాన్ జాకబ్స్, రీసే టాప్లే, విఘ్నేష్ పుతూర్, సత్యనారాయణ రాజు.

# రసెల్‌ను వదులుకున్న కేకేఆర్



ముంబై: వచ్చే సీజన్ కోసం ఐపీఎల్ ఫ్రాంఛైజీలు తాము అట్టిపెట్టుకునే ఆటగాళ్లతో పాటు వేలానికి వదిలేసే ఆటగాళ్ల జాబితాను ప్రకటించాయి. శనివారం (నవంబర్ 15)తో రిటెన్షన్ గడువు ముగియడంతో అన్ని ఫ్రాంఛైజీలు తాము రిటైన్, రిలీజ్ చేసే ఆటగాళ్ల జాబితాను విడుదల చేశాయి. వీరిలో ముఖ్యంగా 11 సీజన్ల పాటు కోల్‌కతా నైట్ రైడర్స్ (కేకేఆర్)కు ఆడిన ఆండ్రూ రసెల్‌ను ఆ ఫ్రాంఛైజీ రిటైన్ చేసుకోలేదు. అంతేగాక నిరుటి వేలంలో రికార్డు ధర పలికిన వెంకటేశ్ అయ్యర్ (రూ. 23.75 కోట్లు), అన్రిచ్ నోకియా (రూ. 6.5 కోట్లు), క్వింటన్ డికాక్ (రూ. 3.6 కోట్లు)నూ ఆ జట్టు వదిలించుకుంది. పంజాబ్ కింగ్స్ కూడా గ్లెన్ మ్యాక్స్‌వెల్ (రూ. 4.20 కోట్లు), జోష్ ఇంగ్లిస్ (రూ. 2.5 కోట్లు) వంటి హిట్టర్లను రిలీజ్ చేసింది. సన్ రైజర్స్ హైదరాబాద్ (ఎస్ఆర్‌హెచ్).. సీనియర్ పేసర్ మహ్మద్ షమీ (రూ. 10 కోట్లు) లక్నోకు ట్రేడ్ చేసింది.ఇక అందరూ ఊహించినట్టుగానే సంజూ శాంసన్ (రాజస్థాన్ నుంచి చెన్నైకి), రవీంద్ర జడేజా (చెన్నై నుంచి రాజస్థాన్‌కు) ట్రేడ్ విజయవంతంగా పూర్తైంది. ఢిల్లీ.. యువ సంచలనం జేక్ ఫ్రేసర్ (రూ. 9 కోట్లు)తో పాటు హ్యారీ బ్రూక్ (రూ. 6.25 కోట్లు), డుప్లెసిస్ (రూ. 2 కోట్లు)ను వదిలించుకుంది. లివింగ్‌స్టొన్ (రూ. 8.75 కోట్లు)ను బెంగళూరు రిటైన్ చేసుకోలేదు. ముంబై, బెంగళూరు, గుజరాత్ తమ ప్రధాన ఆటగాళ్లను రిటైన్ చేసుకున్నాయి. ఆశ్చర్యకరంగా చెన్నై.. ఆ జట్టు తురుపు ముక్క పతీరాన (రూ. 13 కోట్లు), కాన్వే (రూ. 6.25 కోట్లు), రచిన్ రవీంద్ర (రూ. 4.20 కోట్లు) వంటి స్టార్ ప్లేయర్లను వదులుకోవడం గమనార్హం. హైదరాబాద్ కూడా రాహుల్ చాహర్, అభినవ్ మనోహర్, ఆడమ్ జంపా, వియాన్ మల్డర్ వంటి ఆటగాళ్లను రిటైన్ చేసుకోలేదు.చెన్నై, కోల్‌కతా పర్స్ ఫుల్‌రిటెన్షన్ ప్రక్రియలో మిగిలిన జట్లతో పోలిస్తే చెన్నై, కోల్‌కతా తమ జట్లను పూర్తిగా పునరుద్ధరించేందుకు సిద్ధమయ్యాయి. సీఎస్‌కే దాదాపు 12 మందిని, కేకేఆర్ 10 మంది ఆటగాళ్లను వేలానికి వదిలేసింది. రిలీజ్ చేసిన ఆటగాళ్లు పోగా కోల్‌కతా వద్ద అత్యధికంగా రూ. 64.3 కోట్లు ఉండగా చెన్నై రూ. 43.4 కోట్లతో రెండో స్థానంలో ఉన్నాయి. డిసెంబర్ 16న జరుగబోయే మినీవేలంలో ఈ రెండు జట్ల మధ్యే ప్రధాన పోటీ ఉండనుంది. హైదరాబాద్, లక్నో, ఢిల్లీ కూడా వేలం రేసులో ముందు వరుసలో ఉన్నాయి. అందరికంటే తక్కువగా ముంబై ఇండియన్స్ వద్ద రూ. 2.75 కోట్లు మాత్రమే మిగిలుంది.

# క్రెడిట్ స్కోర్ 750 కంటే ఎక్కువ ఉన్నా




చాలా మంది తమ క్రెడిట్ స్కోరు 750 లేదా అంతకంటే ఎక్కువ ఉంటే వారు సులభంగా రుణం పొందుతారని నమ్ముతారు. కానీ వాస్తవం చాలా భిన్నంగా ఉంటుంది. కొన్నిసార్లు మంచి స్కోరు ఉన్నప్పటికీ రుణం లేదా క్రెడిట్ కార్డ్ దరఖాస్తులు తిరస్కరించబడతాయి. ఎందుకంటే బ్యాంకులు మీ స్కోరును మాత్రమే చూడవు, మీ మొత్తం ఆర్థిక పరిస్థితి, ఉద్యోగ స్థిరత్వం, బాధ్యతల స్థాయిని కూడా పరిశీలిస్తాయి.క్రెడిట్ స్కోర్ అనేది మీ గత చరిత్ర, గత రుణాలను తిరిగి చెల్లించే మీ సామర్థ్యాన్ని సూచిస్తుంది. అయితే క్రెడిట్ స్కోర్ ఆధారంగా మాత్రమే మొదటిసారి రుణగ్రహీతలను తిరస్కరించడం సముచితం కాదని ప్రభుత్వం ఇప్పుడు స్పష్టం చేశాయి. కస్టమర్ మొత్తం ఆర్థిక సామర్థ్యాలు, సాధారణ ఆదాయం, ప్రస్తుత ఆర్థిక బాధ్యతలను అంచనా వేసిన తర్వాత మాత్రమే నిర్ణయం తీసుకోవాలని బ్యాంకులకు సూచించబడింది.రుణ ఆమోదంలో ప్రధాన అరాలు మీ ఆదాయం, ఉద్యోగ స్థిరత్వం. మీరు తరచుగా ఉద్యోగాలు మారుస్తుంటే లేదా ఎక్కువ కాలం నిరుద్యోగిగా ఉంటే, బ్యాంకులు మిమ్మల్ని ప్రమాదకర కస్టమర్‌గా పరిగణించవచ్చు. ఒకే రంగంలో స్థిరంగా పనిచేయడం, నమ్మకమైన కంపెనీతో సంబంధం కలిగి ఉండటం కూడా మీకు అనుకూలంగా పనిచేస్తుంది. అదేవిధంగా మీ ప్రస్తుత అప్పు బ్యాంకులకు కూడా ముఖ్యమైనది. మీ ఆదాయంలో 40-50 శాతం కంటే ఎక్కువ చెల్లింపుల కోసం ఖర్చు చేస్తే, బ్యాంకులు కొత్త రుణం ఇవ్వడానికి వెనుకాడతాయి.ఒకటి కంటే ఎక్కువ రుణాలుమరో ప్రధాన కారణం ఏమిటంటే ప్రజలు ఒకేసారి ఒకటి కంటే ఎక్కువ లోన్లు లేదా క్రెడిట్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకుంటారు. దీని ఫలితంగా మీ క్రెడిట్ నివేదికలో బహుళ కఠినమైన విచారణలు కనిపిస్తాయి. బ్యాంకులు దీనిని ఆర్థిక ఒత్తిడికి సంకేతంగా భావిస్తాయి, ఇది దరఖాస్తు తిరస్కరించబడే అవకాశాలను పెంచుతుంది. అదనంగా మీరు దరఖాస్తు చేసుకుంటున్న బ్యాంకుతో మీ గత రికార్డు కూడా ముఖ్యమైనది. మీరు గతంలోలను కోల్పోయి ఉంటే లేదా అదే బ్యాంకులో రుణాలు సెటిల్ చేసి ఉంటే, ఇది మీకు వ్యతిరేకంగా పనిచేయవచ్చు.కొత్త నిబంధనల ప్రకారం.. మొదటిసారి రుణం తీసుకునేవారికి కనీస క్రెడిట్ స్కోర్ నిబంధన తొలగించబడింది. దీని అర్థం బ్యాంకులు ఇకపై కేవలం స్కోరు ఆధారంగా మాత్రమే రుణాలను తిరస్కరించలేవు. వారు కస్టమర్ ఆర్థిక బలం, రుణం తిరిగి చెల్లించే సామర్థ్యం, ఉద్యోగ భద్రత వంటి ఇతర అంశాలను అంచనా వేయాలి.మీరు రుణం ఆమోదం పొందే అవకాశాలను పెంచుకోవాలనుకుంటే, ఉద్యోగ స్థిరత్వాన్ని కొనసాగించాలనుకుంటే, మీ అప్పులను తక్కువగా ఉంచుకోవాలనుకుంటే, అనవసరమైన రుణ దరఖాస్తులను నివారించాలనుకుంటే. అలాగే, మీ భవిష్యత్తు స్కోరు, బ్యాంక్ విశ్వాసం దానిపై ఆధారపడి ఉంటుంది కాబట్టి, లు, బిల్లులను సకాలంలో చెల్లించడం కొనసాగించండి. మొత్తంమీద, క్రెడిట్ స్కోరు రుణం వైపు మొదటి అడుగు, కానీ తుది నిర్ణయం మీ మొత్తం ఆర్థిక ప్రొఫైల్‌పై ఆధారపడి ఉంటుంది.

# లోన్ తీసుకోవాలని అనుకుంటున్నారా




మీరు లోన్ తీసుకోవాలని అనుకుంటున్నారా? అయితే ఈ విషయాలు కచ్చితం తెలుసుకోవాలి. ఎవరికైనా ఎప్పుడైనా డబ్బు అవసరం అనిపించవచ్చు. అటువంటి పరిస్థితిని ఎదుర్కోవడానికి, చాలా మంది బ్యాంకు నుండి రుణం తీసుకోవడం ద్వారా తమ వ్యక్తిగత అవసరాలను తీర్చుకుంటారు. ప్రజల వ్యక్తిగత అవసరాలను తీర్చడానికి బ్యాంకు వ్యక్తిగత రుణాలను ఇస్తుంది. వ్యక్తిగత రుణాలు అన్‌సెక్యూర్డ్ రుణం. అటువంటి పరిస్థితిలో ఇతర రుణాలతో పోలిస్తే వ్యక్తిగత రుణాల వడ్డీ రేట్లు చాలా ఎక్కువగా ఉంటాయి, కానీ ఖరీదైనవి అయినప్పటికీ, ప్రజలు తమ అవసరాలను దృష్టిలో ఉంచుకుని బ్యాంకు నుండి వ్యక్తిగత రుణాలు తీసుకుంటారు.మీరు కూడా పర్సనల్ లోన్ తీసుకోవాలని ఆలోచిస్తుంటే, ఈ లోన్ తీసుకోవడానికి తొందరపడకండి, తెలివైన నిర్ణయం తీసుకోండి. చాలా సార్లు ప్రజలు పర్సనల్ లోన్ తీసుకోవడానికి తొందరపడతారు. వారు మోసాలకు బలైపోతారు. అటువంటి పరిస్థితిలో పర్సనల్ లోన్ తీసుకునేటప్పుడు మీరు గమనించాల్సిన విషయాలేంటో ఇప్పుడు చూద్దాం.మీకు రుణం ఇచ్చే ముందు రుణ సంస్థ రుసుము అడిగితే మీరు జాగ్రత్తగా ఉండాలి. ఇది ఒక స్కామ్ కావచ్చు ఎందుకంటే చట్టబద్ధమైన కంపెనీలు ఎల్లప్పుడూ రుణ మొత్తం నుండి రుసుములను తగ్గిస్తాయి. చట్టబద్ధమైన కంపెనీలు ఎప్పుడూ ముందస్తు రుసుములను అడగవు.రుణ సంస్థ మిమ్మల్ని ధృవీకరించకపోతే లేదా మీ పత్రాలలో దేనినైనా అడిగితే, అది కూడా స్కామ్ కావచ్చు. అలాంటి సందర్భాలలో జాగ్రత్తగా ఉండండి.ఒక రుణ సంస్థ మీపై రుణం తీసుకోవాలని ఒత్తిడి తెస్తూ, వెంటనే నిర్ణయం తీసుకోమని మిమ్మల్ని బలవంతం చేస్తుంటే, అది ఇప్పటికీ ఒక మోసం కావచ్చు.ఒక రుణ సంస్థ మీకు ఒకటి కంటే ఎక్కువ ఆఫర్లను అందిస్తే, అంటే తక్కువ వడ్డీ రేటుకు రుణం, తక్కువ క్రెడిట్ స్కోరుపై రుణం లేదా నిమిషాల్లో రుణం వంటివి అందిస్తే, అది కూడా ఒక స్కామ్ కావచ్చు. అలాంటి సందర్భాలలో జాగ్రత్తగా ఉండండి.రుణం ఇచ్చే కంపెనీ మీ వ్యక్తిగత సమాచారాన్ని అడిగి, మీ పిన్ లేదా ఏదైనా అది కూడా స్కామ్ కావచ్చు. అటువంటి పరిస్థితిలో జాగ్రత్తగా ఉండండి.

# బంగారం కొనాలనుకుంటున్నారా



ఇటీవల కాలంలో బంగారం ధరలు భారీగా పెరిగిన విషయం తెలిసిందే.. ఎన్నకడూ లేని విధంగా రికార్డు స్థాయిలో లక్షా 30 వేల మార్క్ దాటిన బంగారం ధరలు .. ఆ తర్వాత దాదాపు 10 వేల వరకు తగ్గాయి. తగ్గినట్లే తగ్గి.. మళ్లీ పెరిగాయి.. ఈ క్రమంలోనే.. గత రెండు రోజులుగా బంగారం వెండి ధరలు తగ్గుతున్నాయి. శనివారం 10 గ్రాముల బంగారం పై ఏకంగా 2 వేల వరకు ధర తగ్గింది.. వెండి కూడా కిలో పై రూ.4వేల వరకు ధర తగ్గింది. వాస్తవానికి బంగారం, వెండి ధరల్లో నిత్యం హెచ్చు తగ్గులు చోటుచేసుకుంటాయి.. ఒక్కో రోజు బంగారం, వెండి ధర పెరిగితే.. మరికొన్ని రోజులు తగ్గుతుంటాయి.. తాజాగా.. ఆదివారం ఉదయం ఆరు గంటల వరకు బంగారం, వెండి ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి.పలు వెబ్‌సైట్ల ఆధారంగా.. ఆదివారం (నవంబర్ 16 2025) ఉదయం నమోదైన ధరల ప్రకారం.. దేశీయంగా బంగారం, వెండి రేట్లు ఈ కింది విధంగా ఉన్నాయి..24 క్యారెట్ల బంగారం 10 గ్రాముల ధర రూ.1,25,080 గా ఉంది.22 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,14,650 గా ఉంది.వెండి కిలో రూ.1,69,000 లుగా ఉంది.తెలుగు రాష్ట్రాల్లో, ప్రధాన నగరాల్లో బంగారం ధరలు ఇలా.హైదరాబాద్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర రూ.1,25,080 ఉంటే.. 22 క్యారెట్ల 10గ్రాముల ధర రూ.1,14,650 ఉంది.. కిలో వెండి ధర రూ.1,75,000 లుగా ఉంది.విజయవాడ, విశాఖపట్నంలో 24 క్యారెట్ల గోల్డ్ 10 గ్రాముల ధర రూ.1,25,080, 22 క్యారెట్ల ధర రూ.1,14,650 గా ఉంది.. కిలో వెండి ధర రూ.1,75,000 లుగా ఉంది.ఢిల్లీలో 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ.1,25,230, 22 క్యారెట్లు రూ.1,14,800 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,69,000లుగా ఉంది.ముంబైలో 24 క్యారెట్ల ధర రూ.1,25,080, 22 క్యారెట్లు రూ.1,14,650 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,69,000 లుగా ఉంది.చెన్నైలో 24 క్యారెట్ల ధర రూ.1,26,000, 22 క్యారెట్ల ధర రూ.1,15,500 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,75,000లుగా ఉంది.బెంగళూరులో 24 క్యారెట్ల ధర రూ.1,25,080, 22 క్యారెట్ల ధర రూ.1,14,650 గా ఉంది. వెండి కిలో ధర రూ.1,69,000 లుగా ఉంది.కాగా.. బంగారం, వెండి ధరలు అన్ని నగరాల్లో ఒకే విధంగా ఉండవు. స్థానిక డిమాండ్, సరఫరా, అలాగే రాష్ట్ర పన్నులు, తదితర అంశాల ప్రకారం మారుతుంటాయి.. అందుకే అన్ని ప్రధాన నగరాల్లో కూడా ధరల్లో వ్యత్యాసాలు ఉంటాయి. ఒకవేళ మీకు బంగారం, వెండి ధరల లేటెస్ట్ అప్‌డేట్ గురించి తెలుసుకోవాలంటే ఈ మొబైల్ నెంబర్‌కు 8955664433కు మిస్డ్ కాల్ ఇవ్వవచ్చు.

# టైమ్ రావాలంటూ. టైమ్ వేస్ట్ చేయకండి! మీరే డబ్బు కోల్పోతారు



చాలా మంది పెట్టుబడి పెట్టడం ప్రారంభించడానికి సరైన సమయం కోసం వేచి ఉంటారు. ఆదాయాలు పెరిగినప్పుడు, మార్కెట్ స్థిరపడినప్పుడు లేదా ఖర్చులు తగ్గినప్పుడు, వారు పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తారని వారు భావిస్తారు. కానీ నిజం ఏమిటంటే పెట్టుబడి పెట్టడానికి ఎప్పుడూ సరైన సమయం ఉండదు. మీరు ఎంత ఎక్కువసేపు వేచి ఉంటే, మీరు ఎక్కువ అవకాశాలను కోల్పోతారు. చిన్న మొత్తంతో కూడా ముందుగానే ప్రారంభించడం మీ ఆర్థిక భవిష్యత్తు దిశను పూర్తిగా మార్చగలదు.డబ్బు పెరగడానికి సమయం పడుతుంది. సమయం అనేది మీరు తరువాత తిరిగి పొందలేనిది. మీరు ఎంత త్వరగా పెట్టుబడి పెట్టడం ప్రారంభిస్తే, మీకు అంత ఎక్కువ చక్రవడ్డీ లభిస్తుంది, దానిలో మీ రాబడి కూడా బపెరగడం ప్రారంభమవుతుంది. ఈరోజు ప్రారంభించిన చిన్న నెలవారీ పెట్టుబడి కూడా 10-20 సంవత్సరాలలో పెద్ద డబ్బుగా మారవచ్చు.

# సినీ ప్రపంచాన్ని అబ్బురపరుస్తున్న వారణాసి గ్లింప్స్




సూపర్ స్టార్ మహేశ్‌బాబు దర్శక ధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్ లో వస్తున్న గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ 'వారణాసి' నుంచి భారీ అప్‌డేట్ వచ్చేసింది. అభిమానులతోపాటు మొత్తం సినీ పరిశ్రమ వేచి చూసిన గ్లింప్స్ వీడియోను గ్లోబ్‌ట్రాటర్ గ్రాండ్ ఈవెంట్‌లో ఘనంగా విడుదల చేశారు. మూడు నిమిషాల నిడివితో వచ్చిన ఈ వీడియోలో చూపించిన విజువల్స్ ప్రపంచ స్థాయి మేధస్సు, విపరీతమైన స్కేలు చూపిస్తున్నాయి. గ్లింప్స్‌లో వారణాసి 512, గ్రహశకలం శాంభవి 2027, అంటార్కిటికాఆఫ్రికా, ఉగ్రభట్టి కేవల్, లంకాత్రేతాయుగం, వారణాసి మణికర్ణిక ఘాట్ వంటి అనేక ప్రాంతాలు, యుగాలు చూపించారు. దీంతో ఈ చిత్రం ఒక్క జానర్‌కు పరిమితం కాదని స్పష్టమవుతోంది. టైమ్ ట్రావెల్, సైన్స్ ఫిక్షన్, మైథలాజీ, యాక్షన్ అడ్వేంచర్ అదుర్స్ అనిపించేలా గ్లింప్స్‌ను రూపొందించారు.అంతర్జాతీయ స్థాయిలో నిర్మిస్తోన్న ఈ సినిమా రాజమౌళి కెరీర్‌లోనే అత్యంత పెద్దదిగా మారనున్నట్లు ఈ వీడియో చెబుతోంది. అత్యున్నత నాణ్యతతో చూపించిన వీఎఫ్ఎక్స్ గ్లింప్స్‌కు స్పెషల్ అట్రాక్షన్ అయింది. చివర్లో నందిపై కూర్చొని, చేతిలో త్రిశూలం పట్టుకుని రౌద్రంగా నిలిచిన మహేశ్ బాబు లుక్ ఫ్యాన్స్‌ను షాక్‌కి గురి చేస్తోంది. సోషల్ మీడియాలో "ఈ సినిమాకు ఆకాశమే హద్దు" అంటూ అభిమానులు కామెంట్స్ చేస్తున్నారు. చిత్రంలో మహేశ్ బాబు. రుద్ర, ప్రపంచాన్ని చుట్టే సాహస యాత్రికుడు కాగా, ప్రియాంక చోప్రా %-% మందాకిని పాత్ర పోషించింది. పృథ్వీరాజ్ సుకుమారన్ కుంభ, శక్తివంతమైన విరోధి పాత్ర పోషించాడుఇక ఈవెంట్‌లో 'సంచారి' పాట కూడా మార్మోగగా, ఇప్పటికే ఆ పాట సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. కీరవాణి సంగీతం సమకూరుస్తుండగా, కేఎల్ నారాయణ %-% కార్తికేయ ఈ చిత్రాన్ని భూభాగాలపై షూట్ చేస్తూ భారీ బడ్జెట్‌తో నిర్మిస్తున్నారు. ఇప్పటివరకు 60 రోజుల షూటింగ్ పూర్తయిందని రాజమౌళి వెల్లడించారు. ఇంకా ప్రధాన కార్యక్రమాలు మిగిలి ఉన్నందున త్వరలో మరో షెడ్యూల్ ప్రారంభించనున్నారు. 'వారణాసి'ను 2027 సమ్మర్‌లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటివరకూ వచ్చిన ప్రమోషనల్ కంటెంట్‌తోనే సినిమా అంచనాలు ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోయాయి. ఈ గ్లింప్స్‌తో రాజమౌళి%-%మహేశ్ కాంబినేషన్ సరికొత్త ప్రపంచాన్ని ఆవిష్కరించబోతోందని స్పష్టమవుతోంది.

# రేటింగ్ పెంచే స్కెచ్: సంజనకి 'నో ఫ్యామిలీ వీక్' హౌస్‌లో ఏడుపులు, టెన్షన్‌లు!




బిగ్‌బాస్ షోలో ఫ్యామిలీ వీక్ వస్తుందంటే హౌస్‌మేట్స్ మాత్రమే కాదు, ప్రేక్షకులు కూడా అదే స్థాయి ఆసక్తితో ఎదురు చూస్తారు. ఎందుకంటే వారాలు, నెలలు పాటు బయట ఉన్న కుటుంబ సభ్యులను చూసే అవకాశం అందరికీ ఒక ఎమోషనల్ మోమెంట్. అందుకే ఫ్యామిలీ వీక్ ఎపిసోడ్స్ ఎప్పుడూ హై రేటింగ్స్ తెచ్చిపెడతాయి. అయితే ఈసారి బిగ్‌బాస్ 9 రేటింగ్ పడిపోవడంతో, ఎమోషనల్ మొమెంట్స్ పెంచడానికి టీమ్ ముందే ఒక పెద్ద ప్లాన్ వేసింది. ఆ స్కెచ్ ప్రాక్టికల్‌గా శనివారం ఎపిసోడ్‌లో బయటపడింది. శనివారం నాగార్జున హౌస్ మీద రెండు 'బిగ్ బాంబ్స్' పడబోతున్నాయని చెప్పి హౌస్‌మేట్స్‌కి టెన్షన్ పుట్టించారు. ఒకటి ఇప్పటికే రివీల్ కాగా, అది డబుల్ ఎలిమినేషన్. ఇంకో బాంబ్ ఎవరి మీద పడుతుందో తెలుసుకోడానికి ఓ చిన్న టాస్క్ పెట్టారు.ప్రతి కంటెస్టెంట్‌ను తమను ఎక్కువగా సపోర్ట్ చేసిన హౌస్‌మేట్ ఎవరు? తమ ఆటను కిందికి లాగుతున్న హౌస్‌మేట్ ఎవరు? అని చెప్పమన్నారు. అందరిలోనూ ఎక్కువ మంది సంజన పేరు "కిందికి లాగుతుంది" లిస్టులో పెట్టారు. దాంతో ఆ బిగ్ బాంబ్ కూడా సంజన మీదే పడుతుందని నాగ్ చెప్పారు. తీరా బాక్స్ ఓపెన్ చేస్తే అందులోఅన్న పెద్ద షాక్ కనిపించింది. దాంతో సంజన కన్నీరుమున్నీరయ్యింది సంజనకి ఇద్దరు చిన్న పిల్లలు ఉండగా, అందులో ఒకరు నెలల పసికందు. పిల్లల్ని మిస్ అవుతూ, రోజూ ఏడుస్తూ ఫ్యామిలీ వీక్ కోసం ఓపికగా వెయిట్ చేస్తోంది సంజన. అలాంటి సంజనకి ఫ్యామిలీ రానని తెలిసిన క్షణం సంజనా బాగా విలపించింది. సార్ నేను ఇంటికెళ్తాను%ొ% నా వల్ల కాదు నేను చచ్చిపోతా రోజుకు ఆరుసార్లు ఏడుస్తున్నాను నా పిల్లల్ని చూడాలి సార్అని సంజన ఏడుస్తూ నాగ్‌కీ రిక్వెస్ట్ చేసింది.నాగ్ మాత్రం ..ఇది ఫలితమే అమ్మా హౌస్ మెజారిటీ నీ వల్ల ఆట కిందకి లాగబడుతోందని అనుకున్నారు అని సమాధానమిచ్చారు. అంతలో కళ్యాణ్ లేచి "సార్ ఒక ఛాన్స్ ఉంటే నా ఫ్యామిలీ వీక్‌ను నేను త్యాగం చేస్తా%ొ% బాంబ్ నాకివ్వండి" అని చెప్పాడు. భరణి కూడా అదే అభిప్రాయం తెలిపాడు. కానీ నాగ్ ఈ అవకాశం కంటెస్టెంట్ల చేతుల్లో లేదని, బిగ్‌బాస్ నిర్ణయం మాత్రమే ఫైనల్ అని క్లారిటీ ఇచ్చేశారు. ఆడియన్స్ మాత్రం ఈ డ్రామా అంతా చూసిన తర్వాత "రేటింగ్ స్కెచ్" అంటూ కామెంట్లు చేస్తున్నారు. ఈ సీన్‌ను చూసే సమయంలో చాలామందికి సీజన్ 7లో టేస్టీ తేజ ఘటన గుర్తొచ్చింది. అప్పట్లో కూడా తేజకి పెట్టి అతడిని బాగా ఎమోషనల్ చేసి చివరకు అతడి అమ్మను హౌస్‌లోకి పంపారు. ఇప్పుడు అదే ఫార్ములా సంజన మీద వాడుతున్నారనే అభిప్రాయం బయట ఏర్పడుతోంది.

# నా క్యారెక్టర్ చాలా కాలం గుర్తుండిపోతుంది




హీరో అల్లరి నరేష్ అప్ కమింగ్ థ్రిల్లర్ '12 రైల్వే కాలనీ' ఎక్సయిటింగ్ ప్రమోషనల్ కంటెంట్ తో హ్యూజ్ బజ్ క్రియేట్ చేస్తోంది. నూతన దర్శకుడు నాని కాసరగడ్డ దర్శకత్వంలో, శ్రీనివాసా సిల్వర్ స్క్రీన్ బ్యానర్‌పై శ్రీనివాసా చిట్టూరి నిర్మించారు. పవన్ కుమార్ సమర్పణలో పొలిమేర మూవీ సిరీస్ తో పాపులరైన డాక్టర్ అనిల్ విశ్వనాథ్ షోరన్నర్‌గా పనిచేస్తున్నారు. ఆయన ఈ చిత్రానికి కథ, స్క్రీన్‌ప్లే, డైలాగ్స్ రాశారు. కామాక్షి భాస్కర్ల హీరోయిన్ గా నటిస్తున్నారు. నవంబర్ 21న ఈ సినిమా విడుదల కానుంది. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో కామాక్షి భాస్కర్ల ఈ సినిమా విశేషాలు పంచుకున్నారు.పొలిమేరతో మా జర్నీ స్టార్ట్ అయింది. నిజానికి నాకు యాక్టింగ్ తో పాటు రైటింగ్ కూడా ఇష్టం. పొలిమేర జరుగుతున్నప్పుడే డైరెక్షన్ డిపార్ట్మెంట్లో వర్క్ చేస్తానని ఆయనని రిక్వెస్ట్ చేశాను. అలా ఆయన ప్రతి సినిమాలో జర్నీ కొనసాగుతుంది. పొలిమేర సినిమాలో నా పెర్ఫార్మెన్స్ ని అందరూ అభినందించారు. ప్రత్యేకంగా నాకోసం ఒక పేరాగ్రాఫ్ రాశారు. మంచి పర్ఫార్మెన్స్ ఉన్నప్పుడు ఎందుకు పాత్రలు ఇవ్వకూడదనేది అనిల్ గారి ఉద్దేశం. ఇప్పుడు వరకు చేసింది రెండే సినిమాలు. ఆ రెండు సినిమాల్లో కూడా నేను ఉన్నాను.ఇందులో నరేష్ గారికి జోడిగా కనిపిస్తాను. నా క్యారెక్టర్ పేరు ఆరాధన. నా క్యారెక్టర్ ఎక్కడ నుంచి వచ్చింది ఏం చేస్తుందనేది చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. తన పని మీదే శ్రద్ధ పెట్టే క్యారెక్టర్. అలాంటి లైఫ్ లో వచ్చిన ప్రేమ స్టోరీ ఎలా ముందుకెళ్ళింది అనేది చాలా ఇంట్రెస్టింగ్ గా ఉంటుంది. ఆరాధన క్యారెక్టర్ ఈ సినిమాకి చాలా ఇంపార్టెంట్. తన క్యారెక్టర్ లేకపోతే ఈ కథ లేదు. సినిమా చూసిన తర్వాత నా క్యారెక్టర్ గుర్తుండిపోతుంది. అల్లరి నరేష్ గారితో నటించడం అనేది నా కెరియర్ కి చాలా మైలేజ్ ఇస్తుంది. నరేష్ గారితో ఇంతకుముందు ఇట్లు మారేడుమిల్లి సినిమా చేశాను. నాకు చిన్నప్పటినుంచి నరేష్ గారు పర్సనల్ గా తెలుసు. నరేష్ గారు చాలా సైలెంట్ పర్సన్. మేము ఎప్పుడు కూడా సినిమాలు గురించి మాట్లాడుతుంటాము. ఆయన అద్భుతమైన నటుడు. ఆయన నుంచి చాలా విషయాలు నేర్చుకున్నాను.శ్రీ విష్ణు గారు సుహాస్ గారు విజయ్ సేతుపతి గారు ఇలా చాలామంది హీరోలు అన్ని రకాల పాత్రలు చేసుకుంటూ వచ్చారు. అయితే ఫిమేల్ యాక్ట్రెస్ కి ఆ యాక్సెప్టెన్సీ లేదు. అలా ఎందుకు ఉండకూడదు అని ఒక ఛాలెంజ్ గా తీసుకుని ఒక రిస్క్ తీసుకునే ఇలా పాత్రలు చేస్తున్నాను. ఐదేళ్లు నా కెరియర్ లో విరూపాక్ష పొలిమేర చిత్రాలు చాలా మంచి పేరు తీసుకొచ్చాయి. నిజానికి లైలా సినిమాలో నా క్యారెక్టర్ చాలా కీలకం, ఆ క్యారెక్టర్ చుట్టే కథ ఉంటుంది. ఆ సినిమా వర్కౌట్ అయి ఉంటే మంచి పేరు వచ్చేది. అయితే నేను ఏదైనా సరే ఒక క్రియేటివ్ యాంగిల్ లోనే చూస్తాను. అలాగే మీరు డాక్టర్ కదా.. ఇప్పటికీ ప్రాక్టీస్ చేస్తున్నారా? అన్న ప్రశ్నకు సమాధానం ఇస్తూ.. నేను జనరల్ ఫిజీషియన్ ని. అపోలో లో ప్రాక్టీస్ చేశాను. అయితే కోవిడ్ కి ముందు ఆపేశాను. ఇప్పుడు పూర్తిగా నటనతోనే బిజీగా ఉన్నాను. అయితే నేను పనిచేస్తున్న సినిమా సెట్ లో నన్ను డాక్టర్ గా యూజ్ చేస్తుంటారు (నవ్వుతూ) ఇండియన్ సినిమాలో పారామెడికల్ కల్చర్ తక్కువ. అలాంటి పారామెడికల్ కల్చర్ ని తెలుగు సినిమాలో తీసుకురావాలనే ఆలోచన ఉంది అని చెప్పుకొచ్చింది.

# కొత్త ట్రెండ్‌కు తెరలేపిన నేషనల్ క్రష్



చిన్న సినిమాతో టాలీవుడ్‌లో అడుగుపెట్టి నేషనల్ క్రష్‌గా ఎదిగింది రష్మిక. పుష్ప సినిమాతో శ్రీవల్లిగా అభిమానులను అలరించిన ఈ క్రేజీ భామ ఇటీవల గర్ల్‌ఫ్రెండ్ అంటూ ప్రేక్షకులను పలకరించింది. అన్ని వర్గాల ప్రేక్షకులను అలరిస్తూ, యూత్ ను ఆకట్టుకుంటున్న రష్మిక.. బాలీవుడ్ లో కూడా సత్తాచాటి బడా స్టార్ల సరసన చాన్స్ కొట్టేస్తున్నారు.'దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలి' అనే సామెత సినీ పరిశ్రమకు చక్కగా సరిపోతుంది. ఒక్క హిట్? పడితే చాలు హీరోహీరోయిన్లు భారీగా రెమ్యునరేషన్? పెంచేస్తున్నారు. ముఖ్యంగా హీరోయిన్లు ఈ టెక్నిక్?ను ఫాలో అవుతూ ప్రొడ్యూసర్లకు షాక్? ఇస్తున్నారు. ఒకప్పుడు హీరోయిన్ల దృష్టంతా వరుస సినిమాలు, స్టార్? హీరోల పక్కన ఛాన్సులపైనే ఉండేది. కానీ ఈతరం హీరోయిన్లు మాత్రం రెమ్యునరేషనే లక్ష్యంగా కెరీర్?ని ప్లాన్? చేసుకుంటున్నారు.ఇదే ఇప్పుడు ఇండస్ట్రీలో ట్రెండ్?గా మారింది. సాధారణంగా హీరోలు, హీరోయిన్లు స్క్రిప్ట్ ఆమోదించిన తర్వాతే రెమ్యునరేషన్ ఫిక్స్ చేసుకుంటారు. కానీ గత కొన్నేళ్లుగా కొందరు స్టార్లు ముందు షూటింగ్ పూర్తి చేసి, రిలీజ్ తర్వాత కలెక్షన్ల ఆధారంగా పారితోషికం తీసుకుంటున్నారు. పాన్-ఇండియా స్టార్ రష్మిక మందన్నా తన లేటెస్ట్ ఫిల్మ్ 'ద గర్ల్‌ఫ్రెండ్' తో ఈ జాబితాలో చేరిపోయింది. నిర్మాత ధీరజ్ మోగ్రే ప్రమో ఈవెంట్‌లో స్వయంగా ఈ విషయాన్ని బయటపెట్టారు.నిర్మాత ఏం చెప్పారంటేనిర్మాత ధీరజ్ మాట్లాడుతూ.. 'రష్మిక మా సినిమాకు పూర్తి కమిట్‌మెంట్ ఇచ్చింది. షూటింగ్‌లో ఎలాంటి డిమాండ్లు లేకుండా స్క్రిప్ట్‌కు ప్రాధాన్యత ఇవ్వడం మా ప్రాజెక్ట్‌కు బూస్ట్ అయింది. రిలీజ్ తర్వాత కలెక్షన్ల బట్టి రెమ్యునరేషన్ ఫైనల్ చేద్దాం అని ఆమెనే ప్రతిపాదించింది' అంటూ చెప్పుకొచ్చారు. ఇది రష్మిక ధైర్యానికి, సినిమాపై విశ్వాసానికి నిదర్శనం. ఎందుకంటే, ఫ్లాప్ అయితే ఆర్టిస్ట్‌కు రిస్క్ ఎక్కువ. అయినా రష్మిక లాంటి స్టార్లు ఇలా చేయడం ప్రొడ్యూసర్లకు ఎంకరేజ్‌మెంట్.రెమ్యునరేషన్? తగ్గించుకుని.నవంబర్ 7న రిలీజ్ అయిన 'ద గర్ల్‌ఫ్రెండ్'లో రష్మిక సోలో లీడ్‌గా అద్భుతంగా నటించింది. రాహుల్ రవీంద్రన్ డైరెక్షన్‌లో వచ్చిన ఈ ఎమోషనల్ లవ్ స్టోరీ యంగ్ గర్ల్ పాత్రలో ఆమె అదరగొట్టింది. రిలీజ్ నుంచే పాజిటివ్ రివ్యూలు వరుసలు. సోషల్ మీడియాలో ఫ్యాన్స్ హైప్ క్రియేట్ చేస్తున్నారు. మొదటి వీకెండ్‌లో తెలుగు, హిందీ వెర్షన్లు కలిపి రూ. 25 కోట్లు దాటింది. ట్రేడ్ అనాలిస్టుల ప్రకారం, వీక్‌డేస్‌లోనూ కలెక్షన్లు స్టెడీగా ఉన్నాయి.ఇప్పటివరకు గ్లోబల్ గ్రాస్ రూ. 35 కోట్లకు చేరువలో ఉందని సాక్షి, టైమ్స్ ఆఫ్ ఇండియా రిపోర్టులు చెబుతున్నాయి. బడ్జెట్ రూ. 15 కోట్లు మాత్రమే కావడంతో, ఇది బ్లాక్‌బస్టర్ సక్సెస్‌గా నిలిచింది. సాధారణంగా ఒక్కో మూవీకి రూ. 5-7 కోట్లు తీసుకుంటుందని ఇండస్ట్రీ సర్కిల్స్ టాక్. కానీ 'ద గర్ల్‌ఫ్రెండ్'కు బేస్ పే రూ. 3 కోట్లు మాత్రమే అని, మిగతా ప్రాఫిట్ షేర్ ఆధారంగా వచ్చే అవకాశం ఉందని స్పెకులేషన్లు. మూవీ సక్సెస్‌తో ఆమె రెమ్యునరేషన్ రూ. 8-10 కోట్ల వరకు బూస్ట్ అవుతుందని అంచనా.ఈ మోడల్ ప్రొడ్యూసర్లకు బడ్జెట్ ప్రెషర్ తగ్గిస్తుంది, కానీ ఆర్టిస్టులకు గ్యాంబుల్. రష్మిక లాంటి టాలెంటెడ్ యాక్ట్రెస్ ఇలా చేయడం యంగ్ హీరోయిన్లకు ఇన్‌స్పిరేషన్. 'ద గర్ల్‌ఫ్రెండ్' రన్ కంటిన్యూ అయితే, ఈ ట్రెండ్ ఇండస్ట్రీలో విస్తృతమవుతుందా? రష్మిక దీన్ని సెట్ చేస్తుందా? రష్మిక మరో ట్రెండ్ సెట్టర్?గా మారనుందా? తెలియాలంటే ఇంకొన్నాళ్లు వేచి చూడాల్సిందే!

# ఒకేఒక్క సినిమా హిట్ 7 ఫ్లాప్స్



సినిమా ఇండస్ట్రీలో ఎంతో మంది అందాల భామలు కొన్ని సినిమాలేక పరిమితం అవుతున్నారు. అందం, అభినయం ఉన్నప్పటికీ కొంతమంది భామలు నాలుగు ఐదు సినిమాలు చేసి ఆతర్వాత కనిపించకుండా పోతున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ సినిమాలు మానేసి పెళ్లి చేసుకొని సెటిల్ అవుతున్నారు.సినిమా ఇండస్ట్రీలో ఎంతో మంది అందాల భామలు కొన్ని సినిమాలేక పరిమితం అవుతున్నారు. అందం, అభినయం ఉన్నప్పటికీ కొంతమంది భామలు నాలుగు ఐదు సినిమాలు చేసి ఆతర్వాత కనిపించకుండా పోతున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ సినిమాలు మానేసి పెళ్లి చేసుకొని సెటిల్ అవుతున్నారుసినిమా ఇండస్ట్రీలో ఎంతో మంది అందాల భామలు కొన్ని సినిమాలేక పరిమితం అవుతున్నారు. అందం, అభినయం ఉన్నప్పటికీ కొంతమంది భామలు నాలుగు ఐదు సినిమాలు చేసి ఆతర్వాత కనిపించకుండా పోతున్నారు. ఇప్పటికే చాలా మంది హీరోయిన్స్ సినిమాలు మానేసి పెళ్లి చేసుకొని సెటిల్ అవుతున్నారు.దాంతో అభిమానులు ఈ ముద్దుగుమ్మల కోసం సోషల్ మీడియాలో గాలిస్తున్నారు. ఇప్పుడు ఓ చిన్నదాని కోసం నెటిజన్స్ గూగుల్ లో తెగ గాలిస్తున్నారు. ఇంతకూ ఆ భామ ఎవరో తెలుసా.? తెలుగులో ఈ బ్యూటీ చేసింది ఎనిమిది సినిమాలు కానీ హిట్ అయ్యింది మాత్రం ఒకే ఒక్క సినిమా.దాంతో అభిమానులు ఈ ముద్దుగుమ్మల కోసం సోషల్ మీడియాలో గాలిస్తున్నారు. ఇప్పుడు ఓ చిన్నదాని కోసం నెటిజన్స్ గూగుల్ లో తెగ గాలిస్తున్నారు. ఇంతకూ ఆ భామ ఎవరో తెలుసా.? తెలుగులో ఈ బ్యూటీ చేసింది ఎనిమిది సినిమాలు కానీ హిట్ అయ్యింది మాత్రం ఒకే ఒక్క సినిమా.అందంలో ఈ అమ్మడు అప్సరస.. కెరీర్ పీక్ లో ఉండగానే సినిమాలకు దూరం అయ్యింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? అందం, అభినయం ఉన్నా కూడా సక్సెస్ సాధించలేకపోయింది ఈ బ్యూటీ. హీరోయిన్ గా చేసింది, సెకండ్ హీరోయిన్ గాను చేసింది అయినా కూడా ఆమెకు అనుకున్నంతగా గుర్తింపు రాలేదు.అందంలో ఈ అమ్మడు అప్సరస.. కెరీర్ పీక్ లో ఉండగానే సినిమాలకు దూరం అయ్యింది. ఇంతకూ ఆమె ఎవరో తెలుసా.? అందం, అభినయం ఉన్నా కూడా సక్సెస్ సాధించలేకపోయింది ఈ బ్యూటీ. హీరోయిన్ గా చేసింది, సెకండ్ హీరోయిన్ గాను చేసింది అయినా కూడా ఆమెకు అనుకున్నంతగా గుర్తింపు రాలేదు.ఇంతకూ ఆమె ఎవరో కాదు టాలీవుడ్ బాపు బొమ్మ ప్రణీత సుభాష్. తన క్యూట్ లుక్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకున్న ప్రణీత సుభాష్ కు మంచి క్రేజ్ సొంతం చేసుకుంది. ఈ అమ్మడి అందానికి కుర్రకారు ఫిదా అయ్యారు. ఏం పిల్లో ఏం పిల్లడో సినిమాతో తెలుగు ప్రేక్షకులకు పరిచయం అయ్యింది ఈ అమ్మడు. హీరోయిన్ గా వరుసగా సినిమాలు చేసి మెప్పించింది.

# ఆ కోపంతో భార్యే పట్టించింది ఐబొమ్మ నిర్వాహకుడు రవి పోలీసులకు ఎలా చిక్కాడో తెలుసా




ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి ఎట్టకేలకు పోలీసులకు చిక్కాడు. శనివారం (నవంబర్ 15) సైబర్ క్రైమ్ పోలీసులు అతనిని అదుపులోకి తీసుకున్నారు. ఓ ముఖ్యమైన పని నిమిత్తం రవి శుక్రవారం (నవంబర్ 14) ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చాడని, కూకట్ పల్లిలోని రెయిన్ విస్టా ఫ్లాట్లో ఉండగా పోలీసులు మూకుమ్మడిగా దాడి చేసి మరీ అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు వెల్లడించారు. ఈ క్రమంలో రవి నివాసం నివాసం నుంచి కీలకమైన హార్డ్ డిస్కులు, ల్యాప్ టాప్స్, కంప్యూటర్లు, కొన్ని సినిమాలకు సంబంధించిన హెచ్ డీ ప్రింట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అలాగే ఐ-బొమ్మ వెబ్ సైట్ సర్వర్ నుంచి సమాచారం కూడా సేకరించారు. అప్ లోడ్ కు రెడీగా ఉన్న కొన్ని కొత్త సినిమాల హార్డ్ డిస్క్ లను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఇక విచారణంలో భాగంగా రవి నుంచి పోలీసులు కీలక విషయాలను రాబట్టినట్టు తెలుస్తోంది.కాగా రవి వైజాగ్ కు చెందిన వ్యక్తి. అయితే హైదరాబాదులో కూకట్ పల్లిలో అతనికి ఒక అపార్ట్మెంట్ ఉంది. ప్రస్తుతం అందులోనే నివాసముంటున్నాడు. అయితే రవికి గత కొంతకాలంగా తన భార్యతో విభేదాలు కూడా ఉన్నట్లు తెలుస్తుంది. ఇద్దరూ పరస్పర అంగీకారంతో విడాకులకు కూడా రెడీ అయినట్లు సమాచారం. ఇప్పుడు విదేశాలలో ఉన్నరవి తన భార్య నుంచి విడాకులు తీసుకోవడం కోసమే ఫ్రాన్స్ నుంచి హైదరాబాద్ వచ్చాడని టాక్. రవి హైదరాబాద్ వస్తున్నట్టు సమాచారాన్ని స్వయంగా అతని భార్యనే సైబర్ క్రైమ్ పోలీసులకు చేరవేసినట్టు తెలుస్తోంది. రవి భార్య సమాచారం ప్రకారం పోలీసులు రవి కదలికలపై నిఘా ఉంచి ఆయనని పక్కా పథకం ప్రకారం అరెస్టు చేశారని సమాచారం.ఏదేమైనా ఐ బొమ్మ నిర్వాహకుడు రవి అరెస్ట్ పట్ల సినిమా దర్శక నిర్మాతలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. కాగా రవి కరీబియన్ దీవుల్లో ఉంటూ.. పలు సినిమాలు, ఓటీటీ సినిమాలు పైరసీ చేస్తూ నిర్మాతలకు కంటిలో నలుసులా మారిన ఐ బొమ్మ నిర్వాహకుడు ఇమ్మడి రవి ఎట్టకేలకు అరెస్ట్ అయ్యాడు. శనివారం (నవంబర్ 15) హైదరాబాద్ సైబర్ క్రైమ్ పోలీసులు ఐ బొమ్మ రవిని అదుపులోకి తీసుకున్నారు. ఇక విచారణలో భాగంగా రవి నుంచి పోలీసులు కీలక సమాచారాన్ని రాబట్టినట్టు తెలుస్తుంది. ల మూవీస్ పైరసీలు చేస్తున్నాడు. దీంతో ఇటీవలే టాలీవుడ్ నిర్మాతలు పైరసీపై చర్యలు తీసుకోవాలని హైదరాబాద్ పోలీసులను ఆశ్రయించిన సంగతి తెలిసిందే. ఈ కేసును సీరియస్ గా తీసుకున్న పోలీసులు గత కొద్ది రోజులుగా చాలామందిని అరెస్ట్ చేశారు. ఇప్పుడు ఐ బొమ్మ నిర్వాహకుడిని అరెస్ట్ చేశారు.